www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మేడిగడ్డ బ్యారేజీ 7వ బ్లాకుపై ఫోకస్

- పటిష్టం చేయడమా లేదా సురక్షితంగా తొలగించడమా?
- ఎన్‌డీఎస్‌ఏ సిఫారసుల మేరకు పరిష్కారాలను సూచించండి
- టెక్నికల్ బిడ్‌లో అర్హత సాధించిన సంస్థలను కోరిన ప్రభుత్వం
- కాళేశ్వరం పునరుద్ధరణ ఖర్చు నిర్మాణ సంస్థలే భరించాలి
- స్పష్టం చేసిన నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

13

తుమ్మిడిహెట్టి బ్యారేజీ డీపీఆర్ కోసం టెండర్లు

26 వరకు గడువు
డీపీఆర్ తర్వాత నిర్మాణ అంచనా వ్యయంపై స్పష్టత

గురువారం | 13-11-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 225 |

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం, తిథి: నవమి రా.11.34 తదుపరి దశమి; నక్షత్రం: మఖ రా.7.38 తదుపరి పుబ్బ; వర్జ్యం: ఉ.7.06-8.46, తె.4.12-5.54; దుర్ముహూర్తం: ఉ.10.07-10.52, మ.2.36-3.21; అమృతఘడియలు: సా.5.07-6.47; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.22; సూర్యాస్తమయం: 5.35

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

క్షమాపణల కాలమ్..



తప్పు చేశా..
ఏబీవీ, కృష్ణకిశోర్‌లపై చర్యలకు అనుమతిపై ఏపీ మాజీ ఐఏఎస్ ప్రవీణ్ ప్రకాశ్ క్షమాపణ 10



చింతిస్తున్నా..
నాగార్జున కుటుంబంపై వ్యాఖ్యలకు మంత్రి కొండా సురేఖ పశ్చాత్తాపం 10



క్షమించండి!
బెట్టింగ్ యాప్‌లకు ప్రచారంపై సినీనటుడు ప్రకాశ్ రాజ్

టర్కీ నుంచి కుట్ర

ఆపరేషన్ సిందూర్ దెబ్బతో టర్కీ కేంద్రంగా జైషే మహ్మద్ సంస్థ కార్యకలాపాలు

- ఫరీదాబాద్ ఉగ్రవాదులకు అక్కణ్నుంచే ఆదేశాలు.. భారత్‌లో ఒకేసారి 200 బాంబు పేలుళ్లకు కుట్ర
- దీపావళికే అమలు చేయాలని ప్రణాళిక.. అది తప్పడంతో డిసెంబరు 6న దాడికి పన్నాగం
- ఉమర్ నబీ జరపాలని నిర్ణయం.. సహచరులు దొరికిపోవడంతో ఎర్రకోట వద్ద ఆత్మాహుతి దాడి
- పోలీసుల అదుపులో ఉన్న డాక్టర్ ముజమ్మిల్ వెల్లడి!.. హరియాణాలో మరో కారు గుర్తింపు
- భూటాన్ నుంచి తిరిగొచ్చిన ప్రధాని మోదీ.. ఆస్పత్రిలో క్షతగాత్రులకు పరామర్శ

న్యూఢిల్లీ, నవంబరు 12: పాకిస్థాన్‌లో కూర్చుని కుట్రలు చేసి భారత్‌లో దాడులకు పాల్పడే ఉగ్రవాదులు.. తాజాగా రూటు మార్చారు. పాక్‌లోని ఉగ్ర స్థావరాలను భారత్ ధ్వంసం చేయటంతో స్థావరాలను టర్కీకి మార్చారు. సోమవారం ఢిల్లీలో కారు బాంబు దాడికి పాల్పడిన ఫరీదాబాద్ ఉగ్ర ముఠాకు.. జైషే మహ్మద్ ఉగ్రవాదులు టర్కీ నుంచి ఆదేశాలు ఇచ్చినట్లు భారత నిఘా సంస్థలు గుర్తించాయి. దర్యాప్తులో సంచలన విషయాలు బయటకొస్తున్నాయి. కనీవినీ ఎరుగని రీతిలో దేశవ్యాప్తంగా ఏకకాలంలో 200 చోట్ల శక్తిమంతమైన బాంబులు పేల్చి అల్లకల్లోలం సృష్టించాలని కుట్ర చేసినట్లు తేలింది. గత దీపావళి పండుగ సందర్భంగానే ఈ కుట్రను అమలు చేయాలని భావించినప్పటికీ వీలు కాకపోవటంతో డిసెంబర్ 6న, జనవరి 26న దాడి చేయాలని ప్రణాళిక వేసినట్లు గుర్తించారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్థాన్ ఉగ్ర స్థావరాలన్నింటినీ భారత సైన్యం ధ్వంసం చేయటంతో అక్కడి ఉగ్ర ముఠాలు

మిగతా 2వ పేజీలో...



ఢిల్లీలోని ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రిలో ఓ క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న మోదీ

ఎర్రకోట వద్ద పేలుడు..
ఉగ్ర ఘాతుకమే

- దేశవ్యతిరేక శక్తులు ఈ ఘోరానికి పాల్పడ్డాయి
- ఈ పిరికిపంద దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం
- కేంద్ర క్యాబినెట్ తీర్మానం

2

అల్ ఫలాహ్ వర్సిటీపైనే ఫోకస్!

పరారీలో మరో ఉగ్ర వైద్యుడు నిసారుల్ హసన్!

- జూబ్లీహిల్స్‌లో 'ఓటు' సిత్రాలు

ఓటెయ్యని వారు డబ్బు తిరిగి ఇవ్వాల్సిందే



- పార్టీల బూత్ కమిటీ సభ్యుల డిమాండ్
- బస్తీలు, కాలనీల్లో ఓటర్ లిస్టు ఆధారంగా ఓటెయ్యని వారిని గుర్తిస్తున్న నేతలు
- ఓ ఇంట్లో 18 ఓట్లుంటే పోలైంది నాలుగే
- మిగిలిన 14 మంది డబ్బులిచ్చేయాలని హుకుం
- ఓటెయ్యని వారి నుంచి డబ్బు వసూలు చేసి.. కాలనీల్లో పనులకు వాడాలనే యోచన
- అపార్ట్‌మెంట్లలో సగం మంది ఓటెయ్యని వైనం

హైదరాబాద్ సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో చిత్రవిచిత్రాలు వెలుగుచూస్తున్నాయి. ఈ స్థానాన్ని ఎలాగైనా దక్కించుకోవాలని అధికార కాంగ్రెస్.. ఎట్టి పరిస్థితుల్లోనూ సిటింగ్ సీటును కోల్పోకూడదని బీఆర్ఎస్ పార్టీలు హోరాహోరీగా పోరాడాయి. బీజేపీ కూడా విస్తృతంగా ప్రచారం చేసింది. ఈ క్రమంలో రాజకీయ పార్టీలు విచ్చలవిడిగా డబ్బు ఖర్చు పెట్టాయి. ఇదంతా సాధారణంగా జరిగేదే కదా.. అనుకుంటున్నారా? ఇక్కడే మొదలైంది అసలు కథ..! ఓటు వేసేందుకు నోటు తీసుకున్న వారికి సినిమా కష్టాలు మొదలయ్యాయి. డబ్బు తీసుకొని

మిగతా 3వ పేజీలో...

ఢిల్లీలో నేడు యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ ఫోరం సదస్సు

పాల్గొనేందుకు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి 3

సివిల్స్ మెయిన్స్ ఫలితాలు విడుదల 2

దేశవ్యాప్తంగా ఇంటర్వ్యూకు 2,736 మంది ఎంపిక

మెరిసిన 'రాజీవ్ సివిల్స్ అభయ హస్తం' అభ్యర్థులు 13

ఇంటర్వ్యూకు 43 మంది ఎంపిక
అభ్యర్థులకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి అభినందన
ఇప్పటి వరకు 342 మందికి రూ.3.62 కోట్ల ప్రోత్సాహకం

చలి ముట్టడిలో తెలంగాణ

- 'కోర్ కోల్డ్ వేవ్ జోన్‌'లో రాష్ట్రం
- వచ్చే 3, 4 రోజులు మరింత చలి
- 12.5 నుంచి 8.5 డిగ్రీలకు పడిపోయే అవకాశం
- సిర్పూర్ (యూ)లో 10.2 డిగ్రీలు నమోదు
- ఉష్ణోగ్రతలు పడిపోవడంతో ఆరోగ్య సమస్యలు
- తీవ్రమవుతున్న శ్వాసకోశ సమస్యలు, నిమోనియా, దగ్గు, జలుబు, తలనొప్పి, ఒళ్లు నొప్పులు
- పిల్లలు, వృద్ధులు అప్రమత్తం.. వైద్యులు సూచన
- ఆస్పత్రులకు పెరుగుతున్న చలి బాధితుల తాకిడి



హైదరాబాద్/ఆసిఫాబాద్/ఆదిలాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నడూ లేనట్టుగా చలి తీవ్రత బాగా పెరిగింది. ఒక్కసారిగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోయాయి. మరికొన్ని రోజులూ ఇదే పరిస్థితి ఉంటుందని, చలి మరింత పెరుగుతుందని వాతావరణ శాఖ

మిగతా 14వ పేజీలో...



కేసీఆర్‌పై జనవరి 19 దాకా చర్యలొద్దు 13

- మధ్యంతర ఉత్తర్వుల్ని పొడిగించిన హైకోర్టు
- ప్రభుత్వ కౌంటర్లలో జాప్యంపై అసహనం

జాగృతికి బీఆర్ఎస్ దుష్మన్ 12

- జాగృతిని విమర్శించడాన్ని ఆ పార్టీ నేతలు పనిగా పెట్టుకున్నారు
- సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం
- నిర్వాసితుల సమస్య పరిష్కరించకుంటే సీఎం ఇంటి ముందు ధర్నా: కవిత

సివిల్స్ మెయిన్స్ ఫలితాలు విడుదల

» ఇంటర్వ్యూకు 2,736 మందికి అర్హత

» వారిలో తెలంగాణ నుంచి 43 మంది

న్యూఢిల్లీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) సివిల్ సర్వీసెస్ (మెయిన్)-2025 ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. దేశవ్యాప్తంగా ఆగస్టు 22 నుంచి 31 వరకు ఈ పరీక్షలు నిర్వహించారు. వీటిల్లో మొత్తంగా 2,736 మంది అభ్యర్థులు పర్సనాలిటీ టెస్ట్ (ఇంటర్వ్యూ)కు అర్హత సాధించినట్టు యూపీఎస్సీ ప్రకటించింది. ఎంపికైన అభ్యర్థుల జాబితాను తన అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. ఇంటర్వ్యూ పూర్తయిన తర్వాత మెయిన్, ఇంటర్వ్యూకి కలిపి మొత్తం వచ్చిన మార్కులతో మెరిట్ లిస్ట్ విడుదల చేస్తారు. ఈ మార్కుల ఆధారంగా ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్), ఇండియన్ ఫారిన్ సర్వీస్ (ఏఎఫ్ఎస్), ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్)తో పాటు ఇతర కేంద్ర సరీసులకు అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అయితే, తెలంగాణలో సివిల్స్ అభ్యర్థులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం కింద ఆర్థిక సహకారం అందిస్తున్న సంగతి తెలిసిందే. ఈసారి సివిల్స్‌కు ఎంపికైన 2,736 మందిలో ప్రభుత్వం చేయూతనిచ్చిన 43 మంది ఉన్నారు.

తీర్పుల వివరాలన్నీ వెల్లడించాలి

» వెబ్‌సైట్లలో డ్యాష్‌బోర్డు ఏర్పాటు చేయాలి

» అన్ని హైకోర్టులనూ ఆదేశించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, నవంబరు 12: న్యాయస్థానాలు ఇచ్చే తీర్పుల విషయంలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దేశంలోని అన్ని రాష్ట్రాల హైకోర్టులు తమతమ వెబ్‌సైట్లలో ఒక డ్యాష్‌బోర్డును ఏర్పాటు చేసి, అందులో తీర్పుల వివరాలను వెల్లడించాలని ఆదేశించింది. ఈ ఏడాది జనవరి 31 తర్వాత రిజర్వ్ చేసిన తీర్పులు, వెల్లడించిన తీర్పులు, అప్‌లోడ్ చేసిన తేదీలతో సహా డ్యాష్‌బోర్డును ఏర్పాటు చేయాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చిల ధర్మాసనం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ఝార్ఖండ్ హైకోర్టు సహా పలు హైకోర్టులు సివిల్, క్రిమినల్ కేసుల్లో తుది వాదనలు పూర్తయిన తర్వాత కూడా ఏళ్ల తరబడి తీర్పులు ఇవ్వకపోవడాన్ని ధర్మాసనం తీవ్రంగా పరిగణించింది. ఈ క్రమంలోనే తీర్పుల వివరాలన్నీ ప్రజలకు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేసింది.

'కొడుకా.. ఇంటికి రా..'



మావోయిస్టు నేత హిడ్మాకు తల్లి వేడుకోలు

చర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): 'ఇప్పటికైనా ఇంటికిరా.. కొడుకా' అంటూ మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మాద్వి హిడ్మాకు అతడి తల్లి కన్నీటి విజ్ఞప్తి చేసింది. రెండు రోజుల క్రితం ఛత్తీస్‌గఢ్ హోంమంత్రి విజయశర్మ, హిడ్మా తల్లిని కలిసి కుమారుడిని లొంగిపోయేలా నచ్చజెప్పాలని సూచించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే హిడ్మా తల్లి మాట్లాడిన ఓ వీడియో సందేశాన్ని మంగళవారం పోలీసులు విడుదల చేశారు. "బిడ్డా ఇంటికి వచ్చి సాధారణ జీ వితం గడుపు. లేదంటే నేనే అడవి బాట పడుతా. నీ కోసం కుటుంబమంతా ఎదురు చూస్తోంది' అంటూ హిడ్మా తల్లి మాట్లాడింది. రెండు నిమిషాల నిడివి ఉన్న ఈ వీడియో సందేశంలో హిడ్మా తల్లి గోండు భాషలో మాట్లాడగా.. ప్రస్తుతం అది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అలాగే, మరో మావోయిస్టు నేత దేవా తల్లితోనూ పోలీసులు ఇదే తరహా వీడియో విడుదల చేశారు. పూవర్తి గ్రామానికి చెందిన హిడ్మా, దేవా వరసకు అన్నదమ్ములవుతారు. దండకారణ్యంలో జరిగిన అనేక హింసాత్మక ఘటనల్లో వీరిద్దరూ కీలక వ్యూహకర్తలుగా ఉన్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఓపీటీ మరింత కఠినం

» అంతర్జాతీయ విద్యార్థుల నియంత్రణకు కొత్త నిబంధన ప్రతిపాదించిన అమెరికా

న్యూఢిల్లీ, నవంబరు 12: విదేశీ విద్యార్థులపై మరింత కఠినంగా వ్యవహరించడానికి ట్రంప్ యంత్రాంగం సిద్ధమవుతోంది. అంతర్జాతీయ విద్యార్థుల రాకను నియంత్రించడానికి ఇమ్మిగ్రేషన్ నిబంధనల్లో యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) ఓ కొత్త ప్రతిపాదన తెచ్చింది. ఆ విద్యార్థుల ఉద్యోగం కోసం ఉన్న ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ) అవకాశాన్ని పూర్తిగా తొలగించేందుకు లేదా దానికి పరిమితులు విధించేందుకు ఆ ప్రతిపాదన అవకాశం కల్పిస్తుంది. ఈ నిబంధనను ఫెడరల్ రెగ్యులేటరీ అజెండాలో పొందుపర్చారు. ఈ ఏడాది చివర్లో లేదా వచ్చే ఏడాది ప్రారంభంలో ఆ నిబంధనను ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ నిబంధనను అమలు చేస్తే విదేశీ విద్యార్థులు అమెరికాలో చదవకుండా, పని చేయకుండా ఇప్పటికే తీసుకుంటున్న చర్యలకు ఇదొక అదనపు అడ్డంకిగా ఉంటుందని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

అమెరికాలో తగినంత ప్రతిభావంతులు లేరు

» విదేశీ ఉద్యోగుల అవసరం ఉంది

» హెచ్1బీపై డొనాల్డ్ ట్రంప్ యూటర్న్

న్యూయార్క్, నవంబరు 12: విదేశీ ఉద్యోగులపై ఆంక్షలతో తన యంత్రాంగం ఓ పక్క విరుచుకుపడుతుంటే.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాత్రం హెచ్1బీ వీసాలపై యూటర్న్ తీసుకున్నారు. అమెరికాలోని వివిధ విభాగాల్లో పనిచేసేందుకు విదేశీ ఉద్యోగులను తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. తాజాగా ఫాక్స్ టీవీతో ట్రంప్ మాట్లాడారు. అమెరికాలోనే సమృద్ధిగా ప్రతిభావంతులు ఉన్నారు కదా.? అన్న ప్రశ్నకు జవాబిస్తూ 'మనదేశంలో లేరు' అంటూ కరాకండిగా చెప్పారు. పలు విభాగాల్లో ప్రతిభగల వారి కొరత ఉందని పేర్కొన్నారు. అమెరికా ఉద్యోగులు బయటనుంచి వచ్చిన వారి వద్ద నేర్చుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. సరైన శిక్షణ లేకుండా, నిరుద్యోగులు అనే పేరుతో ఫ్యాక్టరీల్లో ఉద్యోగాల్లో పెట్టలేమన్నారు. తన ప్రభుత్వానికి హెచ్1బీ వీసా పెద్ద ప్రాధాన్యం కాదని ఆయన అన్నారు.

భారత్‌లోని అమెరికా బ్యాంకుల్లో పెరిగిన నియామకాలు

న్యూఢిల్లీ, నవంబరు 12: అమెరికా బ్యాంకులు భారత్‌లోని తమ కార్యాలయాల్లో నియామకాలను ఒక్కసారిగా పెంచేశాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్-1బీ వీసా నిబంధనలను కఠినతరం చేసిన నేపథ్యంలో ఈ చర్యలు తీసుకుంటున్నాయి. జేపీ మోర్గాన్, గోల్డ్‌మ్యాన్, కేకేఆర్ అండ్ కో తదితర సంస్థలు హైదరాబాద్, బెంగళూరు, ముంబైలోని తమ కార్యాలయాల్లో ఇటీవల భారీగా నియామకాలు చేపడుతున్నాయి. బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగంలోని వివిధ విభాగాల్లో పని చేసేందుకు నిపుణులను తీసుకుంటున్నాయి. భారత్‌లోని తమ కార్యాలయాల నుంచే వారితో పని చేయించుకుంటూ నిపుణుల కొరతను అధిగమించే ప్రణాళికలో ఆ సంస్థలు ఉన్నట్టు బ్లూమ్‌బర్గ్ ఓ కథనంలో పేర్కొంది.

ఓఆర్ఎస్ పేరున్న పాత స్టాక్ కూడా అమ్మొద్దు

» కంపెనీల విజ్ఞప్తిని తిరస్కరించిన ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ, నవంబరు 12: ఓఆర్ఎస్ పేరుతో ఉన్న ఎలాంటి పానీయాలను విక్రయించడానికి వీల్లేదని, ఇప్పటికే ఉన్న పాత స్టాకును అమ్ముకోవడానికి కూడా అనుమతించబోమని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ అంశం ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉందని, అందువల్ల అసలైన ఓఆర్ఎస్ పేరును వాడుతూ, తప్పుదారి పట్టించే ఈ ఉత్పత్తులు మార్కెట్లో ఉండటానికి వీల్లేదని స్పష్టం చేసింది. వాంతులు, విరేచనాల బారినపడిన వారికి శరీరంలో ద్రవాలు, అత్యవసర లవణాల సమతుల్యతను కాపాడుకోవడం కోసం ఓఆర్ఎస్ (ఓరల్ రీహైడ్రేషన్ సాల్ట్స్) ఇస్తారు. అయితే ఈ పేరును తలపించేలా ఓఆర్ఎస్ఎల్, ఇతర పేర్లపై కొన్ని కంపెనీలు చక్కెర ఎక్కువగా కలిపిన పానీయాలను అమ్మడం మొదలుపెట్టాయి. దీనిపై ఫిర్యాదులు రావడంతో ఇటీవలే జాతీయ ఆహార ప్రమాణాల సంస్థ.. ఓఆర్ఎస్ పేరుతో ఎలాంటి పానీయాలు విక్రయించవద్దని కంపెనీలను ఆదేశించింది. ఓఆర్ఎస్ఎల్ పేరిట పానీయాలు విక్రయించే జేఎన్‌టీఎల్ సంస్థ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. తాము విక్రయిస్తున్న పానీయాలు హానికరమేమీ కాదని.. పాత స్టాకును అయినా అమ్ముకునేందుకు అనుమతించాలని కోరింది. కానీ దీనికి కోర్టు తిరస్కరించింది.

టర్కీ నుంచి కుట్ర

(మొదటిపేజీ తరువాయి)



ఎర్రకోట వద్ద పేలుడు ధాటికి దెబ్బతిన్న వాహనాలను పరిశీలిస్తున్న అధికారులు

సురక్షితమైన కొత్త స్థావరాన్ని వెతుక్కున్నాయి. నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (నాటో)లో భాగమైన టర్కీని ఉగ్ర డెన్‌గా మార్చుకున్నాయి. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ వంటి దేశాలు భాగస్వామిగా ఉన్న నాటో కూటమి సభ్య దేశాలపై ఎవరు దాడి చేసినా ఇతర సభ్యదేశాలన్నింటిపై దాడి చేసినట్లుగానే భావించి అన్ని దేశాలు శత్రువుపై దాడి చేయాలన్న నిబంధన ఉండటంతో టర్కీపై భారత్ దాడి చేయదన్న ధీమాతో తమ కార్యకలాపాలను అక్కడికి మార్చినట్లు నిపుణులు చెబుతున్నారు. పాకిస్థాన్‌కు చెందిన జైషే మహ్మద్ ఉగ్రవాది ఒకరు టెలిగ్రాంలో రెండు గ్రూపుల ద్వారా ఫరీదాబాద్ కేసులో అరెస్టయిన వైద్యులను ఉగ్రవాదంవైపు ఆకర్షించినట్లు నిఘా వర్గాలు ఆధారాలు సంపాదించాయి. 'ఫర్జాందాన్ ఇ దారుల్ ఉలూమ్ (దీయోబంద్), ఉమర్ బిన్ ఖత్తబ్ అనే టెలిగ్రాం గ్రూపుల ద్వారా వీరు తరుచూ సంభాషించుకునేవారని గుర్తించారు. ఇటీవల జమ్మూకశ్మీర్ పోలీసులు అరెస్టు చేసిన వైద్యులను ఉగ్రవాదంపై మళ్లించాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న షోపియాన్‌కు చెందిన మత గురువు ఇమామ్ ఇర్ఫాన్ అహ్మద్ ఆగాహ్ ఈ టెలిగ్రాం గ్రూపుల ద్వారానే టర్కీలోని జైషే మహ్మద్ ఉగ్రవాదితో సంభాషించినట్లు భావిస్తున్నారు. ఈ గ్రూపుల ద్వారా కశ్మీర్ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేయాలని పిలుపునిస్తూ మెల్లిగా భారత్‌పై ఉగ్రదాడులు చేసేలా వారిని పురికొల్పినట్లు గుర్తించారు. ఎర్రకోట వద్ద ఆత్మాహుతి దాడికి పాల్పడిన ఉగ్రవాది ఉమర్ నబీ కూడా ఈ గ్రూపుల్లో సభ్యుడేనని భావిస్తున్నారు. ఇమామ్ ఇర్ఫాన్, నబీలు రెండుసార్లు టర్కీ వెళ్లి వారి జైషే హ్యాండ్లర్‌ను కలిసినట్లు నిఘా వరాల సమాచారం. ఆ తర్వాతే ఫరీదాబాద్ మాడ్యూల్ విస్తరణ వేగం పుంజుకుందని పేర్కొన్నాయి. మరింత మందిని ఉగ్రవాదంవైపు మళ్లించేందుకు, దాడులకు కావాల్సిన సరంజామాను సమకూర్చుకునేందుకు టర్కీ హ్యాండ్లర్ ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న ఉగ్ర డాక్టర్లను దేశంలోని వేర్వేరు ప్రాంతాల్లో పనిచేసేలా ప్రోత్సహించినట్లు అనుమానిస్తున్నారు. అందులో భాగంగా డాక్టర్ ముజమ్మిల్ అల్ ఫలాహ్ యూనివర్సిటీలో చేరగా, డాక్టర్ అదీల్ సహరాన్‌పూర్‌లో ఉద్యోగంలో చేరాడు. వీరంతా ఎవరెవరితో టచ్‌లో ఉన్నారు అనేదానిపై దర్యాప్తు అధికారులు ఇప్పుడు దృష్టి పెట్టారు.

ముంబై దాడుల తరహాలో పేలుళ్లకు కుట్ర..

ఈ ఉగ్రవాద ముఠా దేశంలో కనీవినీ ఎరుగని రీతిలో దాడులకు కుట్ర పన్నినట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. 2008 నవంబరు 26న పాకిస్థాన్ ఉగ్రవాదులు ముంబైలో మెరుపు దాడులకు పాల్పడిన తరహాలో దేశంలోని ప్రధాన నగరాల్లోని కీలక ప్రదేశాలు, రైల్వే స్టేషన్లు, పెద్దపెద్ద షాపింగ్ మాల్స్‌లో దాదాపు 200 చోట్ల ఏకకాలంలో అత్యంత శక్తిమంతమైన ఐఈడీ బాంబులు పేల్చి విధ్వంసం సృష్టించాలని ప్రణాళిక వేసినట్లు నిఘా వర్గాలు తెలిపాయి.

దీపావళికే దాడికి ప్రణాళిక

పోలీసుల అదుపులో ఉన్న డాక్టర్ ముజమ్మిల్ ఉగ్ర కుట్ర గురించి విచారణలో కీలక విషయాలు వెల్లడించినట్లు సమాచారం. గత దీపావళి రోజునే ఢిల్లీలో దాడులు చేయాలని ప్రణాళిక వేసినట్లు అతడు తెలిపాడు. అందుకోసం ఢిల్లీలోని ఎర్రకోట, ఇండియా గేట్, కాన్‌స్టిట్యూషన్ క్లబ్, గౌరీశంకర్ ఆలయం తదితర చోట్ల రెక్కీ నిర్వహించినట్లు అంగీకరించాడని తెలిసింది. ఈ పేలుళ్లకు గత జనవరి నుంచే ప్రణాళిక వేసినట్లు పోలీసులు తెలిపారు. దీపావళి ప్రణాళిక తప్పిపోవటంతో డిసెంబరు 6న (బాబ్రీ మసీదు కూల్చివేసిన రోజు) దేశవ్యాప్తంగా దాడులు చేయాలని ప్రణాళిక వేసినట్లు ముజమ్మిల్ తెలిపాడు. వచ్చే ఏడాది జనవరి 26న గణతంత్ర దినోత్సవాల సందర్భంగా ఢిల్లీలో భీకర దాడులకు కూడా కుట్ర చేసినట్లు ఒప్పుకున్నాడని సమాచారం. ఎర్రకోట బాంబుదాడికి కారణమైన ఉమర్ నబీ డిసెంబరు 6న దాడికి సిద్ధమయ్యాడని, అనుకోని విధంగా ఫరీదాబాద్ మాడ్యూల్ పోలీసులకు దొరికిపోవటంతో ముందుగానే ఎర్రకోట వద్ద దాడి చేశాడని దర్యాప్తు అధికారులు తెలిపారు. ఉమర్ నబీ ఆత్మాహుతి దాడికి ముందు రామ్‌లీలా మైదాన్ సమీపంలోని ఓ మసీదుకు వెళ్లినట్లు ఢిల్లీ పోలీసులు బుధవారం వెల్లడించారు.

బాధితులకు ప్రధాని పరామర్శ

కారు బాంబు దాడిలో గాయపడి ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ప్రధాని మోదీ బుధవారం పరామర్శించారు. భూటాన్ పర్యటన ముగించుకొని ఢిల్లీకి చేరుకున్న వెంటనే ఆయన నేరుగా ఆస్పత్రికి వెళ్లి బాధితులతో మాట్లాడారు. వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను ఆరా తీశారు. అనంతరం మోదీ ట్వీట్ చేశారు. 'ఆస్పత్రికి వెళ్లి బాధితులను కలిశాను. వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. బాంబు దాడి కుట్ర కారకులను చట్టం ముందు నిలబెడతాం' అని పేర్కొన్నారు.

నబీ మరో కారు లభ్యం



ఉమర్ నబీకి చెందిన మరో కారును పోలీసులు బుధవారం గుర్తించారు. ఎరుపు రంగు ఎకోస్పోర్ట్ కారు (డీఎల్10సీకే0458)ను ఫరీదాబాద్ జిల్లా ఖందవాలీలో సీజ్ చేశారు. ఈ కారులో కూడా బాంబులు అమర్చారేమోనన్న అనుమానంతో ఢిల్లీ పోలీసులు హరియాణా, యూపీ పోలీసులను అలర్ట్ చేసి బుధవారం భారీ ఎత్తున గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు హరియాణా పోలీసులు ఖందవాలీ గ్రామంలో దానిని గుర్తించటం, అందులో బాంబులు లేకపోవటంతో ఊపిరి పీల్చుకున్నారు.

లోకం తీరు



అల్ ఫలాహ్ వర్సిటీపైనే ఫోకస్!

భారీ బాంబు దాడులకు కుట్ర పన్నిన ఉగ్ర వైద్యులకు అడ్డాగా మారిన అల్ ఫలాహ్ యూనివర్సిటీ ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇటీవలి వరకు ప్రతిష్ఠాత్మక జామియా మిలియా, అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీలకు ప్రత్యామ్నాయంగా గుర్తింపు పొందిన అల్ ఫలాహ్ వర్సిటీ ఇప్పుడు ఉగ్ర మరకలతో అప్రతిష్ఠపాలైంది. హరియాణాలోని ఫరీదాబాద్ పట్టణ శివార్లలోని ధౌజ్‌లో 70 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో అల్ ఫలాహ్ ప్రైవేటు యూనివర్సిటీ ఉంది. ఇది 1997లో అల్ ఫలాహ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఒక ఇంజనీరింగ్ కాలేజీగా ప్రారంభమైంది. 2014లో ప్రైవేటు వర్సిటీగా గుర్తింపు పొందింది. 2019లో ఇందులో 200 ఎంబీబీఎస్ సీట్లతో వైద్య కళాశాలను, దానికి అనుబంధంగా 650 పడకల బోధనాస్పత్రిని ఏర్పాటు చేశారు. ఈ వర్సిటీ వైద్య కళాశాలలో రెసిడెంట్ డాక్టర్లుగా పనిచేస్తున్న ముజమ్మిల్ షకీల్, ఉమర్ మహమ్మద్, షహీన్ షాహిద్‌ల ఉగ్ర లింకులు బయట పడటం కలకలం రేపింది. కాగా, తమ వద్ద పని చేస్తున్న ఇద్దరు వైద్యులను పోలీసులు అరెస్టు చేసినట్టు తెలిసిందని, ఇక్కడ వారు నిర్వర్తించే విధులు మినహా మిగతా చర్యలతో వర్సిటీకి ఎలాంటి సంబంధం లేదని వర్సిటీ వైస్ చాన్సలర్ భూపిందర్ కౌర్ ఆనంద్ పేర్కొన్నారు.

పరారీలో మరో ఉగ్ర వైద్యుడు నిసారుల్ హాసన్!



అల్ ఫలాహ్ వర్సిటీలో పోలీసుల దర్యాప్తు సందర్భంగా మరో కీలక అంశం వెలుగులోకి వచ్చింది. వర్సిటీలో పనిచేస్తున్న మరో ఉగ్ర వైద్యుడు నిసారుల్ హాసన్ పరారీలో ఉన్నట్టు గుర్తించారు. శ్రీనగర్‌లోని శ్రీమహరాజా హరిసింగ్ ఆస్పత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న సమయంలో నిసారుల్ హాసన్‌కు ఉగ్రవాదులతో సంబంధం ఉన్నట్టు బయటపడింది. దీనితో 2023 నవంబర్‌లో నిసారుల్ హాసన్‌ను జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఉద్యోగం నుంచి తొలగించారు. తర్వాత నిసారుల్ అల్ ఫలాహ్ యూనివర్సిటీలోని వైద్య కళాశాలలో ప్రొఫెసర్‌గా చేరాడు.

11 రోజుల క్రితమే కారు కొని.. బాంబులతో సగం ఢిల్లీ చుట్టేసి!

ఎర్రకోట సమీపంలో భారీ పేలుడుకు కారణమైన హుండై ఐ20 పాత కారును 11 రోజుల క్రితమే కొనుగోలు చేసినట్టు దర్యాప్తు అధికారులు గుర్తించారు. జమ్మూకశ్మీర్‌లోని పుల్వామాకు చెందిన తారీఖ్ పేరిట తప్పుడు డాక్యుమెంట్లతో దాన్ని కొనుగోలు చేశారని తెలిసినట్టు అధికారులు చెప్పా రు. అక్టోబరు 29న దానిని కొనగానే పొల్యూషన్ సర్టిఫికెట్ తీసుకున్నారని.. తర్వాత నేరుగా తీసుకెళ్లి అల్ ఫలాహ్ వర్సిటీలో పార్కింగ్ చేశారని వెల్లడించారు. ఆ సమయంలో కారులో ముగ్గురు వ్యక్తులు ఉన్నారని గుర్తించినట్టు చెప్పారు. ఈ నెల 9న తోటి ఉగ్రవాదులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో ఉగ్ర వైద్యుడు ఉమర్ నబీ ఆందోళనకు గురై దాక్కున్నాడని.. ఈ నెల 10న పేలుడు పదార్థాలున్న ఆ కారును తీసుకుని ఢిల్లీ వైపు బయలుదేరాడని తెలిపారు. పేలుడుకు ముందు ఈ కారు దాదాపు సగం ఢిల్లీ అంతా చుట్టేసి వచ్చినట్టు గుర్తించామని దర్యాప్తు అధికారులు వెల్లడించారు. ఉగ్ర వైద్యుడు ఉమర్ ఢిల్లీలోని ఆరు జిల్లాల పరిధిలోని 12 కీలక ప్రాంతాల్లో సంచరించినట్టు తేలిందని చెప్పారు. జనసమ్మర్థం, ట్రాఫిక్ ఎక్కువగా ఉండే కీలక ప్రాంతాలు నేతాజీ సుభాష్ ప్లేస్, అశో క్ విహార్, కన్నాట్ ప్లేస్, రంజిత్ ఫ్లైఓవర్, డిలైట్ సినిమా, షహీద్ భగత్‌సింగ్ మార్గ్, రోహ్తక్ రోడ్, కశ్మీరీ గేట్, దరియాగంజ్, ఎర్రకోట తదితర చోట్లకు వెళ్లినట్టు సీసీ కెమెరాల ఫుటేజీలతో గుర్తించినట్టు చెప్పారు. నిఘాను తప్పుదారిపట్టించేందుకు గానీ, పోలీసులు, భద్రతా ఏర్పాట్లు ఏ మేరకు ఉన్నాయని పరిశీలించేందుకు గానీ ఉమర్ ఇలా కీలక ప్రాం తాల్లో తిరిగి ఉంటాడని వెల్లడించారు.

మెల్లగా వచ్చి.. ఒక్కసారిగా పేలి..

కారు బాంబు పేలుడుకు సంబంధించిన సీసీ కెమెరా దృశ్యాలు బుధవారం బయటికి వచ్చాయి. 15 సెకన్ల నిడివి ఉన్న వీడియోలో రోడ్డు మొత్తం ట్రాఫిక్‌తో నిండి ఉంది. వాహనాలు మెల్లగా కదులుతున్నాయి. సాయంత్రం 6.50 గంటల సమయంలో ఒక కారు పేలిపోయి భారీ అగ్నిగోళం ఏర్పడింది. ఆ కారుతోపాటు చుట్టుపక్కల ఉన్న వాహనాలు ధ్వంసమయ్యాయి. దాని ధాటికి సీసీ కెమెరాలు కూడా ధ్వంసమై వీడియో రికార్డింగ్ ఆగిపోయింది. ఆ క్షణం వరకు కంట్రోల్ రూమ్‌లో రికార్డయిన వీడియోను అధికారులు సేకరించారు.

నిర్మల సంతకం ఫోర్జరీ చేసి 99 లక్షలు చోరీ!

» పుణెలో సైబర్ నేరగాళ్ల దోపిడీ

ముంబై, నవంబరు 12: సైబర్ నేరగాళ్లు మరీ బరితెగిస్తున్నారు. ఏకంగా కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సంతకాన్ని ఫోర్జరీ చేసి ఓ వృద్ధమహిళ నుంచి రూ.99 లక్షలు కొట్టేశారు. ఈ ఘటన మహారాష్ట్రలోని పుణెలో జరిగింది. ఎల్ఐసీలో పని చేసి పదవీ విరమణ పొందిన 62 ఏళ్ల వయసున్న ఓ మహిళకు అక్టోబరు నెల చివరి వారంలో ఓ అపరిచిత వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. 'డేటా ప్రొటెక్షన్ ఏజెన్సీ' అనే ఓ ప్రభుత్వ సంస్థకు చెందిన వ్యక్తిగా పరిచయం చేసుకొని.. పలు తప్పుడు లావాదేవీలు, మనీల్యాండరింగ్ వ్యవహారాల్లో మీ ఫోన్ నెంబరును ఉపయోగించారని ఆ మహిళకు తెలిపాడు. ఆ తర్వాత మరొకడికి కాల్ కనెక్ట్ చేశాడు. ఆ వ్యక్తి.. తాను పోలీసు అధికారినని, మీ బ్యాంకు ఖాతాలను స్తంభింపజేస్తున్నామని, మీ మీద అరెస్టు వారెంటు జారీ అయ్యిందని భయపెట్టాడు. ఈ మేరకు ప్రభుత్వ లోగో, నిర్మలా సీతారామన్ సంతకంతో కూడిన ఓ పత్రాన్ని ఫోన్‌లోనే చూపించాడు. వయసు దృష్ట్యా మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేస్తున్నామని, ఖాతాల్లోని సొమ్మును పరిశీలించాల్సి ఉంది కాబట్టి, సొమ్మును ఆర్బీఐ అకౌంట్లకు బదిలీ చేయాలని ఆదేశించాడు. బెదిరిపోయిన ఆ వృద్ధ మహిళ పలు ఖాతాలకు రూ.99 లక్షలు బదిలీ చేశారు. ఈ మేరకు ఈడీ పేరిట ఓ తప్పుడు రశీదు కూడా ఆమెకు వాట్సాప్ చేశారు సదరు మోసగాళ్లు. ఆ తర్వాత వారికి ఆ మహిళ ఫోన్ చేయగా.. స్విచాఫ్ అని రావటంతో, మోసపోయానని గ్రహించి పోలీసుల కు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.


పీఎం, సీఎంల తొలగింపు బిల్లులపై జేపీసీ చీఫ్‌గా అపరాజితా సారంగి

న్యూఢిల్లీ, నవంబరు 12: ప్రధాని, ముఖ్యమంత్రులు, కేంద్ర, రాష్ట్రాల మంత్రులు తీవ్రమైన ఆరోపణలపై అరెస్టై, 30 రోజులకు మించి నిర్బంధంలో ఉంటే వారిని పదవీచ్యుతులను చేయాలనే అంశానికి సంబంధించిన బిల్లులను పరిశీలించేందుకు ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి బీజేపీ నేత అపరాజితా సారంగి అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. 31 మంది సభ్యులు గల ఈ కమిటీలో బీజేపీ నుంచి 15 మంది, ఎన్డీయే మిత్రపక్షాల నుంచి 11 మంది, ఒక నామినేటెడ్ సభ్యుడు ఉన్నారు. ఎన్డీయే మిత్రపక్షాల్లో టీడీపీ నుంచి లావు శ్రీకృష్ణదేవరాయలు, జనసేన నుంచి వల్లభనేని బాలశౌరి ఉన్నారు. ప్రతిపక్షాల్లో ఎన్సీపీ (ఎస్పీ) నేత సుప్రియా సూలే, అకాలీదళ్ నేత హర్‌సిమ్రత్ కౌర్ బాదల్, ఎంఐఎం నేత అసదుద్దీన్ ఓవైసీ, వైసీపీ నేత నిరంజన్‌రెడ్డి ఉన్నారు.

బాంబు పేలుడు ఉగ్ర ఘాతుకమే

దేశవ్యతిరేక శక్తులు పక్కా ప్రణాళికతో ఈ ఘోరానికి పాల్పడ్డాయి.. దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

» ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర క్యాబినెట్ తీర్మానం



న్యూఢిల్లీ, నవంబరు 12: లాల్‌ఖిలా వద్ద కారు బాంబు పేలుడును కేంద్ర ప్రభుత్వం దారుణమైన ఉగ్రవాద చర్యగా అభివర్ణించింది. దేశవ్యతిరేక శక్తులు పక్కాప్రణాళిక ప్రకారం ఈ ఘాతుకానికి పాల్పడ్డాయని మండిపడింది. ఈ కేసును వేగంగా దర్యాప్తు చేసి.. ఈ ఘోరానికి కారకులైనవారిని, వారి వెనుక ఉన్నవారిని చట్టం ముందుకు వీలైనంత త్వరగా తీసుకురావాలని దర్యాప్తు సంస్థలను ఆదేశించింది. ప్రభుత్వంలోని అత్యున్నతవర్గాలు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తుంటాయని స్పష్టం చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో బుధవారం ఇక్కడ సమావేశమైన కేంద్ర క్యాబినెట్.. ఎంతోమంది అమాయకుల ప్రాణాలను బలిగొన్న దుర్మార్గమైన, పిరికిపంద ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొంటూ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా దాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమన్న విధానానికి భారత్ కట్టుబడి ఉందని పునరుద్ఘాటించింది. ఈ ఉగ్ర ఘాతుకానికి బలైన అమాయకులకు నివాళిగా క్యాబినెట్ రెండు నిమిషాలపాటు మౌనం పాటించింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపింది. ఈ పేలుడులో గాయపడ్డవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించింది. దేశంలోని ప్రతి పౌరుడి ప్రాణాలను కాపాడేందుకు, దేశ భద్రతను, దేశ సమగ్రతను కాపాడేందుకు కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించింది. క్యాబినెట్ భేటీ ముగిసిన అనంతరం.. ఆ విశేషాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకరులకు వెల్లడించారు. ఈ ఉగ్రదాడిని యుద్ధచర్యగా (యాక్ట్ ఆఫ్ వార్) పరిగణిస్తారా? అని విలేకరులు ప్రశ్నించగా.. 'నేను ఇప్పటికే మంత్రివర్గం ఆమోదించిన తీర్మానాన్ని చదివి వినిపించాను' అని బదులిచ్చారు. కాగా, ఈ భేటీకి ముందు ప్రధాని నరేంద్ర మోదీ.. 'భద్రతపై క్యాబినెట్ కమిటీ' భేటీని నిర్వహించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్ షా తదితరులు ఆ సమావేశంలో పాల్గొన్నారు.

మరికొన్ని కీలక నిర్ణయాలు..

ఎర్రకోట వద్ద ఉగ్రదాడిని ఖండిస్తూ తీర్మానం చేయడంతోపాటు.. కేంద్ర క్యాబినెట్ కొన్ని కలీక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. దేశ ఎగుమతి వ్యవస్థ బలోపేతానికిగాను 2025-26 నుంచి 2030-31 వరకూ రూ.25,060 కోట్లతో ప్రతిపాదించిన 'ఎగుమతి ప్రోత్సాహక మిషన్(ఈపీఎం)'కు ఆమోదం తెలిపింది. ఈ మిషన్‌లో అంతర్భాగంగా రెండు ఉప పథకాలు ఉంటాయి. ఒకటి.. నిర్యత్ ప్రోత్సాహన్. మరొకటి నిర్యత్ దిశ. వీటిలో నిర్యత్ ప్రోత్సాహన్ కింద దేశంలోని ఎంఎస్ఎంఈలకు రుణసౌలభ్యం, ఈకామర్స్ ఎగుమతిదారులకు వడ్డీ రాయితీ వంటివి కల్పిస్తారు. ఇందుకుగాను ఈ పథకానికి రూ.10,401 కోట్లు కేటాయించారు. రూ.14,659 కోట్లతో చేపట్టనున్న నిర్యత్ దిశ పథకంలో భాగంగా ఎగుమతి నాణ్యత, అంతర్జాతీయ బ్రాండింగ్, ప్యాకేజింగ్, రవాణా సదుపాయాలు, ఆర్థికేతర సదుపాయాల కల్పన తదితరాలపై దృష్టి సారిస్తారు. అలాగే.. రూ.20 వేల కోట్లతో.. ఎగుమతిదారులకు పూచీకత్తు లేని రుణసాయం కల్పించే సీజీఎస్ఈ పథకానికి కూడా కేంద్ర క్యాబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద 'నేషనల్ క్రెడిట్ గ్యారంటీ ట్రస్టీ కంపెనీ లిమిటెడ్ (ఎన్‌సీజీటీసీ) ద్వారా ఎగుమతిదారులకు 100 శాతం రుణ భరోసా కవరేజీని కల్పించనున్నారు. దీంతోపాటు.. గ్రాఫైట్, సీజియం, రుబీడియం, జిర్కోనియం దేశీయ ఉత్పత్తిని పెంచడమే లక్ష్యంగా వాటి రాయల్టీ రేట్లను హేతుబద్ధీకరణకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

బిహార్‌లో ఎన్డీయేదే గెలుపు

» మరో 2 ఎగ్జిట్‌పోల్స్‌లో వెల్లడి

న్యూఢిల్లీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బిహార్‌లో అధికార పీఠం మళ్లీ ఎన్డీయేదేనని మరో రెండు ఎగ్జిట్‌పోల్స్ వెల్లడించాయి. రెండో విడత పోలింగ్ ముగిసిన వెంటనే మంగళవారం సాయంత్రం 9 ఎగ్జిట్‌పోల్స్ విడుదలవగా.. అన్నీ ఎన్డీయేదే గెలుపు అని పేర్కొన్నాయి. అధికార కూటమికి 130కి పైగా సీట్లు వస్తాయని తెలిపాయి. ప్రతిపక్ష మహాగఠ్‌బంధన్ (ఎంజీబీ)కి 100లోపే వస్తాయని అంచనా వేశాయి. అయితే, బుధవారం మరో రెండు సంస్థల ఎగ్జిట్‌పోల్స్ విడుదలయ్యాయి. టుడేస్ చాణక్య సంస్థ ఎన్డీయేకు భారీ మెజారిటీ వస్తుందని అంచనా వేయగా.. యాక్సిస్ మై ఇండియా మాత్రం బొటాబొటి మెజారిటీ వస్తుందని పేర్కొనడం గమనార్హం. ఎంజీబీపై ఎన్డీయే ఆధిపత్యం ప్రదర్శిస్తుందన్న యాక్సిస్ మై ఇండియా.. 75-76 సీట్లతో ఆర్జేడీ అతిపెద్ద పార్టీగా అవతరిస్తుందని చెప్పడం విశేషం. ఎన్డీయేకు 121-141 సీట్లు వస్తాయని.. ఎంజీబీకి 98-118 సీట్లు వస్తాయని తెలిపింది. ఇక ప్రశాంత్ కిశోర్ పార్టీకి 0-2 సీట్లు వస్తాయంది. టుడేస్ చాణక్య మాత్రం ఎన్డీయేకు 160 సీట్లు వస్తాయని, ఎంజీబీ 77 సీట్లకే పరిమితమవుతుందని పేర్కొంది. మొత్తం మీద 10 ఎగ్జిట్‌పోల్స్ ఎన్డీయేకు అధికారం ఖాయమని వెల్లడించగా.. ఒక్క ఎగ్జిట్ పోల్ మాత్రం ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సంఖ్య కంటే ఒక సీటు తక్కువ (121) వచ్చే అవకాశం ఉందని తెలిపింది. బిహార్‌లో బ్రాహ్మణులు, రాజ్‌పుత్‌లు, వైశ్యులు, ఎస్సీలు, యాదవేతర ఓబీసీలు, అత్యంత వెనకబడిన వర్గాలు ఎక్కువగా ఎన్డీయే వైపే మొగ్గు చూపినట్టు టుడేస్ చాణక్య విశ్లేషణలో తేల్చింది. ఎన్డీయేకు దాదాపు 44 శాతం ఓట్లు, ఎంజీబీకి 38 శాతం, ఇతరులకు 18 శాతం ఓట్లు లభిస్తాయని అంచనా వేసింది. అయితే బిహార్‌లో ఎన్డీయే అధికారంలోకి రాదని, నితీశ్‌కు మళ్లీ సీఎం పదవి దక్కే అవకాశం ఉందని ప్రశాంత్ కిశోర్ ఓ చానెల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు.



మంత్రి పదవి కావాలని నేను అడగలేదు

- టీపీసీసీ అధ్యక్షుడిగా చాలా సంతోషంగా ఉన్నా
- సీఎం రేవంత్, నాకు మధ్య ఎలాంటి గ్యాప్ లేదు
- జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయం
- మరో పదేళ్ల పాటు మా ప్రభుత్వానికి ఢోకా లేదు
- మీడియాతో చిట్‌చాట్‌లో మహేశ్‌గౌడ్ వ్యాఖ్యలు

హైదరాబాద్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డికి, తనకు మధ్య గ్యాప్ లేదని, సమన్వయంతో కలిసి పని చేసుకుంటున్నామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ చెప్పారు. మంత్రివర్గంలో చేరాలని తానేమీ ఆరాట పడట్లేదని, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు తనకు పూర్తి సహకారం అందిస్తున్నారని చెప్పారు. టీపీసీసీ చీఫ్‌గా చాలా సంతోషంగా ఉన్నానని, మంత్రి పదవి కావాలని తానెప్పుడూ అడగలేదని వెల్లడించారు. క్యాబినెట్ విస్తరణ సంగతి పార్టీ అధిష్ఠానం, సీఎం రేవంత్ చూసుకుంటారన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా మరో సారి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలన్నదే తన ఆకాంక్ష అని వెల్లడించారు. గాంధీభవన్‌లో బుధవారం మీడియాతో ఆయన చిట్ చాట్‌గా మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో సానుకూలత బాగా పెరిగిందని, మరో పదేళ్ల తమ ప్రభుత్వానికి ఢోకా లేదని తెలిపారు. డీసీసీ అధ్యక్షుల నియామకానికి సంబంధించి అధిష్ఠానం కసరత్తు పూర్తయిందని, ఏ క్షణమైనా ప్రకటన వెలువడవచ్చని చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయం ఖాయమని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.



నవీన్‌యాదవ్‌ను అభ్యర్థిగా నిలబెట్టడం తమకు కలిసి వచ్చిందని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పోలింగ్ శాతం మరి కొంత పెరిగి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత పరిస్థితుల్లో రిగ్గింగ్‌కు పాల్పడడం సాధ్యమే కాదని, ఓడిపోతున్నామన్న బాధతో బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. స్థానిక ఎన్నికలకు సంబంధించి హైకోర్టు ఆదేశాల ప్రకారమే నడుచుకుంటామని తెలిపారు. విద్య, ఉద్యోగాలు, స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ చట్టబద్ధంగా కల్పించాలని తాము ప్రయత్నిస్తుంటే.. బీజేపీ ప్రభుత్వం అడుగడుగునా అడ్డుపడుతోందని ఆరోపించారు. బిహార్‌లో మహాఘట్ బంధన్ కూటమి గెలుస్తుందన్న నమ్మకం తమకు ఉందన్నారు.



కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం

10 రౌండ్లు.. 42 టేబుళ్లు

- 'జూబ్లీహిల్స్' లెక్కింపు రేపే.. ఉదయం 8 గంటలకు ప్రారంభం
- 12 గంటలకు లెక్కింపు పూర్తి

హైదరాబాద్ సిటీ/బంజారాహిల్స్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితానికి సర్వం సిద్ధమైంది. శుక్రవారం ఉదయం 8 గంటలకు యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో లెక్కింపు ప్రారంభం కానుంది. నియోజకవర్గంలో 407 పోలింగ్ కేంద్రాలుండగా.. పది రౌండ్లలో లెక్కింపు పూర్తి చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం 42 టేబుళ్లను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. సాధారణంగా 14 టేబుళ్లపై కౌంటింగ్ జరుగుతుంది. ఉప ఎన్నిక కావడం, ఉద్యోగులు అందుబాటులో ఉండడంతో ఎక్కువ టేబుళ్లు ఏర్పాటు చేసి త్వరగా లెక్కింపు పూర్తి చేయాలని నిర్ణయించారు. టేబుల్ వద్ద లెక్కింపు సిబ్బందితో పాటు అభ్యర్థి, ఒక ఏజెంట్‌కు మాత్రమే అనుమతిస్తారు. తొలుత 10 హోం ఓటింగ్ బ్యాలెట్లు, 18 సర్వీసు ఓట్లతో లెక్కిస్తారు. అనంతరం ఈవీఎంల్లోని ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. ఉదయం 8.45 గంటలకల్లా తొలి రౌండ్ ఫలితం వెల్లడి కానుంది. మధ్యాహ్నం 12 గంటల వరకు లెక్కింపు పూర్తవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. లెక్కింపు కేంద్రం వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు.

48.49% పోలింగ్ నమోదు

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ శాతం లెక్క తేలింది. 48.49 శాతం ఓట్లు పోలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.సాయిరాం తెలిపారు. మంగళవారం కొన్ని ప్రాంతాల్లో రాత్రి 8 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. నియోజకవర్గంలోని 407 పోలింగ్ కేంద్రాల నుంచి వివరాలు సేకరించి, బుధవారం అధికారికంగా పోలింగ్ శాతం ప్రకటించారు. 2023లో 47.58% నమోదు కాగా.. ఈ సారి 0.91 శాతం అధికంగా ఓటింగ్ జరిగింది.

ఓటెయ్యని వారు డబ్బు తిరిగి ఇవ్వాల్సిందే!

(మొదటి పేజీ తరువాయి)

ఓటెయ్యని వారిని.. ఆయా పార్టీల నేతలు డబ్బు వెనక్కి ఇచ్చెయ్యమని డిమాండ్ చేస్తున్నారు. బస్తీలు, కాలనీలు, అపార్ట్‌మెంట్లలో డబ్బులిచ్చిన వారే నిలదీస్తున్నారు. పోలింగ్ పూర్తయిన తర్వాత తమ ఏజెంట్ల వద్ద ఉన్న ఓటర్ లిస్టు ఆధారంగా డబ్బులు తీసుకొని ఓటెయ్యని వారిని గుర్తించారు. జూబ్లీహిల్స్‌లోని పలు డివిజన్లలో తిరిగిన బూత్ కమిటీ సభ్యులు.. బస్తీల ముఖ్యులు, కాలనీ పెద్దలను సంప్రదించారు. 'ఆ డబ్బులు మీరైనా తీసుకొని కాలనీ, బస్తీల అవసరాలకు వినియోగించుకోండి' అని సూచించారు. మధురానగర్‌లో ఓ అపార్ట్‌మెంట్ వాసులు సమావేశమై.. ఓటేయని వారు డబ్బులు తిరిగి ఇచ్చేస్తే అపార్ట్‌మెంట్ నిర్వహణకు వినియోగించుకోవాలని నిర్ణయించారు.



జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అత్యంత ఖరీదైన ఎన్నికగా మారింది. ప్రధాన పార్టీలు పెద్దఎత్తున డబ్బులు పంపిణీ చేశాయి. గతంలో పోలింగ్ ఎక్కువగా నమోదైన బూత్‌లను పరిగణనలోకి తీసుకొని డబ్బు పంపిణీ చేశారు. ఒక్కో పోలింగ్ బూత్‌లో 50 శాతానికి మించే నగదు పంపిణీ చేశారు. ఆయా బూత్ కమిటీల సభ్యులు కూడా తమ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు, ఆ తర్వాత బంధువులకు, స్నేహితులకు, తమకు తెలిసిన కుటుంబాలకు ఇచ్చారు. ఇలా అన్ని ప్రాంతాల్లో డబ్బు పంచారు. ఇక అపార్ట్‌మెంట్లు, బస్తీల్లో మాత్రం ఆయా ప్రాంతాల ముఖ్యుల ద్వారా పంపిణీ చేశారు. ఓ ప్రధాన పార్టీ ఉన్నతస్థాయి ఆదేశాలకు అనుగుణంగా బూత్ కమిటీల ద్వారా డబ్బు పంపిణీ చేయగా.. మరో పార్టీ బూత్ కమిటీ సభ్యులు ఓటర్లకు డబ్బు పంపిణీ చేయకుండా మిగుల్చుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

డబ్బులు తీసుకొనీ..

ఓ ప్రధాన పార్టీకి చెందిన బూత్ కమిటీ సభ్యులు ఎర్రగడ్డ, రహమత్‌నగర్, యూసుఫ్‌గూడ తదితర డివిజన్లలోని పలు బూత్‌ల్లో డబ్బులు తీసుకొని ఓటెయ్యని వారిని గుర్తించే ప్రక్రియను ప్రారంభించారు. పోలింగ్ సమయంలో అభ్యర్థి తరఫున ఏజెంట్‌గా కూర్చున్న వ్యక్తి ఓటేసేందుకు వచ్చిన వారిని గుర్తించి, ఓటరు లిస్టులో పేరును రౌండ్ చేసుకుంటారు. ఇలా ఏజెంట్ వద్ద ఉన్న ఓటేసిన వారి జాబితా; ఓటరు లిస్టు; బూత్ కమిటీ వద్ద డబ్బులు పంపిణీ చేసిన ఓటరు జాబితాలను సరిచూసుకోగా చాలా మంది ఓటర్లు డబ్బులు తీసుకొని ఓటెయ్యలేదని గుర్తించారు. ఎస్పీఆర్ హిల్స్‌లో ఓ ఇంట్లో 18 ఓట్లకు దాదాపు రూ.45 వేల వరకు తీసుకోగా.. అందులో కేవలం నాలుగు ఓట్లే పోలైనట్లు గుర్తించారు. మిగతా 14 మంది ఓట్లు వేయకపోవడంపై బూత్ కమిటీ సభ్యులు ఆరా తీశారు. ఆ ప్రాంత ముఖ్యుడికి సమాచారమిచ్చారు. బుధవారం ఉదయం ఆ ఇంటికెళ్లి డబ్బులివ్వాల్సిందేనని బస్తీ ముఖ్యులు సూచించారు. ఇలా పలు కాలనీలు, బస్తీల్లో పోలైన ఓట్లపై ఆరా తీశారు. ఓటెయ్యని వారి నుంచి డబ్బులు వసూలు చేసి, బస్తీలో పనులకు వినియోగించుకోవాలని బూత్ కమిటీ ఇన్‌చార్జిలు సూచించినట్లు తెలిసింది.

ఆ డబ్బు అపార్ట్‌మెంట్ల నిర్వహణకు..

అపార్ట్‌మెంట్ల వారీగా కూడా ఓటర్లకు డబ్బులు పంపిణీ చేశారు. కానీ, పలు అపార్ట్‌మెంట్లలో డబ్బులు తీసుకొని సగం మంది కూడా ఓట్లేయలేదని గుర్తించారు. ఓ పార్టీ బూత్ కమిటీ నుంచి డబ్బులు తీసుకొని ఓటెయ్యని జాబితాను అపార్ట్‌మెంట్ ముఖ్యులకు అందించారు. దీంతో అపార్ట్‌మెంట్ వాసులంతా ఉదయం సమావేశమై, ఓటెయ్యని వారు డబ్బులు తిరిగి ఇచ్చేస్తే అపార్ట్‌మెంట్ నిర్వహణకు వినియోగించాలని నిర్ణయించుకున్నారు. అందుకు బూత్ కమిటీ సభ్యులు కూడా అంగీకరించారు.



మూసి ఉన్న రాజరాజేశ్వరస్వామి ఆలయ ప్రధాన ద్వారం

రాజన్న సన్నిధిలో దర్శనాలు నిలిపివేత

- ఆలయ అభివృద్ధి పనుల దృష్ట్యా అధికారుల నిర్ణయం
- ముందస్తు సమాచారం లేకపోవడంతో భక్తుల ఆగ్రహం
- భీమేశ్వరాలయంలోనే పూర్తిస్థాయి దర్శనాలు

వేములవాడ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులకు దర్శనాలను నిలిపివేశారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతున్న దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి తర్వాత ఆలయ రాజగోపురం దక్షిణం వైపు ఉన్న ప్రధాన ద్వారానికి ఎత్తైన రేకులతో ఫెన్సింగ్ ఏర్పాటు చేసి దర్శనాలను నిలిపివేశారు. రాజన్న ఆలయ విస్తరణలో భాగంగా దాదాపు రూ.76కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్న క్రమంలో కళాభవన్, పరిపాలనా కార్యాలయం, క్యూలైన్‌లు, ఇతర భవనాలను ఇప్పటికే కూల్చివేశారు. శిథిలాల తొలగింపు, ఇతర కూల్చివేతల పనులు చేపడుతున్నారు. ఇప్పటికే రాజన్న సన్నిధిలో ఆర్జిత సేవలు నిలిపివేసి భీమేశ్వరాలయంలో కొనసాగిస్తున్నారు. ఆలయంలో లఘు దర్శనం కొనసాగిస్తున్న క్రమంలో కార్తీక మాసం దృష్ట్యా భక్తుల సంఖ్య పెరగడంతో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. విస్తరణ పనుల వల్ల భక్తులకు ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని అధికారులు తీవ్రంగా పరిగణించి దర్శనాలను నిలిపివేశారు. దీంతో రాజన్న సన్నిధిలో యథావిధిగా స్వామివారికి చతుస్కాల పూజలు కొనసాగిస్తూ, భక్తుల దర్శనాలు పూర్తిస్థాయిలో భీమేశ్వర ఆలయంలో కొనసాగించడానికి ఏర్పాట్లు చేశారు. దీంతో బుధవారం స్వామివారి సుప్రభాత దర్శనానికి వచ్చిన భక్తులు ఆలయ ఆవరణ అంతటా రేకులతో ఫెన్సింగ్ చేసి ఉండడాన్ని చూసి అవాక్కయ్యారు. ముందస్తు సమాచారం లేకుండా దర్శనాలు నిలిపివేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయ దక్షిణం, పడమర వైపు ఉన్న మెట్ల వద్ద కొబ్బరికాయలు కొట్టి, కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించారు. ఆలయ ప్రధాన ద్వారం ఎదురుగా రావిచెట్టు వద్ద ఏర్పాటు చేసిన స్వామివారి ప్రచార రథంలోని ఉత్సవ విగ్రహాలను, ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా రాజన్నను దర్శించుకునే విధంగా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆర్జిత సేవలైన అభిషేకం, కల్యాణం, సత్యనారాయణ వ్రతం, కుంకుమపూజలు, అన్నపూజ, ఆకుల పూజ, కోడె మొక్కుల కోసం భీమేశ్వరాలయంలో అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ ఇవో రమాదేవి తెలిపారు.

ఉపేంద్ర సతీమణి సొమ్ము కాజేసిన సైబర్ నేరగాడి అరెస్టు

బెంగళూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): దక్షిణాది నటుడు, దర్శకుడు ఉపేంద్ర సతీమణి ప్రియాంక బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు కాజేసిన సైబర్ నేరగాడిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు బిహార్‌కు చెందిన వికాస్ కుమార్‌గా గుర్తించారు. సెప్టెంబరు 15న ప్రియాంకకు చెందిన నాలుగు బ్యాంకు ఖాతాల నుంచి రూ.1.65 లక్షలను సైబర్ మోసగాళ్లు బదిలీ చేసుకున్నారు. ఇది జరిగిన గంట వ్యవధిలోనే ఉపేంద్ర సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గోల్డెన్ అవర్‌గా భావించే గంట వ్యవధిలోనే ఫిర్యాదు రావడంతో సైబర్ నేరగాడి అరెస్టు సులువు అయిందని నగర పోలీస్ కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్ బుధవారం తెలిపారు. నిందితుడు ఢిల్లీలో ఉన్నట్టు సైబర్ పోలీసులు గుర్తించారని, ప్రత్యేక బృందం అక్కడికి చేరుకుని సోనియా నగర్‌లో అరెస్టు చేసి బెంగళూరు తీసుకువచ్చిందని, అతని మొబైల్‌ను స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపామని తెలిపారు. ముఠాలో మరికొందరు ఉన్నట్టు గుర్తించామని, వారిని అరెస్టు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు.

వీధి కుక్కల దాడి.. చూపు కోల్పోయిన చిన్నారి



చికిత్స పొందుతున్న బాలుడు

షాద్‌నగర్ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల దాడిలో గాయపడిన మూడేళ్ల చిన్నారి కంటిచూపు కోల్పోయాడు. రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం నాగులపల్లికి చెందిన జ్యోతి, జనార్దన్‌ల కుమారుడు రిత్విక్ గత శుక్రవారం సాయంత్రం పాఠశాల నుంచి వస్తుండగా.. కుక్కలు బాలుడిపై దాడి చేశాయి. ఈ ప్రమాదంలో రిత్విక్ ఎడమ కన్నుకు తీవ్రంగా గాయం కావడంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని సరోజినీ దేవి కంటి ఆసుపత్రికి తరలించారు. బాలుడు కంటిచూపును కోల్పోయినట్లు అక్కడి వైద్యులు బుధవారం తెలపడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. కాగా, అదేరోజు కుక్కలు మరో బాలుడిని కూడా గాయపరిచాయని గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధికుక్కల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అప్పుల బాధతో గిరిజన రైతు ఆత్మహత్య



అర్క భీంరావు

ఉట్నూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అతివృష్టి కారణంగా సరైన దిగుబడి రాక.. అప్పుల భయంతో గిరిజన యువ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని చింతగూడకు చెందిన అర్క భీంరావు(31) రూ.5లక్షలు అప్పు చేసి ఐదెకరాల్లో పత్తి సాగు చేశాడు. భారీ వర్షాల వల్ల పంట దెబ్బతిని సరైన దిగుబడి రాలేదు. అప్పు తీర్చే మార్గం కానరాకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. మంగళవారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతని భార్య లక్ష్మి ఇటీవలే పుట్టింటికి వెళ్లింది. బుధవారం ఉదయం భీంరావు మృతిచెందిన విషయాన్ని గమనించిన బంధువులు పోలీసులకు సమాచారం అందజేశారు.

ఎవరూ పిల్లనివ్వడం లేదని.. రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య



నరేశ్ (ఫైల్)

ఆత్మకూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మూడు పదుల వయస్సు దాటినా పెళ్లి కాకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన బూర సురేందర్, రమ దంపతులకు కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమార్తె వివాహం కాగా, పెద్ద కుమారుడు నరేశ్ (32)కు నాలుగేళ్ల నుంచి పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. అయితే, నరేశ్ హైదరాబాద్‌లోని అమీర్‌పేటలో ఓ బట్టల షాపులో పని చేస్తుండడంతో పిల్లను ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన నరేశ్ మంగళవారం మధ్యాహ్నం ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధిలోని మాధవరెడ్డి ఫ్లై ఓవర్ సమీపంలో గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబసభ్యులు తెలిపారు.

'కబుర్ల దేవత'కు బాలల సాహిత్య పురస్కారం

- రేపు ఢిల్లీలో రచయిత శివకుమార్‌కు ప్రదానం

న్యూఢిల్లీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వివిధ భాషలలో సాహిత్య అకాడమీ బాలల సాహిత్య పురస్కారాలకు ఎంపికైనవారికి శుక్రవారం అవార్డులను ప్రదానం చేయనున్నారు. తాన్‌సేన్ మార్గ్‌లోని త్రివేణి ఆడిటోరియంలో విజేతలకు అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్ పురస్కారాలను ప్రదానంచేస్తారు. తెలుగు భాషలో గంగిశెట్టి శివకుమార్ కథల పుస్తకం కబుర్ల దేవత ఈ అవార్డుకు ఎంపికైంది. శివకుమార్ స్వస్థలం నెల్లూరు జిల్లా. అవార్డు గ్రహీతలకు రూ.50 వేలు నగదు అందిస్తారు.

భూ భారతి వచ్చినా దిక్కు లేదు!

కలెక్టర్లూ పట్టించుకోవడం లేదు.. పేరుకుపోతున్న పెండింగ్ దరఖాస్తులు

- మోక్షం లేని రైతుల భూ సమస్యలు
- డేటా కరెక్షన్‌కు సంబంధించిన దరఖాస్తులే అత్యధికం

హైదరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ రైతు.. తన పట్టాదారు పాస్ పుస్తకంలో పేరు తప్పు పడిందని.. దాన్ని సవరించాలని మూడు నెలలుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. సమస్య చిన్నదే అయినా.. పరిష్కారం చూపడంలేదు. తహసీల్దార్ నుంచి కలెక్టర్ వరకు ఎన్ని పర్యాయాలు ప్రాధేయపడినా పట్టించుకున్న దిక్కులేదని బాధితులు మొత్తుకుంటున్నారు. రైతుల భూ సమస్యలకు సంబంధించి గత ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన ధరణి వ్యవస్థను రద్దు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా భూ భారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చినా.. బాధిత రైతులకు కష్టాలు తప్పడం లేదు. భూ సమస్యలపై స్వయంగా కలెక్టర్ల దగ్గరకు వెళ్లి గోడు వెళ్లబోసుకుంటున్నా పరిష్కరించడం లేదనే విమర్శలు ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సమస్యలకు సంబంధించి డేటా కరెక్షన్ విభాగంలో 42,557 దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే.. అందులో కలెక్టర్ల లాగిన్‌లో పరిష్కారానికి నోచుకోకుండా ఉన్నవి 7360 దరఖాస్తులు. ఇక నిషేధిత భూముల (22ఏ) వివాదాలకు సంబంధించి.. పొరపాటున తమ భూమి 22ఏలో పెట్టారని.. నాలుగు దశాబ్దాలుగా అనుభవంలో ఉన్నామని రికార్డులతో సహా పత్రాలను చూపినా.. కలెక్టర్లు స్పందిండం లేదని బాధితులు వాపోతున్నారు. ముఖ్యంగా రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. 22ఏ వివాదాలకు సంబంధించి రాష్ట్రంలో 24,143 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అందులో కలెక్టర్ల లాగిన్‌లో ఉన్నవి 4,163 దరఖాస్తులు. ఎన్ని వినతి పత్రాలు ఇచ్చినా, హక్కుల పుస్తకంలో ఉన్న ఆధారాలు చూపినా.. ఏదో ఒక సాకుతో.. తప్పులను సరిదిద్దడం లేదని.. పదే పదే తిప్పుకోవడం తప్ప పనులు చేయడం లేదని బాధితులు ఆవేదన చెందుతున్నారు. భూభారతి చట్టం అమల్లోకి వచ్చాకైనా తమ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఆశించినా.. రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు ఇచ్చి నాలుగు నెలలు గడిచినా సమస్య పరిష్కారం కావడం లేదని మొత్తుకుంటున్నారు.



చిన్న చిన్న తప్పులనూ సరిదిద్దరా?

భూ విస్తీర్ణంలో తేడాలు, మిస్సింగ్ సర్వే నంబర్లు, భూ వర్గీకరణలో తప్పులు, పట్టాదారుల పేర్లు తప్పు పడినా సవరణ చేసుకునేందుకు రైతులు దరఖాస్తు చేసుకుంటారు. వీటిని పరిశీలించి.. హక్కుల రికార్డులో ఉన్న వాస్తవాలతో సరిపోల్చి పొరపాట్లు ఉంటే వెంటనే సరిదిద్దాల్సి ఉంటుంది. తహసీల్దార్, ఆర్డీవో, అదనపు కలెక్టర్, కలెక్టర్ వరకు.. ఏ స్థాయిలోనూ ఈ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ తరహా సమస్యలకు సంబంధించి మొత్తం దరఖాస్తుల్లో తహసీల్దార్ స్థాయిలో 25,601 పెండింగ్ ఉంటే.. ఆర్డీవో స్థాయిలో 5946, అదనపు కలెక్టర్ల స్థాయిలో 3650, కలెక్టర్ల లాగిన్లలో 7360 పెండింగ్‌లో ఉన్నాయి. నిషేధిత భూములకు సంబంధించిన వివాదాలపై వచ్చిన దరఖాస్తులు 24,143 ఉంటే అందులో తహసీల్దార్ స్థాయిలో 8569, ఆర్డీవో స్థాయిలో 4001, అదనపు కలెక్టర్ల లాగిన్‌లో 7411, కలెక్టర్ల లాగిన్‌లో 4162 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. క్షేత్ర స్థాయిలో విచారణ చేసి.. హక్కుల రికార్డు ఆధారంగా వెంటనే నిర్ణయం తీసుకునేందుకు అవకాశం ఉన్న సమస్యలే ఇవి.. అయినా కలెక్టర్లు నెలల తరబడి తిప్పుకుంటున్నారే తప్ప.. దరఖాస్తుదారుల సమస్యలను పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. గ్రీవెన్స్ సెల్‌లో సమస్యలను ప్రస్తావించినా పరిష్కారం చూపడంలేదని, అదే సమస్య మీద పిటిషన్ ఇస్తే కనీసం పరిశీలించడం లేదని.. పదేపదే ఎందుకొస్తున్నారంటూ కలెక్టర్లు కసురుకుంటున్నారని బాధితులు వాపోతున్నారు. సంగారెడ్డి జిల్లాలో ఓ క్యాన్సర్ పేషంట్ తన భూమి 22ఏలో ఉందని కలెక్టర్ చుట్టూ తిరుగుతున్నారు. తన ఆరోగ్య పరిస్థితి బాగలేదు.. జరిగిన తప్పిదాన్ని సరిదిద్దాలని ప్రాధేయపడినా.. అధికారులు సహకరించడం లేదని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు.



బాపు బాట ప్రచార రథాన్ని ప్రారంభించిన టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

బాపూ బాట ప్రచార రథం ప్రారంభం

హైదరాబాద్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా లక్ష గాంధీ విగ్రహాల(ఒక అడుగు) సేకరణకు సంబంధించి బాపూ బాట ప్రచార రథాన్ని బుధవారం గాంధీభవన్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ జెండా ఊపి ప్రారంభించారు. ప్రపంచంలోనే ఎత్తయిన గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి సంఘీభావంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.



యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ ఫోరం సదస్సు..

ఢిల్లీకి వెళ్లిన సీఎం రేవంత్

హైదరాబాద్, నవంబర్ 12(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో యూఎస్ - ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్ షిప్ ఫోరం సదస్సు గురువారం ఉదయం ప్రారంభం కానుంది. ఇందులో పాల్గొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం సాయంత్రం ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడంలో భాగంగా తెలంగాణ రైజింగ్ కాన్సెప్ట్‌ను ఆయన ఈ సదస్సులో వివరించనున్నారు.



ఫ్రాన్స్ వరుడు...రష్యా వధువు

- హిందూ సంప్రదాయం ప్రకారం ఒక్కటయ్యారు

బెంగళూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): భారతీయ ఆధ్యాత్మికతను మనస్ఫూర్తిగా ఇష్టపడ్డ ఫ్రాన్స్ దేశానికి చెందిన వరుడు, రష్యా దేశానికి చెందిన వధువు హిందూ సంప్రదాయం ప్రకారం వివాహం చేసుకున్నారు. ఉడుపి జిల్లా కొల్లూరు మూకాంబికా ఆలయ ప్రాంగణంలో వీరి వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. ఫ్రాన్స్‌కు చెందిన నరోత్తమ దాస్, రష్యాకు చెందిన జాహ్నవి శ్రీకృష్ణ భక్తులు. ఈ జంట కొన్నేళ్లుగా బృందావనంలో శాస్త్ర అధ్యయనం చేసింది. ఒడిస్సీ నృత్యం కూడా నేర్చుకున్నారు. ఆయుర్వేదాన్ని విశ్వసించి, కొల్లూరులోని అభయ ఆయుర్వేద చికిత్సాలయంలో పంచకర్మ చికిత్స చేయించుకున్నారు. దేశంలోని పలు ఆలయాలను సందర్శిస్తున్న సమయంలో వీరు జీవితకాలం కలసి ఉండాలని నిర్ణయించుకుని, హిందూసంప్రదాయబద్ధంగా పెళ్లి చేసుకోవాలని సంకల్పించారు. అర్చకులు శ్యామసుందర అడిగ నేతృత్వంలో వీరికి ఈ నెల 7న వివాహం జరిపించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో బుధవారం వైరల్ అయ్యాయి.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఇదేమి న్యాయం?

'మరి, మా పిల్లలను ఎవరు చంపారు?' అన్న ఆ ప్రశ్నకు సమాధానం చెప్పడం కష్టం. దేశాన్ని కుదిపేసిన నిఠారీ హత్యకేసులో ద్రోహులెవ్వరో, దోషులెవ్వరో తేల్చకుండానే కథ ముగిసింది. ఎవరికీ ఏ శిక్షాపడకుండా ఇరవైమంది పిల్లల తల్లిదండ్రులకు కడుపుకోత మిగిలింది. పనివాడు సురేందర్ కోలీ, యజమాని మనీందర్‌సింగ్ పంధేర్ కాక ఆ ఇంట్లో ఏవో దయ్యాలున్నాయని, అవే మీ పిల్లలను చంపాయని కోర్టులు అంటున్నాయా? అని వారు అడుగుతున్నారు. సురేందర్ కోలీమీద మిగిలిపోయిన ఆ ఒక్క కేసును కూడా సుప్రీంకోర్టు కొట్టివేయడం ద్వారా ఆ దారుణహత్యాకాండకు ఎవరూ బాధ్యులు కాదనీ, పాపులెవ్వరూ లేరని తేల్చేయడం నిఠారీ నివాసులకు తీవ్ర ఆగ్రహావేదనలు కలిగించడం సహజం.

రెండేళ్ళక్రితం అలహాబాద్ హైకోర్టు ఏకంగా పన్నెండు కేసుల్లో కోలీని బయటపడవేసిన నేపథ్యంలో, ఆ తీర్పును ఎత్తిపడుతూ, ఈ చివరికేసులో సైతం అతడు నేరం చేశాడని నిర్ధారించలేమని, వదిలేయమని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. అతడివి బలవంతపు నేరాంగీకారాలేనని కోర్టు నమ్ముతోంది. నిఠారీ రాక్షసుడు, మృతదేహాలతో రమించే కామాంధుడు అంటూ కోలీకి అనేక పేర్లు పెడుతూ, యజమాని ఆదేశాల మేరకే ఇదంతా చేశాడని ఒకదశలోనూ, ఆ తరువాత పంధేర్ ప్రమేయం లేకుండా ఇతగాడే అన్నీ చేశాడన్నది పోలీసులూ సీబీఐ ఆరోపణ. చుట్టుపక్కల నిరుపేద పిల్లలను ఊరించి, బంగ్లాకు రప్పించి, అఘాయిత్యాలు, హత్య అనంతరం భవనం వెనుక ఉన్న కాలువలో మృతదేహాల విడిభాగాలు పడవేశారన్నది అభియోగం. దర్యాప్తు సాగుతున్నంతకాలం అధికార, అనధికార కథనాలకు హద్దేలేకపోయింది. పూర్తిగా ఒక్క మృతదేహమూ లభ్యం కాకుండా శరీర భాగాలు మాత్రమే కాలువలో లభించినందున కోలీని నరమాంసభక్షకుడన్నారు, వీరిద్దరూ ఆర్గాన్‌రాకెట్ అధిపతులనీ అన్నారు. పంధేర్‌ను నేరస్థుడుగా నిర్ధారించడానికి అత్యంత కీలకంగా నిలిచిన కోలీ నేరాంగీకారం విషయంలో వివిధస్థాయి న్యాయస్థానాలు భిన్న వైఖరి తీసుకోవడం కూడా కేసు బలహీనపడటానికి దోహదం చేసింది. ఇదే నేరాంగీకారం ఆధారంగా దిగువకోర్టు ఇరువురికీ మరణశిక్ష విధిస్తే, హైకోర్టులో అది చెల్లకుండా పోయింది. నిఠారీ హత్యల్లో విచారణకు వచ్చిన తొలి కేసులో ఇదే నేరాంగీకారాన్ని సెషన్స్ కోర్టు, అలహాబాద్ హైకోర్టు, చివరకు సుప్రీంకోర్టు సైతం ఆమోదించి ఉరిశిక్ష ఖరారు చేయడం, కోలీ క్షమాభిక్ష అభ్యర్థనను రాష్ట్రపతి నిరాకరించడం, ఆ తరువాత మళ్ళీ ఉరి నిలిచిపోవడం వంటి పరిణామాలు తెలిసినవే. మిగతా పన్నెండు కేసులకూ కూడా కీలకమైన ఈ నేరాంగీకారాన్ని కోలీ తరఫు న్యాయవాదులు సాంకేతికంగా అనర్హమైనదని నిరూపించగలిగారు. దీనికి ముందు అరవైరోజుల పాటు పోలీసు కస్టడీలో ఉండటం, కేవలం ఐదునిముషాలు మాత్రమే ఆయన తన న్యాయసహాయకుడితో మాట్లాడగలడం వంటి చిన్నచిన్న అంశాలు ఇందుకు ఉపకరించాయి. కోలీ, పంధేర్ నివాసం సమీపంలో ఉన్న ఒక వైద్యుడిమీద అప్పటికే శరీరభాగాల అక్రమరవాణా కేసులున్న నేపథ్యాన్ని కూడా దృష్టిలో పెట్టుకొని అలహాబాద్ హైకోర్టు కోలీనీ, మిగిలిన రెండు కేసుల్లోనూ పంధేర్‌ను పూర్తిగా వదిలేసింది. అనుమానం ఎంతగట్టిగా ఉన్నా, ఆధారాలు బలంగా లేనప్పుడు కేసు నిలవదన్న సుప్రీంకోర్టు వ్యాఖ్య సముచితమైనదే. కానీ, ఒకే హత్యాకాండకు సంబంధించి వేర్వేరు న్యాయస్థానాలు భిన్నమైన పరిగణనలు, దృక్పథాలు, తీర్పుల ఆధారంగా వీరిద్దరూ నిక్షేపంగా బయటపడగలిగారన్నదీ వాస్తవం.

ఇరవై హత్యలకు వీరిద్దరూ కారకులు కానప్పుడు, కేసుమొత్తం వారి చుట్టూనే తిప్పుతూ, రెండుదశాబ్దాలపాటు పలుమార్లు పలురకాల శిక్షలు ఎందుకు వేశారంటూ సామాజిక మాధ్యమాల్లో కొందరు ప్రశ్నిస్తున్నారు. నిందితులు వీరు కాదని తేల్చేసిన న్యాయస్థానాలు కేసు తప్పుదోవపట్టినందుకు అధికారులను బాధ్యులను చేసివుంటే బాగుండేది. సుదీర్ఘకాలం దర్యాప్తు సాగించినా, అది న్యాయప్రమాణాలకు అనుగుణంగా నిలవలేకపోయిందని న్యాయస్థానం అంటోంది. అటువంటప్పుడు ఇద్దరు అమాయకులను రెండుదశాబ్దాలపాటు ఘోరమైన ఆరోపణలతో వేధించి, అవమానించిన వారంతా దండనార్హులు కాదా? అన్నది మంచి ప్రశ్న. న్యాయస్థానాలు వదిలేసినా, తమ పిల్లలను పొట్టనబెట్టుకున్న ఆ ఇద్దరినీ దేవుడు క్షమించడని నిఠారీవాసుల నమ్మకం.

విస్తృత, సమ్మిళిత కులగణన ఎలా?

కుల గణనను నిర్వహించాలని నిర్ణయించినట్టు గత ఏప్రిల్ 30న మోదీ ప్రభుత్వం ప్రకటించినప్పుడు ప్రతి ఒక్కరూ ఆశ్చర్యపోయారు. సామాజిక న్యాయసాధనకు పోరాడుతున్నవారు తమకొక విజయం లభించినట్టు ఆనందభరితులు అయ్యారు. ఆ నిర్ణయం తీసుకోవడంలో మోదీ సర్కార్ రాజకీయ అంచనాలు ఏమైనప్పటికీ అసంఖ్యాకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న, అయితే చాలా కాలంగా వాయిదా పడుతూ వస్తోన్న కుల గణన ఎట్టకేలకు సంభవించనున్నది. కుల అసమానతలను రూపుమాపడంలో స్వతంత్ర భారతదేశం తడబడుతూ వ్యవహరిస్తోంది. ఇప్పుడు ఆ అస్థిర పురోగతికి స్వస్తి చెప్పేందుకు దోహదం చేసే ఒక బృహత్తర ముందడుగును కులగణనతో వేయనున్నామనడం సత్య దూరం కాదు.


■ యోగేంద్ర యాదవ్

ప్రతిపాదిత కుల గణన విషయంలో జాగ్రత్తగా ఉండవల్సిన అవసరాన్ని రెండు కొత్త పుస్తకాలు మనకు నొక్కి చెప్తున్నాయి. వాటిలో ఒకటి సామాజిక శాస్త్రవేత్త త్రిన విథయథిల్ పరిశోధనా గ్రంథం 'Counting Caste' కాగా మరొకటి ప్రముఖ ప్రజా మేధావి ఆనంద్ తెల్తుంబ్డే రాసిన 'The Caste Con Census'. విథయథిల్, తెల్తుంబ్డే ఇరువురూ సామాజిక న్యాయసాధనకు, కుల నిర్మూలన లక్ష్యాలకు నిబద్ధమైన వారు. కుల గణనపై ఇరువురివీ పూర్తిగా భిన్నమైన దృక్కోణాలు. అయితే విశేషంగా ఆకట్టుకునేవి, లోతుగా ఆలోచింపచేసేవి. ప్రతిపాదిత కుల గణనపై ప్రయోజనకరమైన చర్చను పురిగొల్పే గ్రంథాలవి. సామాజిక న్యాయ సంబంధిత అంశాలపై సంభాషణలను మరింత ప్రగాఢం చేసేవి కూడా అనడంలో సందేహం లేదు.

ఆనంద్ తెల్తుంబ్డే దేశవ్యాప్తంగా ప్రఖ్యాతుడు అయిన ప్రజా మేధావి. అంబేడ్కర్ వాది. కుల నిర్మూలనపై అంబేడ్కర్ దృక్పథాన్ని ఎటువంటి మినహాయింపులేకుండా ఆమోదించేవారి అభిప్రాయాలతో విభేదించేందుకు, వారి ఆలోచనలకు విరుద్ధంగా ఉన్న తన ఆలోచనలను వ్యక్తం చేసేందుకు భయపడని నవ భావ సాహసి. చారిత్రకంగా వివక్షకు గురవుతోన్న అణగారిన వర్గాల అభ్యున్నతికి ఉద్దేశించిన సానుకూల చర్య (Affirmative action) విధానాన్ని ఆయన పూర్తిగా సమర్థిస్తారు. అయితే రిజర్వేషన్లు అనే సానుకూల చర్యను పటిష్ఠం చేసేందుకు సార్వత్రిక విద్య, ఆరోగ్య భద్రతా విధానాలను కూడా సంపూర్ణంగా అమలుపరచాలని ఆయన నొక్కి చెప్పారు. సానుకూల చర్యను మౌలిక సమానత్వాన్ని లక్ష్యిస్తున్న పరివర్తన సాధక విధానాలు, కార్యక్రమాలకు సంధానం చేయాలని ఆయన వాదించారు.

కుల గణనపై చర్చ సాధారణంగా ముందే చెప్పదగిన లేదా సూచించదగిన విధంగా సాగడం కద్దు. సామాజిక న్యాయాన్ని డిమాండ్ చేసేవారు కుల గణనను ఆమోదిస్తారు. కులగణన వ్యతిరేకులు కులవ్యవస్థ సమకూరుస్తున్న ప్రత్యేక హక్కులు, సదుపాయాలను బహిరంగంగా లేదా రహస్యంగా సమర్థించేవారై ఉంటారు. ఆనంద్ తెల్తుంబ్డే ఈ కోవకు చెందిన ఆలోచనాపరుడు కాదు. ఆ ఆలోచనా రీతులకు భిన్నంగా వివేచించే విలక్షణ మేధావి. వచ్చే ఏడాది నుంచి నిర్వహించనున్న జనాభా గణనలో భాగంగా కుల గణన కూడా జరపాలని మోదీ ప్రభుత్వం నిర్ణయించడం తమ రాజకీయ ప్రయోజనాలు సాధించుకునేందుకు ఉద్దేశించిన ఒక వ్యూహాత్మక నిర్ణయం మాత్రమేనని ఆయన నిష్కర్షగా చెప్పారు. కుల గణన ఒక వంచన మాత్రమే అన్న ఏకాభిప్రాయం ఉదారవాదుల్లో వ్యక్తమవుతోంది. కుల గణన కులపరమైన గుర్తింపులను మరింతగా బలపరుస్తుందనేది ఆ ఉదారవాదుల ఆక్షేపణ. రిజర్వేషన్ల కోటాలో ఉప కోటాలకు డిమాండ్లు పెరుగుతాయని, ఫలితంగా అసమాన సామాజిక వ్యవస్థకు బాధితులుగా ఉన్న అట్టడుగు కులాల వారు సంఘటితం కావడాన్ని నిరోధిస్తుంది. కుల నిర్మూలన స్పృహతో కూడిన సానుకూల చర్యను బలహీనపరుస్తుంది.

కుల గణన సామాజిక న్యాయానికి దోహదం చేసేదికాదని, కుల వ్యవస్థను శాశ్వతం చేయడానికి మాత్రమే అది సాధనమవుతుందని తెల్తుంబ్డే సైతం తన పుస్తకంలో గట్టిగా వాదించారు. ఆయన కొత్త ఆలోచనలను ప్రేరేపించారు గాని వాటి సహేతుకత గురించి నచ్చచెప్పలేకపోయారు. కేవలం ఏ కులంలో ఎంతమంది ఉన్నారని లెక్కించడం సామాజిక అసమానతలకు పరిష్కారం కాదు, కాబోదని స్పష్టం చేసిన తెల్తుంబ్డే, సంఖ్యా గణన నుంచి సామాజిక అసమానతల సంక్లిష్ట స్వభావంపై లోతైన అవగాహనకు దోహదం చేసే మరింత సూక్ష్మమైన కుల గణన విధానాన్ని ఆయన పరిగణనలోకి తీసుకోలేదు.

మనం capital C census (ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే దేశ జనాభా గణన) నుంచి small c census (ఒక నిర్దిష్ట సామాజిక సమూహంలోని ప్రతి ఒక్క సభ్యుడి వివరాలను సేకరించే క్రమబద్ధమైన సర్వే)కు వెళ్లాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. తద్వారా మాత్రమే వర్తమాన భారతదేశంలో ఆస్తులు, అవకాశాలు ఏ విధంగా పంపిణీ అవుతున్నాయనే విషయమై ఒక కచ్చితమైన అవగాహన సుసాధ్యమవుతుంది. అటువంటి నిర్దుష్ట అవగాహన ఉన్నప్పుడే సామాజిక, ఆర్థిక అసమానతలను రూపుమాపడం సులభమవుతుంది.

కుల గణన అనేది అణగారిన కులాల జనాభా లెక్కింపు మాత్రమే కాదని, అగ్రకులాల వారికి కుల వ్యవస్థ సమకూరుస్తున్న ప్రత్యేక హక్కులు, సదుపాయాలను బహిర్గతం చేస్తుందని సామాజిక శాస్త్రవేత్త సతీశ్ దేశ్ పాండే అభిప్రాయపడ్డారు. ప్రతి కుల సమూహ సభ్యుల విద్యార్హతలు, వృత్తిగత ఆచరణలు, ఆర్థిక హోదా మొదలైన వివరాలను కూడా వెల్లడిస్తుందని ఆయన అన్నారు. కుల గణన దానికదే సామాజిక న్యాయసాధనకు దోహదం చేయదు. అయితే అసమానతలను నిర్మూలించేందుకు అవసరమైన విధానాల రూపకల్పనకు, ఆ అమానుష వ్యవస్థను కూల్చివేసే రాజకీయాల ఆవిర్భావానికి అదొక తప్పనిసరి ముందడుగు అవుతుంది.



కుల గణన ఎలా నిర్వహించాలన్నదే అసలు ప్రశ్న. అది ఒక ప్రతీకాత్మక చర్యగా ఉండకూడదు. కులం కల్పించే ప్రత్యేక హక్కులను శాశ్వతం చేసేందుకు అది ఏ విధంగాను ఒక సాధనం కాకూడదు. కులగణనతో అందుబాటులోకి వచ్చే సమాచార స్వభావాన్ని, దాన్ని విశ్లేషించే పద్ధతులు విధానపరమైన నిర్ణయాలను అమలుపరిచే వ్యవస్థలు, మరీ ముఖ్యంగా కుల గణనకు పాలకులను పురిగొల్పిన రాజకీయ అజెండాకు సంబంధించిన పలు ప్రశ్నల వియంలో తెల్తుంబ్డే పుస్తకం మనలను జాగరూకులను చేస్తుంది.

ఇప్పుడు యువ పరిశోధకురాలు త్రిన విథయథిల్ తన ప్రథమ పుస్తకం 'Counting Caste'లో వ్యక్తం చేసిన అభిప్రాయాలు ఏమిటో చూద్దాం. జనాభా గణనలో కుల గణనపై ఆమె పుస్తకమొక సాధికార పరిశోధన. 1871లో బ్రిటిష్ వలస పాలకులు జనాభా గణనను ప్రారంభించిన నాటి నుంచీ స్వతంత్ర భారతదేశంలో కుల గణన నిర్వహించేందుకు జరిగిన విఫల ప్రయత్నాల దాకా ఆమె కుల గణన చరిత్రను విపులంగా వివరించారు. ఆమె తన పరిశోధనకు 2011 జనాభా లెక్కలను ఉపయోగించుకున్నారు. ఆ జనాభా గణన ఆధారంగా కుల నిర్దిష్ట సమాచారాన్ని సేకరించే ప్రయత్నాలను పాలకులు ఎలా అడ్డుకున్నారో ఆమె ప్రతిభావంతంగా విశ్లేషించారు. కుల గణనకు అనుకూలంగా పార్లమెంటులోని అన్ని పార్టీల మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. అయితే దానిని సామాజిక, ఆర్థిక, కులగణన (ఎస్ఈసీసీ)గా పక్కదోవ పట్టించారు. అధికారులు ఉద్దేశపూర్వకంగా నమ్మదగని డేటా సృష్టించారని ఆమె విమర్శించారు. కుల గణన విషయంలో ఎన్డీఏ ప్రభుత్వం సైతం యూపీఏ ప్రభుత్వం కంటే మెరుగ్గా వ్యవహరించలేదని ఆమె నిగ్గు తేల్చారు. అప్రధానంగా కన్పిస్తున్న విషయాల ఆధారంతో కఠోరమైన వాస్తవాలను వెల్లడించడం విథయథిల్ పరిశోధనా ప్రతిభకు తార్కాణం. ఈ దృష్ట్యా మనం మోదీ సర్కార్ ప్రతిపాదిత కుల గణన విషయంలో అప్రమత్తంగా ఉండితీరాలి. రెండు దశలుగా జరిగే 2027 జనాభా గణనలో కేవలం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల వివరాలే కాకుండా 'జనరల్' కేటగిరీలోని కులాల లెక్కలు కూడా సేకరించాలి. కేవలం హిందువుల విషయంలోనే కాకుండా అన్ని మతాలవారికీ కుల గణనను వర్తింపచేయాలి. ఈ విషయమై 2011 నాటి ఎస్ఈసీసీ ఉపేక్ష వహించింది. దాని నియమావళి ముస్లింలు, క్రైస్తవులలో కులాలవారీ వివరాలు నమోదుచేయడాన్ని నిరుత్సాహపరిచింది. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన సమూహాలను గుర్తించేందుకు రూపొందించిన ముందస్తుగా నిర్ణయించిన కుల జాబితాల విషయమై తొలుతనే ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలి. ప్రతి ఒక్కరినీ తమ కులం పేరు చెప్పాలని అడగడమనేది గందరగోళానికి దారితీసే అవకాశమున్నది. కుల గణన అసలు లక్ష్యాన్ని పక్కదోవ పట్టించడానికి మాత్రమే అది ఉపయోగపడుతుంది. 2011 నాటి ఎస్ఈసీసీకి పట్టిన గతిని మనం విస్మరించకూడదు. కుల గణన ద్వారా సేకరించిన సమాచారాన్ని కులాలు, ఉపకులాల వారీగా అందరికీ అందుబాటులో ఉంచాలి.

కుల గణనపై చర్చ కులాల వివరాల సేకరణలో విస్తృతంగా వివిధ అంశాలను విధిగా అంతర్భాగం చేసుకోవాల్సిన అవసరాన్ని సూచిస్తుంది. మనం capital C census (ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే దేశ జనాభా గణన) నుంచి small c census (ఒక నిర్దిష్ట సామాజిక సమూహంలోని ప్రతి ఒక్క సభ్యుడి వివరాలను సేకరించే క్రమబద్ధమైన సర్వే)కు వెళ్లాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. ఇటువంటి నిర్దిష్ట సామాజిక సమూహాల గణనలు మనకు చాలా ఉన్నాయి. ఎకనామిక్ సెన్సస్, అగ్రికల్చరల్ సెన్సస్, లైవ్‌స్టాక్ సెన్సస్, ఆల్ ఇండియా సర్వే ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్, లిస్ట్ ఆఫ్ డైరెక్టర్స్ ఆఫ్ రిజిస్టర్డ్ కంపెనీస్ మొదలైనవి స్మాల్ సి సెన్సస్‌గా పరిగణితమవుతున్నాయి. వీటితో పాటు పెద్ద ఎత్తున నిర్వహించే కుటుంబ వినియోగ వ్యయాల సర్వే, పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (ఉపాధి కల్పన పరిస్థితులు, నిరుద్యోగితను అంచనా వేయడానికి జాతీయ గణాంక కార్యాలయం నిర్వహించే సర్వేలలో కూడా విధిగా కులంపై ప్రశ్న (కులం వివరాల సేకరణ)ను చేర్చాలి. ఈ వివరాలకు అదనంగా ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగుల సర్వే, పంచాయతీ వార్డు స్థాయి నుంచి పార్లమెంటు దాకా ప్రజలు ఎన్నుకునే ప్రతినిధుల సర్వే, రాజ్యాంగ పదవులు నిర్వహిస్తున్న వారి విషయమై జరిపే సర్వేల ఫలితాలను కూడా పైన పేర్కొన్న వివిధ సేకరణల వివరాలకు అదనంగా చేర్చాలి. కుల గణన అనేది ఇంత విస్తృత, సమ్మిళిత విధానంలో జరిగినప్పుడు మాత్రమే వర్తమాన భారతదేశంలో ఆస్తులు, అవకాశాలు ఏ విధంగా పంపిణీ అవుతున్నాయనే విషయమై ఒక కచ్చితమైన అవగాహనకు రావడం సుసాధ్యమవుతుంది. అటువంటి నిర్దుష్టమైన అవగాహన ఉన్నప్పుడే సామాజిక, ఆర్థిక అసమానతలను సమర్థంగా పరిష్కరించడం సులభమవుతుంది. సమకాలీన భారతదేశంలో సామాజిక అసమానతలను బహిర్గతం చేసి వాటికి ఆలంబనగా ఉన్న వ్యవస్థలను కూల్చివేసేందుకు పైన పేర్కొన్న విధంగా విస్తృత, సమ్మిళిత విధానంలో కుల గణన నిర్వహణ బృహత్తర ముందడుగు అవుతుంది.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

మృత్యు రహదారులు

మంచి రహదారులు తయారయ్యాక వాహనాల వేగం పెరిగి, ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి చేరుకోవడానికి సమయం తక్కువ అయ్యింది. అయితే అదే వేగం కారణంగా ప్రమాదాలు ఎక్కువ అయ్యాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం ప్రతి ఏటా సుమారు 13లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్నారు. కోట్లాది మంది గాయాలతో, వైకల్యాలతో బాధపడుతున్నారు.

మంచి రోడ్లు ఉన్నాయని చాలామంది నిర్లక్ష్యంగా నడుపుతున్నారు: హద్దుమీరి వేగం పెంచడం, ఫోన్ మాట్లాడుతూనో, మత్తులోనో, అలసటలోనో వాహనం నడపడం... ఇవన్నీ ప్రమాదాలకు దారి తీస్తున్నాయి. సిగ్నల్స్, జీబ్రా క్రాసింగ్‌లు మొదలైన వాటి విషయంలో సరైన అవగాహన లేకపోవటం కూడా పెద్ద సమస్యగా మారింది.

దేశం ఏదైనా ప్రమాదాలకు కారణాలు మాత్రం అవే: వేగం, నిర్లక్ష్య పూరితమైన డ్రైవింగ్, వాహన సంరక్షణ సరిగా చేయకపోవటం, ట్రాఫిక్ నిబంధనలు పట్టించుకోకపోవడం... మొదలైనవి. ఇది గుర్తించిన అనేక దేశాలు పలు చర్యలు తీసుకుంటున్నాయి. ప్రపంచంలో రోడ్డు భద్రతలో స్వీడన్ అగ్రగామి దేశం. 1997లో వారు 'విజన్ జీరో' అనే ప్రత్యేక విధానాన్ని ప్రారంభించారు. దీని ప్రధాన ఉద్దేశ్యం "రోడ్డు ప్రమాదంలో ఒక్క ప్రాణం కూడా కోల్పోవడం అంగీకారయోగ్యం కాదు". ఈ విధానం ప్రకారం అక్కడి రహదారి వ్యవస్థను సురక్షితంగా రూపొందించారు. రోడ్డు నిర్మాణంలో రెండు దిశల మధ్య బారియర్లు ఏర్పాటు చేశారు. ప్రమాదకర కూడళ్ల వద్ద వృత్తాకార మార్గాలను ఏర్పాటు చేశారు. పాదచారుల కోసం ప్రత్యేక జోన్లు, ఫుట్‌పాత్‌లు సృష్టించారు. వాహన భద్రతా సాంకేతికతలో భాగంగా ఆటోమేటిక్ బ్రేక్ సిస్టమ్‌లు, సీట్ బెల్ట్ అలామ్‌లు, ఎయిర్ బ్యాగ్‌లు తప్పనిసరి చేశారు. వేగ నియంత్రణ కోసం ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో వేగ పరిమితి తగ్గించారు. కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేశారు. రోడ్డు భద్రతపై విద్యా కార్యక్రమాలు నిర్వహించి, డ్రైవింగ్‌లో క్రమశిక్షణ పెంచారు. జపాన్‌లోనూ చట్టాలను కఠినంగా అమలు చేస్తారు. వేగ నియంత్రణ కెమెరాలు, ఆటో బ్రేక్ వ్యవస్థలు, లేన్ డిసిప్లిన్ సిస్టమ్స్ అన్ని వాహనాల్లోను ఉంటాయి. మత్తులో డ్రైవింగ్ చేస్తే తీవ్ర శిక్షలు విధిస్తారు. డ్రైవింగ్ లైసెన్స్ పొందడానికి కఠినమైన శిక్షణ, పరీక్షలు తప్పనిసరి. పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు రోడ్డు భద్రతా పాఠాలు బోధిస్తారు. అందుకే అక్కడ ప్రమాదాలు చాలా తక్కువ. యూకేలో 'థింక్ రోడ్ సేఫ్టీ' అనే ప్రచారం ద్వారా ప్రజల్లో అవగాహన పెంచారు. వేగ పరిమితులను కెమెరాలతో పర్యవేక్షిస్తున్నారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో సైన్‌బోర్డులు, లైటింగ్, పాదచారి మార్గాలను మెరుగుపరుస్తున్నారు.



ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో రోడ్లను పునర్ రూపకల్పన చేశారు. ఈ దేశాలు ప్రమాదాలపై డేటా సేకరించి విశ్లేషిస్తాయి. చర్యలు తీసుకుంటాయి.

భారతదేశంలో రహదారులూ ఎక్కువే, ప్రమాదాలు కూడా ఎక్కువే. దీనికి పరిష్కారంగా మోటార్ వెహికల్ అమెండ్‌మెంట్ ఆక్ట్ ద్వారా కఠిన చట్టాలు తీసుకొచ్చారు. పాఠశాలల్లో, కళాశాలల్లో రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత వేగంగా వైద్య సహాయం అందించడం చాలా ముఖ్యం. యూరప్ దేశాల్లో 'గోల్డెన్ అవర్' సూత్రాన్ని కచ్చితంగా పాటిస్తారు. ప్రమాదం జరిగిన గంటలో చికిత్స అందిస్తారు. భారతదేశంలో '108 అంబులెన్స్ సర్వీస్' ఈ దిశగా ఒక మంచి ఉదాహరణ. అమెరికా, యూకే వంటి దేశాల్లో బాధితులకు బీమా పరిహారం వెంటనే అందుతుంది. భారతదేశంలో కూడా 'రోడ్ యాక్సిడెంట్ రిలీఫ్ ఫండ్' వంటి పథకాలు ప్రారంభమయ్యాయి. జపాన్, ఆస్ట్రేలియా దేశాల్లో ప్రమాద బాధితుల కోసం ప్రత్యేక పునరావాస కేంద్రాలు ఉన్నాయి. మానసిక కౌన్సెలింగ్, వైద్య సేవల ద్వారా బాధితులు తిరిగి సాధారణ జీవితంలోకి వస్తున్నారు. యూకేలోని 'బ్రేక్', ఆస్ట్రేలియాలోని 'అరైవ్, అలైవ్' వంటి సంస్థలు ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహనను పెంచి, బాధితులకు సహాయం చేస్తున్నాయి.

రోడ్లు కేవలం వేగం కోసం గాక, భద్రత కోసం ఉండాలి. ప్రభుత్వం రహదారి నిర్మాణంతో పాటు– భద్రతా విధానాలు, కఠిన చట్టాలు, డ్రైవర్ ట్రైనింగ్, అత్యవసర సేవలను బలోపేతం చేయాలి. ప్రజలూ తమ బాధ్యతను గుర్తించి ట్రాఫిక్ నియమాలను గౌరవించాలి. మన ప్రాణం మాత్రమే కాదు, ఇతరుల ప్రాణం కూడా మన చేతిలోనే ఉందని గుర్తుపెట్టుకోవాలి.

భవిష్యత్తులో సాంకేతికత పెద్ద పాత్ర పోషించనున్నది. ఆటోమేటిక్ బ్రేక్‌లు, సెన్సార్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ట్రాఫిక్ నియంత్రణ వ్యవస్థలు ప్రమాదాలను తగ్గిస్తాయి. కానీ వీటితో పాటు సహనం, క్రమశిక్షణ, కరుణ వంటి మానవ విలువలు కూడా అవసరం. రోడ్డు భద్రత అంటే కేవలం చట్టం లేదా సాంకేతికత కాదు, అది ప్రతి మనిషి బాధ్యత. అభివృద్ధి అంటే ప్రాణాలు కోల్పోవడం కాదు, వాటిని కాపాడుతూ ముందుకు సాగడం. ప్రతి కొత్త రహదారి భద్రత, అవగాహన, బాధ్యత అనే విలువలతో నిర్మాణం కావాలి. ప్రపంచంలోని మంచి పద్ధతులను నేర్చుకొని మన దేశంలో అమలు చేస్తే, వేగం – అభివృద్ధి – భద్రత మధ్య సమతుల్యం సాధ్యమవుతుంది.

• పి. వేణుగోపాల్‌రెడ్డి
ఏకలవ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com

పార్లమెంట్‌లో 'బీసీ' ప్రైవేట్ బిల్లు

బీసీ రిజర్వేషన్ల విషయంలో ఇండియా కూటమి పార్లమెంట్‌లో ప్రైవేట్ బిల్లు ప్రవేశపెట్టాలి. అప్పుడే దానికి ఏ పార్టీ మద్దతు ఇస్తుందో, ఇవ్వదో స్పష్టమవుతుంది. బీసీలకు కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ అన్యాయం చేస్తూ వస్తోందన్నది నిజం. ఆ వాస్తవాన్ని గత ఎన్నికల ప్రచార సమయంలో స్వయంగా రాహుల్ గాంధీయే ఒప్పుకున్నారు. ఆయన మాట ప్రకారం బీసీలకు న్యాయం చేకూరాలంటే.. 'ఇండియా కూటమి' పేరుతో బీసీ రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాల్సిందే.



ఈ బిల్లును ప్రవేశపెట్టడం ద్వారా అయినా బీసీల పట్ల వారికున్న 'నిజమైన అనుకూలత, చిత్తశుద్ధి'ని కాంగ్రెస్ పార్టీ ప్రదర్శించగలదు. లేదంటే, మండల్ సిఫార్సుల అమలు కోసం జరిగిన ప్రజాందోళన సమయంలో బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా చేపట్టిన మతయాత్రలను (అద్వానీ 'కమండల్ యాత్ర' చేసినట్టు, రాజీవ్‌గాంధీ 'సద్భావన యాత్ర' చేసినట్టు) మళ్లీ గుర్తు చేసుకోవాల్సి వస్తుంది. ఆ రెండు యాత్రల అసలు ఉద్దేశ్యం కూడా 'రిజర్వేషన్లపై వ్యతిరేకతే'. ఇప్పటి జోడో యాత్ర కూడా 'సామాజిక న్యాయం' అనే నినాదానికి మాత్రమే పరిమితమవుతుందా? అన్న ప్రశ్న తలెత్తుతోంది.

అందుకే, రాహుల్‌గాంధీ 'సామాజిక న్యాయం' గురించి మాట్లాడేటప్పుడు... 'సుప్రీంకోర్టు విధించిన 50 శాతం రిజర్వేషన్ పరిమితిని ఎత్తివేయా'లనే అంశంపై పోరాడే బాధ్యత తమ కాంగ్రెస్ పార్టీదేనని ఆయన నిరూపించుకోవాలి. తమ పార్టీ ఇచ్చిన హామీ బూటకం కాదని 'బీసీ రిజర్వేషన్ ప్రైవేట్ బిల్లును పార్లమెంట్‌లో పెట్టడం' ద్వారా కాంగ్రెస్ చాటిచెప్పాలి. లేకపోతే, బీసీలకు ఆ పార్టీ వ్యతిరేకమనే అభిప్రాయం ప్రజల్లో బలపడుతుంది. బీఆర్‌ఎస్‌ను అధికారంలో నుంచి దింపేందుకు, బీసీ ఓట్లను కాంగ్రెస్ వైపునకు తిప్పేందుకు చేసిన ప్రయత్నం వాస్తవమైతే, ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి 'బీసీ బిల్లు' కోసం కాంగ్రెస్ అధిష్ఠానంపై ఒత్తిడి తేవాలి. కానీ ఆయన అలాంటిదేమీ చేయడం లేదు. 'రిజర్వేషన్లకు అడ్డం' అంటూ కాంగ్రెస్, బీజేపీ పరస్పరం నిందించుకుంటూనే ఉన్నాయి. కానీ 'బీసీ రిజర్వేషన్ల' సమస్య పరిష్కారంపై ఎటువంటి చర్చ, ఆలోచన చేయడం లేదు.

పార్లమెంటరీ వ్యవస్థలో ఉన్న వామపక్షాలు అయినా బీసీ ఉద్యమానికి నాయకత్వం వహించి దానిని పటిష్ఠం చేయాలి. కానీ వారు కూడా నామమాత్ర పాత్రకే పరిమితమవుతున్నారు. పార్లమెంట్‌లో బీసీ ప్రైవేట్ బిల్లును పెట్టడానికి చొరవ చూపడం లేదు. తెలంగాణకు చెందిన మాజీ, ప్రస్తుత బీజేపీ ఎంపీలు సైతం బీసీ సమస్యల పరిష్కారం, రిజర్వేషన్ల బిల్లు అమలుకు తగిన కృషి చేయడం లేదు! పార్టీ నిర్ణయాలకు కట్టుబడి ఉండాలన్న నెపంతో, తమ రాజకీయ మనుగడ ప్రమాదంలో పడుతుందన్న భయంతోనే వారు 'బ్రాహ్మణీయ అగ్రకుల విధానాలను' ప్రశ్నించడానికి జంకుతున్నారు. ఈ భయంతో తమ సామాజిక చైతన్యాన్ని త్యజించి, తమ వర్గాలకే ద్రోహం చేస్తున్నారు. అయినా సరే. ఈ వర్గాల ఎంపీలు తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలంటే బీసీ రిజర్వేషన్ల ప్రైవేట్ బిల్లును పార్లమెంట్‌లో పెట్టాల్సిందే. అప్పుడే బీసీల రిజర్వేషన్లు నిజమైన హక్కులుగా మారేందుకు ముందడుగు పడుతుంది. ఒకవేళ దీనికి ప్రజాప్రతినిధులు ముందుకు రాకపోతే, ఆ ఎంపీలకు బీసీ వర్గాల ప్రజలు రాజకీయ అనిశ్చితిని రుచి చూపించక తప్పదు. అప్పుడే ఈ సమస్యకు నిజమైన పరిష్కారం దొరుకుతుంది.

○ పాపని నాగరాజు
కొంకల వెంకటనారాయణ (సత్యశోధక మహాసభ)

రంగవల్లి సంస్మరణ సభ

ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) వ్యవస్థాపకుడు కామ్రేడ్ జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ 1975 నవంబర్ 5న (ఎమర్జెన్సీ కాలంలో) చీకటిగుండ్ల ఎన్‌కౌంటర్‌లో అమరుడయ్యారు. అనంతరం జంపాల ఆశయసాధనకు పీడీఎస్‌యూ జెండాను ఎత్తినది కామ్రేడ్ రంగవల్లి. యాదృచ్ఛికమే అయినా ఈ ఇద్దరూ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వాసులే.

కామ్రేడ్ రంగవల్లి ఉన్నతమైన కుటుంబంలో జన్మించించారు. ఉన్నత చదువుల కోసం హైదరాబాద్ వచ్చి, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తత్వశాస్త్రం అభ్యసించారు. ఆ సమయంలోనే పీడీఎస్‌యూ రాష్ట్ర కోశాధికారిగా ఎన్నికయ్యారు. 'విజృంభణ' మాస పత్రికకు ఎడిటర్‌గా పనిచేశారు. ఆమె కేవలం విద్యార్థి ఉద్యమాలకే పరిమితం కాలేదు. మహిళా సమస్యలపైనా కదంతొక్కారు. రైతుకూలీల సమస్యల పరిష్కారం కోసం పోరాడారు. వరదల్లో నష్టపోయిన దివిసీమ ప్రజలకు అండగా నిలిచారు. ఇలా అనేక సామాజిక, సాంఘిక, సాంస్కృతిక, ఆర్థిక సమస్యల మీద రాజకీయంగా స్పందించిన ధీశాలి ఆమె. ఈ క్రమంలోనే కామ్రేడ్ రంగవల్లి అడవిబాట పట్టారు. కుల, వర్గ పోరాటాన్ని సాగించారు. సీపీఐ (ఎం-ఎల్) జనశక్తి రాష్ట్ర నాయకురాలిగా శోషిత జనాలకు అండగా, ఆదివాసీ ప్రజలకు గొంతుకగా మారారు. పోరాట ధీర రంగవల్లిని రాజ్యం 1999 నవంబర్ 11న రాజకీయహత్య చేసింది. ఆమె అమరురాలై ఇటీవలే ఇరవై ఆరేళ్లు పూర్తయ్యాయి. కామ్రేడ్ రంగవల్లి ఇరవై ఆరవ వర్ధంతిని నేడు (13న) వేములవాడలోని (నంది కమాన్) 'రంగవల్లి విజ్ఞాన కేంద్రం'లో నిర్వహించనున్నారు.

– వంగల సంతోష్
ప్రజా సంఘాల ఉమ్మడి వేదిక

'జనధర్మ'డు ఎమ్మెస్ ఆచార్య

తెలంగాణలో, ముఖ్యంగా వరంగల్‌లో ఎమ్మెస్ ఆచార్య (1924 –1994) పేరు విననివారు ఉండరు. 'పత్రిక అయ్యగారి'గా, 'ప్రెస్సు అయ్యగారి'గా ఆయనకు అటు పండితులలోనూ, ఇటు పామరులలోనూ ఎంతో ఆదరణ లభించింది. 1958 నవంబర్‌లో 'జనధర్మ'ను, 1980లో 'వరంగల్ వాణి' పత్రికను ప్రారంభించారు. పార్టీలకతీతంగా, అత్యంత నిబద్ధతతో, ప్రజాసమస్యల దర్పణంగా... తన చివరిశ్వాస వరకూ ఆ పత్రికలను నడిపిన ఆచార్య జీవితం చిరస్మరణీయం. తన సునిశిత హాస్య, వ్యంగ్య సంపాదకీయాలతో పత్రికలకొక వన్నె తెచ్చారు.



తెల్లని ఖద్దరు లాల్చీ, ధోతి, నుదుటన తిరునామాలతో జె.పి.ఎన్ రోడ్డులో తమ బాలాజీ ప్రింటింగ్ ప్రెస్సులో ప్రతిరోజూ ఉదయం నుంచి రాత్రి వరకు ఏదో రాస్తూనో, చర్చిస్తూనో ఆచార్య కనిపించేవారు. ప్రకటనల కోసమో, స్వలాభం కోసమో పత్రికా స్వాతంత్ర్యాన్ని పణంగా పెట్టలేదు. నిష్పాక్షికంగా విమర్శించి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసి, జర్నలిజంలో ఉత్తమ సంప్రదాయాలకు అద్దం పట్టారు. శ్రీమద్రామానుజుల నిజమైన శిష్యుడిగా, కులమత వివక్ష లేకుండా సమానత్వం పాటించారు. 1994లో నాటి ప్రధానమంత్రి పీవీ నరసింహారావు వరంగల్‌కు వచ్చినప్పుడు, పత్రికా సమావేశంలో 'ఎమ్మెస్ ఆచార్య గారు రాలేదా?' అని ప్రశ్నించారు. ఆచార్య మరణ వార్త విని, తన విచారాన్ని వెలిబుచ్చారు. ఆచార్య జీవితమంతా ఎత్తుపల్లాలతోనే గడిచింది. స్వల్ప వేతనంతో కాంపౌండర్, ప్రైవేట్ స్కూల్లో టీచర్, బట్టల కొట్టులో విక్రేత, పేపర్ పంచే కార్మికుడు... వంటి ఎన్నో ఉద్యోగాలు చేసి, కుటుంబ పోషణకు తోడ్పడ్డారు.

ఆచార్య తన 'జనధర్మ' పత్రికను ప్రారంభించక ముందు ఇనుగుర్తి వద్దిరాజు సోదరుల 'తెనుగు, నీలగిరి, సుజాత, తెలంగాణా, శోభ, సారస్వత జ్యోతి, గోల్కొండ' వంటి పత్రికలు తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రచురితమయ్యేవి. కొన్ని పత్రికలు ఎక్కువకాలం నిలవలేదు. కానీ, ఆచార్య పత్రికలైన 'వరంగల్ వాణి, జనధర్మ' మాత్రం ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని దాదాపు నాలుగు దశాబ్దాల పాటు అత్యంత ప్రామాణికతతో నడిచాయంటే, ఆ ఘనత ఆచార్య ప్రతిభే. వరంగల్‌లో ఆయన పత్రిక స్పృశించని సమస్య లేదంటే అతిశయోక్తి కాదు. కాకతీయ యూనివర్సిటీ, కాకతీయ మెడికల్ కళాశాల, రీజినల్ ఇంజినీరింగ్ కళాశాలల స్థాపనలో ఆయన పత్రికల కృషి అనిర్వచనీయం. కాజీపేటలో రైల్వే కోచ్ ఏర్పాటుకు కృషి చేశారు.

తెలంగాణ విమోచన పోరాటంలో కూడా ఆచార్య తనవంతు పాత్రను పోషించారు. ఈ క్రమంలోనే ఎన్నోసార్లు రజాకార్ల చేతిలో ఆయన దెబ్బలు తిన్నారు, జైలుకు వెళ్లారు. రజాకార్లకు వ్యతిరేకంగా వరంగల్‌లో 'ప్రతాప రుద్రదళం' పేర వ్యాయామశాలను నడిపి, యువకులను పోరాట దిశగా తీర్చిదిద్దారు. రజాకార్ల అత్యాచార వార్తలను పత్రికలకు పంపేవారు. ఈ కృషికి స్వాతంత్ర్య సమరయోధుడిగా గుర్తింపు లభించింది. నర్సంపేట తాలూకా మహేశ్వరం అడవులలో చెట్లు కొట్టుకునే 12మంది గ్రామస్థులను కమ్యూనిస్టులుగా పొరబడి, అప్పటి స్పెషల్ కమిషనర్ ఆనందప్ప అధ్వర్యంలో కాల్చిచంపిన వార్తను పత్రికలకు పంపాడని, ఆచార్యను మూడు రోజులు పోలీసులు నిర్బంధించారు. ఆ వార్త ఎలా వచ్చిందో చెప్పాలంటూ ఆయన్ను చిత్రహింసలు పెట్టారట! కానీ ఆచార్య నోరు విప్పలేదు. నాటి కలెక్టర్ పళనియప్పన్ జోక్యంతో విడుదల అయ్యారు.

ఆచార్యకు పత్రికలే ప్రాణం. వాటి తోడిదే జీవనం. జె.పి.ఎన్ రోడ్డులోని ప్రెస్సు ప్రాంగణం ఖాళీ చేయాల్సి రావడంతో... ప్రెస్సు, వరంగల్ వాణి పేపర్ అమ్మాల్సి వచ్చింది. జనధర్మను పునఃప్రారంభించాలని ప్రయత్నించారు. కానీ, ప్రెస్ అమ్మిన కొద్ది నెలలకే గుండెపోటుతో మరణించారు. 'మళ్ళీ పేపర్ నడిపి, పదిమందికి ఉపాధి కల్పిద్దామనుకుంటే వీలు కాదాయె' అని అంతిమ క్షణాలలో బాధ పడ్డారాయన. ఎమ్మెస్ ఆచార్య జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకం.

■ డా. యం. రాజగోపాలాచార్య
విశ్రాంతాచార్యులు, కాకతీయ విశ్వవిద్యాలయం

(రేపు కేయూలో ఎమ్మెస్ ఆచార్య స్మారకోపన్యాసం)



సమ్మక్క, సారలమ్మ గద్దెలకు ఉపయోగించే గ్రానైట్ రాతిని పరిశీలిస్తున్న మంత్రులు

జాతీయ పండుగగా గుర్తించాలి : మంత్రి సురేఖ

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఏయే విభాగంలో ఎవరెవరు ఏయే పనులను చేయాలో ప్రత్యేకంగా బాధ్యతలు అప్పగించామని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ఇది ఎవరి ఇంటికి సంబంధించిన పని కాదని, రాష్ట్ర ప్రగతికి, గిరిజనుల ఆరాధ్య దైవానికి ఇచ్చే ప్రాధాన్య అంశమని స్పష్టం చేశారు. మేడారం మహాజాతరను జాతీయ పండుగగా గుర్తించేలా కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి చొరవ చూపాలని అన్నారు. వారే స్వయంగా ప్రధాని మోదీ వద్దకు వెళ్లి జాతీయ హోదాను తీసుకురావాలని కోరారు.

- భవిష్యత్తులో పది కోట్ల మంది భక్తులు వచ్చినా సరిపడా సౌకర్యాలు
- అవసరమైతే మాస్టర్‌ప్లాన్‌లో మరిన్ని అంశాలు చేర్చుతాం
- గిరిజనుల సంప్రదాయాలను గౌరవిస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- మంత్రులు కొండా సురేఖ, ధనసరి సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి మేడారంలో పర్యటన
- అభివృద్ధి పనుల పరిశీలన.. అధికారులతో సమీక్ష

పక్కా ప్రణాళికతో మేడారం అభివృద్ధి పనులు

200 ఏళ్ల వరకు చెక్కుచెదరకుండా నిర్మాణాలు

ములుగు/తాడ్వాయి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మేడారం వనదేవతల దేవస్థాన అభివృద్ధి పనులను పక్కా ప్రణాళికతో చేపడుతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారంలో మంత్రులు ధనసరి అనసూయ సీతక్క, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీ బలరాం నాయక్‌తో కలిసి బుధవారం పర్యటించారు. మేడారంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడారు. కనీసం 200 సంవత్సరాల వరకు చెక్కుచెదరకుండా దేవస్థానం పునరుద్ధరణ, అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పటిష్ఠ ప్రణాళికతో చేపడుతున్నారని అన్నారు. గిరిజన సంప్రదాయలను గౌరవించి వారి ఆరాధ్య దైవానికి ఆలయాన్ని నిర్మించే పనిని సీఎం పెట్టుకున్నారని తెలిపారు. రానున్న మహాజాతరకు 2.50కోట్ల నుంచి 3కోట్ల మంది వరకు భక్తులు రానున్నారనే అంచనాలు ఉన్నాయని మంత్రి అన్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం మేడారంలో సౌకర్యాలు మరింత మెరుగుపడితే భవిష్యత్తులో జరిగే మహాజాతరలకు 10కోట్ల మంది వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు భక్తులకు సరిపడా వసతులు కల్పించేలా చర్యలు చేపట్టామని తెలిపారు. ఫేస్-2 లో మాస్టర్ ప్లాన్‌కు సంబంధించిన అంశాన్ని కూడా చేరుస్తామని తెలిపారు. ఈ నెల 22 తర్వాత సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి ఆయన సూచనల మేరకు ఇంకా ఏమైనా మాస్టర్‌ప్లాన్‌లో చేర్చాల్సిన అంశాలు ఉంటే వాటిని కూడా చేర్చి పనులను ముందుకు తీసుకెళ్తామన్నారు.

సీఎం సంకల్పసిద్ధికి నిదర్శనం: మంత్రి లక్ష్మణ్

మేడారం అభివృద్ధి పనులను సమన్వయంతో ముందుకు

(మిగతా 7వ పేజీలో)



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

పంచాయతీల సమగ్రాభివృద్ధికి కృషి

- పీఆర్‌ఆర్‌డీ కమిషనర్ జి.శ్రీజన
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

హనుమకొండ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు జిల్లా పరిషత్‌ల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉందని, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్స్ నుంచి గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేస్తోందని రాష్ట్ర పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ శాఖ డైరెక్టర్ పీఆర్‌ఆర్‌డీ జి.శ్రీజన తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో గ్రామ పంచాయతీలు నిధుల కొరతను తీవ్రంగా ఎదుర్కొంటున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించడం లేదని ఈనెల 10న ఆంధ్రజ్యోతిలో 'పరేషాన్‌లో పంచాయతీలు' అనే కథనం ప్రచురితమైంది. దీనిపై బుధవారం ఆమె ఒక ప్రకటనలో స్పందించారు. 2025-26లో ఆర్థిక సంవత్సరంలో పారిశుధ్య కార్మికుల వేతనాలు ప్రతీనెల రూ.4,986కోట్ల చొప్పన 12 నెలలకు రూ.598.29 కోట్లను స్టేట్ ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్ నుంచి బడ్జెట్ కేటాయించి పరిపాలన ఆమోదం ఇచ్చినట్లు తెలిపారు. 2025 ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు ఆరునెలలకు రూ.299.15కోట్లను పారిశుధ్య కార్మికులకు ఎస్‌ఎఫ్‌సీ బ్యాంకు అకౌంట్లకు విడుదల చేశామన్నారు. అలాగే 2025 ఏప్రిల్ నుంచి ఆగస్టు ఐదునెలల గాను రూ.91.63కోట్లను గ్రామ పంచాయతీలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు విడుదల చేశామన్నారు. గ్రామ, మండల, జిల్లా పరిషత్‌లలో అభివృద్ధి కార్యక్రమాలకు రూ.170కోట్లు, రూ.20కోట్లు, రూ.10కోట్లకు స్టేట్ ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్ నుంచి పరిపాలన ఆమోదం పొందాయని, త్వరలో ఈ నిధులు విడుదల చేస్తామని తెలిపారు. గ్రామ పంచాయతీలలో 95శాతం ఇంటి పన్ను వసూలు చేస్తున్నామని, లేఔట్ అనుమతుల ఫీజులు, భవన నిర్మాణ అనుమతుల ఫీజు, వృత్తి వ్యాపార లైసెన్స్‌ల ఫీజులు, ఆదాయం సమకూర్చి వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నామని జి.శ్రీజన తెలిపారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి



బీసీ ధర్మదీక్షల్లో మాట్లాడుతున్న సిరికొండ మధుసూదనచారి

- శాసనమండలి ప్రతిపక్షనేత మధుసూదనచారి
- కేయూలో మూడో రోజుకు చేరిన బీసీ ధర్మదీక్షలు


కేయూ క్యాంపస్ నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీఆర్‌ఎస్ శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి డిమాండ్ చేశారు. కేయూ దూరవిద్య కేంద్రం ప్రాంగణంలో చేపట్టిన బీసీ ధర్మదీక్షలు బుధవారం మూడోరోజుకు చేరాయి. మధుసూదనాచారి హాజరై ధర్మ పోరాట దీక్షకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలను విభజించే కుట్రలను తిప్పికొట్టి, నీరుకార్చేందుకు ప్రయత్నాలను అడ్డుకోవాలని అన్నారు. రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తేనే అన్నిరంగాల్లో ముందుకు సాగుతామని అన్నారు. రాజ్యాధికారాన్ని చేపట్టాలన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన తరహాలో బీసీ ఉద్యమాన్ని సాగించాలని అన్నారు. దీక్షలు బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ అరెగంటి నాగరాజుగౌడ్ నేతృత్వంలో జరుగుతుండగా పరకాల మాజీ మున్సిపల్ చైర్మన్ సోదా రామకృష్ణ, రాష్ట్ర కన్వీనర్ చిర్రారాజుగౌడ్, బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ దొడ్డెపల్లి రఘుపతి, బొనగాని యాదగిరిగౌడ్, దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు రాములు, అజయ్, రాజశేఖర్, అన్వేష్, రవితేజ, నితిన్, వరుణ్, సాయి, బసికే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాగా, దీక్షలకు రాష్ట్ర ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. మోపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ నేతృత్వంలో దీక్షలకు మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పొన్నం రాజు, గోనెల విజేందర్, డాక్టర్ ఈర్ల రాకేశ్, నాగరాజు పటేల్, విజయ్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం, ఆరోగ్యం అయ్యప్ప దీక్ష

- నియమాల మాలతో స్వామికి పూజలు
- ధర్మశాస్త్ర సేవలో స్వామి భక్తులు
- రోజురోజుకు పెరుగుతున్న ఆదరణ

7



అడిగినంత చందా ఇవ్వలేదని...

- ప్రైవేటు పాఠశాల ప్రిన్సిపాల్‌పై పీడీఎస్‌యూ నాయకుల దాడి
- ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అజయ్ సహా ఇద్దరిపై కేసు
- నేడు ప్రైవేటు పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చిన 'వడుప్సా'



ప్రిన్సిపాల్ శ్రీనివాస్ వర్మపై దాడిచేస్తున్న పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుర్రం అజయ్

వరంగల్ క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ కుమార్‌పల్లిలోని స్మైల్ డీజీ పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాస వర్మపై బుధవారం పీడీఎస్‌యూ నాయకులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడుగా చలామణి అవుతున్న నర్సంపేట సిద్ధార్థ కళాశాలకు చెందినగుర్రం అజయ్, మరో వ్యక్తి మర్రి మహేశ్‌పై కేసు నమోదు చేసినట్లు హనుమకొండ సీఐ శివకుమార్ తెలిపారు. బాధితుడు, పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాస్ వర్మ, పోలీసుల కథనం ప్రకారం..

పీడీఎస్‌యూ 23వ రాష్ట్ర మహాసభ నిర్వహణ కోసం చందా ఇవ్వాలని బుధవారం పీడీఎస్‌యూ నాయకులు స్మైల్ డీజీ పాఠశాలకు వచ్చి అడిగారు. దీంతో యాజమాన్యం రూ.500 ఇచ్చారు. అయితే వారు పాఠశాల నుంచి వెళ్లకుండా పాఠశాల అడ్మిన్ స్వప్నతో వాదనకు దిగారు. ఇది గమనించిన ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పీడీఎస్‌యూ నాయకులను వెళ్లిపోవాలని కోరాడు. దీంతో గుర్రం అజయ్ ఆవేశంతో ఊగిపోతూ ప్రిన్సిపాల్ చెంపపై రెండుసార్లు గట్టిగా కొట్టాడు.

ఈ క్రమంలో ఫర్నిచర్ స్వల్పంగా ధ్వంసమైంది. ఈ ఘటనపై ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు గుర్రం అజయ్, మర్రి మహేశ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అయితే గిరిజనుడైన తనను ప్రిన్సిపాల్ దూషించాడని గుర్రం అజయ్ సైతం ఫిర్యాదు చేయగా విచారణ చేస్తున్నామని సీఐ వెల్లడించారు.

నేడు ప్రైవేటు విద్యాసంస్థల బంద్

వరంగల్ ఎడ్యుకేషన్ (ఆంధ్రజ్యోతి): స్మైల్ డీజీ పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసవర్మపై జరిగిన దాడికి నిరసనగా గురువారం ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలలు, ఇంటర్, డిగ్రీ కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చినట్లు వడుప్సా వరంగల్, హనుమకొండ, జిల్లా అధ్యక్షులు చల్ల నాగార్జునరెడ్డి, మాదాల సతీష్ తెలిపారు. దాడికి నిరసనగా గురువారం చేపట్టే నిరసన, రాస్తారోకో కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు పాల్గొనాలన్నారు.

నేడు కాళోజీ సోదరుల యాది సభ



నారాయణరావు



రామేశ్వర్‌రావు

హనుమకొండ కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాళోజీ సోదరుల యాది సభను గురువారం సాయంత్రం 5.30గంటలకు హనుమకొండలోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించనున్నట్లు కాళోజీ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగిళ్ల రామశాస్త్రి, వీఆర్.విద్యార్థి ఒక ప్రకటనలో తెలిపారు. కాళోజీ నారాయణరావు స్మారక పురస్కారం సుప్రసిద్ధ సాహితీవేత్త మంగారి రాజేందర్‌కు, షాద్ కాళోజీ రామేశ్వరరావు స్మారక పురస్కారం ప్రముఖ ఉర్దూ కవి అంజనీకుమార్ గోయల్‌కు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం కాళోజీ విగ్రహం వద్ద కాళోజీ సోదరులకు నివాళి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాళోజీ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు ఎస్.జీవన్ కుమార్, అంపశయ్య నవీన్, శేషభట్టర్ నరసింహాచార్యులు, మసూద్ మిర్జామహేషెర్, పొట్లపల్లి శ్రీనివాసరావు, పందిళ్ల అశోక్ కుమార్, ఆగపాటి రాజ్‌కుమార్, గంటా రామిరెడ్డి, సిరాజుద్దీన్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.



ఉర్సుగుట్ట ప్రాంతంలో అధికారులతో మాట్లాడుతున్న మేయర్

జంక్షన్ల అభివృద్ధి పనులు చేయండి..

మేయర్ గుండు సుధారాణి ● ఉర్సుగుట్ట ప్రాంతంలో పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో జంక్షన్ల అభివృద్ధి పనులు వెంటనే మొదలుపెట్టాలని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం వరంగల్ ఉర్సుగుట్ట, హనుమకొండ చౌరస్తా, సెంట్రల్ లైబ్రరీ ప్రాంతాల్లోని జంక్షన్లలో అభివృద్ధి పనులు చేయనున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నగర పరిధిలో జంక్షన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు, టెండర్లు పిలిచామన్నారు. జంక్షన్ల అభివృద్ధి పనులు త్వరతగతిన ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ సత్యనారాయణ, ఎంహెచ్‌వో రాజేశ్, ఈఈ సంతోష్‌బాబు, డీఈ రంగారావు పాల్గొన్నారు.

చెరువులో గుర్తు తెలియని మృతదేహం



హసన్‌పర్తి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగారం చెరువులో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గ్రామస్తులు గుర్తించారు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు, ఎస్సై శీలం రవి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడు సుమారు 25 ఏళ్ల వయస్సు కలిగి సుమారు 5.6 అడుగుల ఎత్తు, నలుపు రంగు జీన్స్ పాయింట్, నలుపు రంగు టీ-షర్టు ధరించి ఉన్నాడని, మృతుడి చాతిపై సంతోష్ 'కమలా' అని టాటూ ఉందని పోలీసులు తెలిపారు. అంతేకాకుండా కుడి చెయ్యిపై, మెడపై కూడా టాటూతో పాటు ఎడమ చెవికి కమ్మ, మెడలో వెండి గొలుసు ధరించి ఉన్నట్లు ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు. మృతుడి చుట్టూ చేపలు పట్టినట్టుగా గాలాలు, ఒక సంచిలో చేపలు ఉన్నాయని పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ చేరాలు సెల్ నెం.8712685124, ఎస్సై రవి సెల్ నెం.8712685098 నెంబర్లకు సమాచారం అందించి వివరాలు తెలియజేయాలని ఇన్‌స్పెక్టర్ చేరాలు కోరారు.

రేపు ఎంఎస్ ఆచార్య స్మారక ఉపన్యాసం

కేయూ క్యాంపస్ నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నవంబరు 14న శుక్రవారం కేయూ సెనెట్ హాల్‌లో ఉదయం 11 గంటలకు ఎంఎస్ ఆచార్య 7వ స్మారక ఉపన్యాసం జరుగుతుందని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం బుధవారం తెలిపారు. న్యూఢిల్లీ ఆంధ్రజ్యోతి అసోసియేట్ ఎడిటర్ ఎ.కృష్ణారావు కీలక వక్తగా హాజరై 'షిఫ్టింగ్ స్టాండర్డ్స్ ఇన్ జర్నలిజం అండ్ లిటరేచర్' అనే అంశంపై స్మారక ఉపన్యాసం చేస్తారని పేర్కొన్నారు. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి స్మారక ఉపన్యాసానికి అధ్యక్షత వహిస్తారని బోధన, బోధనేతర సిబ్బంది, స్కాలర్స్, విద్యార్థులు హాజరుకావాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం కోరారు.

వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకోవాలి

● యువతకు కలెక్టర్ సత్యశారద సూచన ● పోతన ఆడిటోరియంలో ఘనంగా యువజనోత్సవాలు



పోతన ఆడిటోరియంలో కళాకారులను సన్మానిస్తున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): యువత వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ సత్యశారద సూచించారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జిల్లా యువజన శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజనోత్సవాలను బుధవారం వరంగల్ పోతన ఆడిటోరియంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత దేనికీ భయపడకూడదని, ప్రతీ సమస్యను ధైర్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులపై ప్రేమ చూపాలని అన్నారు. యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు యువజనోత్సవాలు దోహద పడుతాయన్నారు. క్రీడా పోటీల్లో పాల్గొనే చిన్నారులకు ఆత్మస్థైర్యం ఎక్కువగా ఉంటుందని, చదువుతోపాటు ఆటల పోటీల్లో రాణించాలని, రాష్ట్ర, జాతీయ స్థాయిలో వరంగల్ కీర్తి కిరీటాన్ని నిలబెట్టాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీలు, సైన్స్ మేళా పోటీలు నిర్వహించి విజేతలకు బహుతులు అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, జిల్లా యువజన అధికారి అనిల్‌కుమార్, భుజంగరెడ్డి, శ్రీనివాస్, జాతీయ యువజన అవార్డు గ్రహీత శ్రీకాంత్, జాతీయ జాన పద కళాకారుడు కరుణాకర్, రాజేందర్, మౌనికతో పాటు ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ కొడిమ్యాల శ్రీనివాసరావు, నగేష్, రాజేందర్‌రెడ్డి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించాలి : కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్: మాదక ద్రవ్యాల రవాణా, నియంత్రణ పట్ల అవగాహన కల్పించాలని సంబంధిత శాఖ అధికారులను కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన నార్కోటిక్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. పాఠశాలలు, కాలేజీల ప్రాంగణాల్లో మత్తు పదార్థాల విక్రయదారులను గుర్తించాలని పోలీసులను ఆదేశించారు. అదే విధంగా స్ఫూర్తి కార్యక్రమంలో నార్కోటిక్ అధికారులను భాగస్వామ్యంచేసి విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని ప్రధాన కూడళ్లు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో తరచుగా పోలీసులు పెట్రోలింగ్ చేసినట్లయితే మత్తు పదార్థాల విక్రయాలను అరికట్టవచ్చని తెలిపారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో పెట్రోలింగ్ నిర్వహిస్తూ, పాఠశాలలు, కాలేజీలలో కూడా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, వరంగల్, నర్సంపేట, వర్ధన్నపేట ఏసీపీలు శుభం ప్రకాశ్, రవీందర్‌రెడ్డి, నర్సయ్య, బి.రమేశ్ చందర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రకాశ్, డాక్టర్ భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం వారోత్సవాల పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.



వయోవృద్ధుల దినోత్సవం వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు



ఎంపీ కడియం కావ్యకు వినతి పత్రం అందజేస్తున్న వెంకటేశ్వర్లు

మహాదేవయ్యను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

వరంగల్ ఎంపీ కడియం కావ్యకు వినతి

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ తపాలా ఉద్యోగుల న్యాయమైన హక్కుల కోసం పోరాడుతున్న ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ మహాదేవయ్యను కక్షపూరితంగా సర్వీస్ నుంచి తొలగించడం సరికాదని, అన్ని వెంటనే విధుల్లోకి తీసుకునే విధంగా చూడాలని వరంగల్ ఎంపీ కడియం కావ్యను గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు బొద్దున వెంకటేశ్వర్లు సుబేదారిలోని ఎంపీ క్యాంపు ఆఫీసులో బుధవారం వినతి పత్రం అందజేశారు. ఉద్యోగుల హక్కుల కోసం పోరాడే వ్యక్తిని ఉద్యోగం నుంచి తొలగించడంతో లక్షలాదిమంది తపాలా ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని వెంకటేశ్వర్లు ఎంపీ కావ్యకు విజ్ఞప్తి చేశారు. ఎంపీని కలిసిన వారిలో హనుమకొండ డివిజన్ అధ్యక్షుడు పెరుమాండ్ల తిరుపతి, చంద్రశేఖర్ ఉన్నారు.

మేకల సుమతికి డాక్టరేట్



హసన్‌పర్తి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నిరుపేద దళిత కుటుంబంలో పుట్టి, పాలు అమ్ముకొని కుటుంబాన్ని పోషించుకుంటున్న హసన్‌పర్తికి చెందిన పాల పోచయ్య తన కూతురు మేకల సుమతిని ఫార్మసీ పీహెచ్‌డీ చదివించి పలువురికి ఆదర్శంగా నిలిచాడు. సుమతికి ఫార్మసీలో డాక్టరేట్ లభించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సుమతి భోపాల్‌లోని శ్రీసత్యసాయి విశ్వవిద్యాలయంలో ఫార్మసీ విభాగంలో పీహెచ్‌డీ పట్టా పొందింది. ఈమె ప్రొఫెసర్ సీకే.త్యాగి మార్గనిర్దేశనంలో సాలిడ్ డిస్పర్షన్ టెక్నిక్ ఉపయోగించి క్లాస్-2 డ్రగ్స్ యొక్క డిస్సల్యూషనరేట్, బయో అవైలబిలిటీని పెంపొందించడం, అంచనా వేయడంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు గాను భోపాల్ శ్రీసత్యసాయి విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. ఈ సందర్భంగా గ్రామస్తులు పాల పోచయ్యతో సుమతిని ప్రశంసించి అభినందించారు.

సౌత్‌జోన్ పోటీలకు కేయూ పురుషుల జూడో జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో స్పోర్ట్స్ సెక్రటరీ వెంకయ్య

కేయూ క్యాంపస్ నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నవంబరు 13 నుంచి నవంబరు 14 వరకు భోపాల్‌లోని సాగే యూనివర్సిటీలో నిర్వహించే 2025-26 సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ పోటీలకు కాకతీయ యూనివర్సిటీ పురుషుల జూడో పోటీలకు జట్టు ఎంపికైంది. ఈ మేరకు బుధవారం కేయూ స్పోర్ట్స్ సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య ఎంపిక క్రీడాకారుల వివరాలను వెల్లడించారు. ఎల్.లక్ష్మణ్, (కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హనుమకొండ), పి.శివాజీ, (వాగ్దేవి డిగ్రీ కళాశాల, హనుమకొండ), బి. జైదీప్, (సీకేఎం, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వరంగల్), ఎం .సాయి కిరణ్ నాయక్, (కేయూ వ్యాయమ విద్యా కళాశాల, హనుమకొండ), ఎం.దర్శిత్‌నాయక్, (ఎల్‌బీ కళాశాల, వరంగల్), ఎం.ధీరజ్, (కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హనుమకొండ) ఎంపికైనట్లు వెంకయ్య వెల్లడించారు. జట్టుకు కోచ్, మేనేజర్‌గా హనుమకొండ వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పి. కిషన్ వ్యవహరిస్తారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం అభినందించారు.

ఎంజీఎంకు మందుల కొరత రాకుండా చూడాలి

ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ హరీష్ చంద్రారెడ్డి

వరంగల్ మెడికల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రోగులకు అవసరమైన మందులను సరఫరా చేయడంలో సెంట్రల్ మెడిసిన్ స్టోర్స్, ఎంజీఎం అధికారులు సమన్వయంతో పనిచేస్తూ మందుల కొరత రాకుండా చూడాలని ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ పింగిళి హరిష్ చంద్రారెడ్డి అన్నారు. ఇటీవల సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ హరిష్ చంద్రారెడ్డిని ఉమ్మడి జిల్లా సెంట్రల్ మెడిసిన్ స్టోర్ ఇన్‌చార్జి ఫార్మసీ ఆఫీసర్ ఉప్పు భాస్కర్‌రావు, వరంగల్ సీఎంఎస్ ఫార్మసీ ఆఫీసర్ వంగ సుధాకర్‌రెడ్డి బుధవారం ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం ఆర్ఎంవోలు డాక్టర్ అశ్విన్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ కోడూరి మమత పాల్గొన్నారు.



ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ హరీష్ చంద్రారెడ్డిని సన్మానిస్తున్న ఫార్మసిస్టులు

బ్రేకులు ఫెయిలై పొలాల్లోకి..

దూసుకెళ్లిన స్కూల్ బస్సు ● తృటిలో తప్పిన పెను ప్రమాదం ● ప్రాణాలతో బయటపడ్డ విద్యార్థులు

హసన్‌పర్తి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తి మండలం గంటూర్‌పల్లిలో బుధవారం ఓ ప్రైవేటు స్కూల్ బస్సు బ్రేకులు ఫెయిలై పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో విద్యార్థులకు ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో పిల్లల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రానికి చెందిన ఓ ప్రైవేటు స్కూల్ బస్సు బుధవారం విద్యార్థులను ఎక్కించుకొని గుంటూర్‌పల్లి నుంచి తిరిగి హసన్‌పర్తికి వస్తోంది. ఊరు శివారు ప్రభుత్వ పాఠశాల సమీపంలో బస్సు తిప్పుకునే క్రమంలో బస్సు బ్రేకులు ఫెయిలై ఒక్కసారిగా పొలాల్లోకి దూసుకెళ్లింది. దీంతో బస్సులో ఉన్న విద్యార్థులు భయంతో కేకలు వేయడంతో బస్సు డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి ప్రమాదం నుంచి తప్పించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఆ స్కూల్ బస్సుకు ఫిట్‌నెస్ లేకపోవడమే కాకుండా ఆ బస్సుకు కాగితాలు కూడా సరిగా లేవని, ఇన్సూరెన్స్ కూడా లేకపోవడంతో తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యంపై మండిపడుతున్నారు. బ్రేకులు ఫెయిలైన స్కూల్ బస్సు పొలాల్లోకి దూసుకెళ్లకుండా పక్కనే ఉన్న వ్యవసాయ బావిలోకి దూసుకెళ్తే పెద్ద ప్రమాదమే జరిగేదని స్థానికులు, పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేశారు.



పొలాల్లోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

ముంపు ప్రాంతాల్లో అధికారుల పర్యటన

పరిశీలించిన ఆసియన్ అభివృద్ధి బ్యాంకు ప్రతినిధులు

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నగరంలో భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో ముంపు ప్రాంతాలు నీట మునిగి ఆస్తి నష్టం జరిగింది. కాగా, బుధవారం వరంగల్ నగరంలోని పలు ప్రాంతాల్లో వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తోపాటు (ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్) అధికారుల బృందం నగరంలో పర్యటించారు. హనుమకొండలోని లష్కర్‌సింగారం, వరంగల్‌లోని ఖిలావరంగల్ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించి నాలాల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏడీబీ అధికారి జితేంద్ర.. వరద ముంపు ప్రాంతాల ప్రజలతో మాట్లాడి ముంపునకు నగరం గురికాకుండా ఉండాలంటే ఏం చేయాలి? అని అక్కడ ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా జితేంద్ర మాట్లాడుతూ.. తమ బ్యాంకు దేశంలో చాలాచోట్ల వరద ముంపు ప్రాంతాలను పర్యటించి అక్కడి ప్రజలకు ఆర్థిక సహాయం అందించిందని గుర్తు చేశారు. విపత్తు ప్రాంతాల పునరుద్ధరణకు తమ పూర్తిసహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. తర్వాత హనుమకొండ కుడా కార్యాలయంలో బల్దియా, కుడా, ఇంజనీరింగ్, ఇరిగేషన్ విభాగాల అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వారికి తగు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో కుడా సీపీవో అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావుతో పాటు అధికారులు పాల్గొన్నారు.



నయీంనగర్ ప్రాంతంలో పర్యటిస్తున్న అధికారులు

కాల భైరవుడిగా రుద్రేశ్వరుడు



హనుమకొండ కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో వైభవంగా నిర్వహిస్తున్న కార్తీక మాస వేడుకల్లో ప్రతినిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొంటున్నారు. బుధవారం అష్టమి తిథిని పురస్కరించుకొని విశేష కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం నిత్యాహ్నికం అనంతరం రుద్రేశరుడికి అభిషేకం, సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 51 కిలోల పెరుగన్నంతో రుద్రేశ్వరుడికి మిర్యాలపొడి, పెరుగును విలీనం చేసి స్వామివారికి వేదోక్తంగా మహా అన్నపూజ నిర్వహించారు. కలియుగంలో మానవుడు కోరిక కోరికలు తీర్చాల్సిన వాడు పరమశివుడే అని, బ్రహ్మాండమంతా వ్యాపించిన దేహంకల పరమశివుడు సమస్త జీవరాశుల కోర్కెలు తీర్చేవాడని గంగు ఉపేంద్రశర్మ చెప్పారు. ఈ సందర్భంగా రుద్రేశ్వరుడికి కాలాష్టమికి అనుగుణంగా కాలభైరవుడిగా అలంకరింపజేశారు. పరమశివ భక్తుడు శ్రీనివాస్, లలిత దంపతుల సౌజన్యంతో ఆలయ నాట్యమండపంలో వేద పండితుల మంత్రాల మధ్య సహస్ర లింగార్చన నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు దేవతావృక్షాల వద్ద ప్రత్యేక దీపాలు వెలిగించుకున్నారు. గంగు మణికంఠశర్మ, ప్రణవ్, శ్రవణ్ తదితరులు వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో అనిల్‌కుమార్ పర్యవేక్షణలో సిబ్బంది మధుకుమార్, రామకృష్ణ, రజిత తదితరులు సేవలందించారు. ఈనెల 15న శనివారం రుద్రేశ్వరాలయ ప్రాంగణంలోని మారేడు వృక్షాల కింద సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించనున్నట్లు పాల్గొనే భక్తులు ముందుగానే తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఈవో అనిల్ కుమార్ సూచించారు.

వైద్య ఉద్యోగుల మహాసభను జయప్రదం చేయండి

మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదనాయక్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

వరంగల్ మెడికల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 18న సంగారెడ్డిలో జరిగే వైద్య, ఆరోగ్య ఉద్యోగుల రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదనాయక్ పిలుపునిచ్చారు. బుధవారం ఎంజీఎం ఆవరణలో రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యాదనాయక్ మాట్లాడుతూ.. వైద్య, ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. దశాబ్దాల తరబడి పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ వేతనాలు పెంచాలన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఈ మహాసభకు రాష్ట్రంలోని 33 జిల్లాల్లో వైద్య, ఆరోగ్య రంగంలోని రెగ్యులర్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న అన్ని కేడర్ల ఉద్యోగులు హాజరవుతున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి చేపట్టిన మహాసభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జే.సుధాకర్, నమిండ్ల సుమన్, డెక్క కుమారస్వామి, ఆర్.సాంబరాజు, పి.రమాదేవి, పుష్ప, వినోద, రమేశ్, లత, సుభద్ర, విజయ, ప్రశాంత్, రత్నాకర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం, ఆరోగ్యం అయ్యప్ప దీక్ష

- నియమాల మాలతో స్వామికి పూజలు
- ధర్మశాస్త్ర సేవలో భక్తులు
- రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణ

వర్ధన్నపేట రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : దేవున్ని పూజించడం, ఆరాధించడం, ఒక రోజు వివిధ వ్యసనాలకు దూరంగా ఉండి, దేవాలయానికి వెళ్లి మొక్కులు తీర్చడం ఆధ్యాత్మికానికి ప్రతిరూపం. మనకు శరీరంలో మార్పులు జరిగినపుడు వెంటనే ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకుని వారు తెలిపే సూచనలు పాటిస్తూ వ్యసనాలకు దూరంగా ఉండి, ప్రతి రోజు క్రమం తప్పకుండా మందులు వేసుకోవడం ఆరోగ్యం. ఈ రెండింటిని కలుపుతూ అటు ఆధ్యాత్మికతతో పాటు ఆరోగ్యాన్ని సైతం కాపాడుకుంటూ స్వామి అనే పదంతో ప్రతి ఒక్కరినీ ఉచ్చరిస్తూ సాగిపోయే 41 రోజుల మండల దీక్ష ప్రతిరూపమే అయ్యప్ప దీక్ష. వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అయ్యప్ప స్వాముల దీక్షలు ఘనంగా సాగుతున్నాయి.

దీక్షలో ఒక్కో సూత్రం..

అయ్యప్ప భక్తులు దీక్షకాలంలో నల్లటి వస్త్రాలు ధరిస్తారు. దీంతో వారిపై శని దేవుడి చూపు ఉండదని భక్తులు విశ్వసిస్తారు. శాస్త్రీయంగాను చలికాలంలో నల్లని దుస్తులు శరీరానికి వేడినిస్తాయి. మెడలో రుద్రాక్షమాల, తులసీమాల, స్ఫటిక, తామర, పగడాల మాలలతో మానసిక ప్రశాంతత చేకూరుతుంది. నుదుటిపై కుంకుమ, గంధం, చందనాలు పెట్టుకుని అలంకార ప్రాయంగా ఉంటారు. దీంతో నాడీ మండలానికి కేంద్రం నుదుటి భాగం కావడంతో ఒత్తిడిని దూరం చేయడంతో ఆరోగ్యదాయకమని భావిస్తారు. నేలపై నిద్రపోవడంతో వెన్నునొప్పి దూరమై ప్రశాంతత లభిస్తుంది. పాదరక్షలు లేకుండా నడవడంతో తగిన రీతిలో రక్త ప్రసరణ జరుగుతుంది. తెల్లవారు జామున బ్రహ్మ ముహూర్తంలో, రాత్రి సూర్యాస్తమయం తర్వాత ప్రతి రోజూ తలస్నానం చేయడం వలన మనసుకు హాయిని కలిగించి, ఏకాగ్రత కోల్పోకుండా చేసి శరీరంలోని నరాలు సరిగ్గా పనిచేసేలా చేస్తుంది. దీక్ష సమయంలో ఉదయం సాయంత్రం క్రమ పద్ధతిలో నామపఠనాలు, ధ్యానంతో ఏకాగ్రత, క్రమశిక్షణ అలవాటవుతుంది. ఆహార నియమాలతో కోరికలు అదుపులో ఉంటాయి.



వరంగల్‌లో అయ్యప్ప మాలధారణ చేస్తున్న సుబ్రహ్మణ్యేశ్వర గురుస్వామి

శబరిమలకు చేరుకోవడం ఎలా ?

దీక్ష చేపట్టిన స్వాములు శబరిమలకు వెళ్లి అయ్యప్ప స్వామిని దర్శించుకుంటారు. ఇందులో ముఖ్యంగా కన్నె స్వాములు తప్పకుండా యాత్ర చేయాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా పెద్ద పాదం చేపట్టే వారు కేరళలోని ఎరిమేలి వరకు వాహనాల్లో చేరుకొని అక్కడి నుంచి నడుచుకుంటూ అటవీ మార్గంలో 70 కిలోమీటర్లు ప్రయాణించి ఆలయానికి వెళ్తారు. మార్గం మధ్యలో కాలికట్ట ఆశ్రమానికి చేరుకుంటారు. అళుదా నదిని దాటి కలిడం కొండ, కరిమళ కొండ, పెరియాన వట్టం, సిరియాన వట్టం గుట్టలపై నుంచి పంపానది మీదుగా వెళ్తారు. పంబా నుంచి చిన్న పాదం ప్రారంభమవుతుంది. పెద్ద పాదం చేయని అయ్యప్ప స్వాములు బస్సుల ద్వారా పంబాకు నేరుగా చేరుకుని అక్కడి నుంచి ప్రతి ఒక్కరు నడిచి వెళ్లాల్సిందే. వృద్ధులకు, నడవలేని వారి కోసం అక్కడ డోలీ (మోసుకుని వెళ్లేది) సదుపాయం ఉంటుంది. దానికోసం అక్కడి వారు కొంత డబ్బులు తీసుకుంటారు. పంబాలో పవిత్ర స్నానం ఆచరించి ఇరుముడితో కన్నెముల గణపతికి కొబ్బరికాయ కొట్టి చిన్నపాదం ప్రారంభిస్తారు. అప్పాచి మేడే, నీలిమల కొండ, శరణుగుత్తి కొండపై నుంచి సన్నిధానం వరకు చేరుకుంటారు. అనంతరం 18మెట్లు ఎక్కి అయ్యప్ప దర్శనం చేసుకుని ఇరుముడిని సమర్పిస్తారు. ఇరుముడి ఎత్తుకున్న స్వాములను మాత్రమే 18 మెట్లు ఎక్కేందుకు అక్కడి అధికారులు అనుమతిస్తారు.

నియమాల మాల

ప్రతి ఏటా కార్తీక మాసంలో అయ్యప్ప దీక్షను స్వీకరించి 41 రోజుల పాటు నియమాలతో కూడిన దీక్షను పాటిస్తారు. ఏదైనా ఒక పనిని 41 రోజుల పాటు చేస్తే అది జీవితంలో భాగం అయిపోతుందంటారు. అందరికీ ఈ విషయం తెలిసినా చేయడానికి శరరీం, మనసు అంగీకరించవు. అదే దైవం పేరుతో అనుసరించే దీక్ష అయితే కచ్చితంగా ఆచరిస్తారు. కఠిన దీక్షలు చేయడం వల్ల క్రమశిక్షణ, ఆహార, వ్యవహారాల్లో మార్పు వస్తుంది. అందుకే ఏటా అయ్యప్ప దీక్షాపరుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఇందులో ఇమిడి ఉన్న ఆధ్యాత్మిక, ఆరోగ్య, మానసిక అంశాలు అందరినీ మంత్ర ముగ్ధుల్ని చేస్తున్నాయి.

స్వాములకు పేర్లు..

అయ్యప్ప దీక్ష తీసుకునే స్వాములను ఒక్కో ఏడాది ఒక్కో పేరుతో పిలుస్తారు. మొదటిసారి వేసుకున్న వారిని కన్నె స్వామిగా, రెండోసారి కత్తి స్వామి, మూడోసారి గంట స్వామి, నాలుగోసారి గధ స్వామి, ఐదోసారి పేరు స్వామి, ఆరోసారి గురుస్వామిగా పిలుస్తూ 18 సార్లు మాలవేసిన గురు స్వామి కొబ్బరి చెట్టుతో (నారికేళము స్వామిగా) శబరిమల యాత్ర చేయాల్సి ఉంటుంది. ఇందులో కొందరు గురుపదేశం తీసుకుని పూర్తిగా మద్యం, మాంసాహారాలకు దూరంగా ఉంటారు. వీరు మాలధారణ చేపట్టే వారికి ఇరుముడులు కట్టడం, మాల వేయడం చేస్తారు.

ఆరోగ్యానికి మేలు..

అయ్యప్ప దీక్ష తీసుకున్న స్వాములకు కఠిన నియమాలు ఉంటాయి. క్రమశిక్షణతో పాటు నియమాల రూపంలో ఉన్న పద్ధతులు పాటిస్తే ఆరోగ్యానికి ఎంతో మేలని వైద్యులు సూచిస్తున్నారు. తెల్లవారు జామున చన్నీటి స్నానం వల్ల శరీరంలో ఉష్ణోగ్రతల క్రమబద్ధీకరణ జరుగుతుంది. శరీరంపై ఒత్తిడి తగ్గుతుంది. ఒక పూట భోజనం వల్ల ప్రోటీన్లు, విటమిన్లు, పీచు పదార్థాలను శరీరం చక్కగా వినియోగించుకుంటుంది. గ్యాస్, ఊబకాయం వంటి ఇబ్బందులు నియంత్రణలో ఉంటాయి. నేలపై పడుకోవడం వల్ల నాడీ, రక్త ప్రసరణ వ్యవస్థలు సక్రమంగా పని చేస్తాయి. శారీరక నొప్పులు తగ్గుతాయి. చెప్పులు వేసుకోకపోవడం వల్ల పాదాలు నేలను తాకుతూ ఉంటాయి. పాదాలపై ఒత్తిడి కలిగి రక్త ప్రసరణ సక్రమంగా సాగుతుంది.

మండల పూజ..

కార్తీక మాసం ప్రారంభం నుంచే అయ్యప్ప దీక్ష తీసుకునే స్వాములు రెండు పూజల్లో పాల్గొంటారు. డిసెంబరు 26న శబరిమలలో జరిగే మండల పూజకు కొంత మంది స్వాములు హాజరయ్యేలా మాలధారణ చేస్తారు. మరికొంత మంది స్వాములు జ్యోతి దర్శనానికి వెళ్లేలా ప్రణాళిక సిద్ధంచేసుకుంటారు. సంక్రాంతి పండుగ రోజున అయ్యప్ప జ్యోతి రూపంలో దర్శనం ఇచ్చే రోజున స్వాములు ఎంతో భక్తిశ్రద్ధలతో శబరిమల సన్నిధానంలో వేచి చూస్తారు.

దీని కోసం వివిధ గ్రామాల నుంచి అయ్యప్ప స్వాములు వారికి అనుకూలంగా బస్సుల్లో, రైళ్లలో, ప్రైవేటు వాహనాల్లో, విమానాల్లో వెళ్తుంటారు. కొంత మంది గురుస్వాములు బస్సులను ఏర్పాటు చేసి శ్రీశైలం నుంచి శబరిమల వరకు దక్షిణాది రాష్ట్రాల్లో ఉన్న చాలా దేవాలయాలను చూపిస్తు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో సైతం మరిన్ని దేవాలయాలు దర్శనం చేసుకుంటారు.

స్వామి సేవలో తరిస్తున్నా..

పంజా కృష్ణ, వర్ధన్నపేట గురుస్వామి



అయ్యప్ప స్వామి దీక్షను ఆరోసారి తీసుకున్నాను. గత ఐదు సంవత్సరాలుగా అయ్యప్ప స్వామి వారి సేవలో తరించాను. ప్రతి ఏటా అయ్యప్పను కొలవాలని నిర్ణయించుకున్నాను. గురుస్వామి ఆశీస్సులతో విజయవంతంగా దీక్ష పూర్తి చేస్తున్నాను. ఈ ఏడాది కార్తీక మాసం ముందుగానే రావడంతో మాలధారణ చేసి స్వామివారి సేవలో పాల్గొంటున్నా.



హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

రైస్‌మిల్లుల యజమానులపై చర్యలు తీసుకోవాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి
- హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైస్‌మిల్లర్ల అక్రమాలకు అడ్డుకట్ట వేయడంలో అధికారులు విఫలమయ్యారని, అక్రమాలకు పాల్పడుతున్న రైస్‌మిల్లుల యజమానులపై వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి డిమాండ్ చేశారు. రైస్‌మిల్లర్ల అక్రమాలకు అడ్డుకట్టవేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా కర్రె బిక్షపతి మాట్లాడుతూ.. ఏళ్ల నుంచి రైతులను తరుగు, తాలు, రవాణా పేరుతో జిల్లాలో రైస్‌మిల్లులు ఇబ్బందులకు గురిచేయడమే కాకుండా ప్రభుత్వాన్ని కూడా మోసం చేస్తున్నాయన్నారు. ధాన్యం కాంటా వేసేటప్పుడు తరుగు తీసే పేరుతో రైతులను దోపిడీ చేస్తున్నారన్నారు. తరుగు రూపంలోనే రైతులకు రూ.కోట్లలో నష్టం వస్తుందని, దీనికి కారణం రైస్ మిల్లులు మాత్రమే కాదని, అధికారులు కూడా కారణం అన్నారు. జిల్లాలోని రైస్‌మిల్లులను నెలకోసారి పౌరసరఫరాల శాఖ అధికారులు తనిఖీ చేయాలన్నారు. రైతులకు గన్నీ బ్యాగులను అవసరం మేరకు అందించాలని, సరిపడా లారీలను ఏర్పాటు చేసి రవాణా సమస్యలు రాకుండా చూడాలన్నారు. మొంథా తుఫాన్ వల్ల దెబ్బతిన్న ధాన్యాన్ని నాణ్యత పేరుతో కొనుగోళ్లు ఆపద్దన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, కరుణాకర్, జిల్లా నాయకులు మద్దెల ఎల్లేష్, ఎదునూరి వెంకట్రాజం, నేదునూరి రాజమొగిలి, లక్ష్మణ్, రవి, రాజు, శ్రీనివాస్, రాజేందర్‌తో పాటు పెద్ద సంఖ్యలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

‘జెవెల్స్ ఆఫ్ గ్లోరి వరంగల్’ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎస్ రామకృష్ణారావు తదితరులు

హనుమకొండ కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ కన్నెగంటి వెంకటరమణ రచించిన జెవెల్స్ ఆఫ్ అసఫ్ జాహిస్, గ్లోరి ఆఫ్ వరంగల్, కాఫీ టేబుల్ బుక్‌ను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు బుధవారం ఆవిష్కరించారు. డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సచివాలయంలోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన పుస్తకావిష్కరణ కార్యక్రమంలో సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్.ప్రియాంక కూడా పాల్గొన్నారు. వరంగల్ నగరంలోని అసఫ్‌జాహిల హయాంలో నిర్మాణమైన అద్భుత కట్టడాలు, వరంగల్ కేంద్రంగా పాలనను చేసిన సుబేదారుల వివరాలు, వారి చరిత్రతో కూడిన ఈ కాఫీ టేబుల్ బుక్ చరిత్ర పరిశోధకులకు, పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని సీఎస్ తెలిపారు. వరంగల్ ప్రధాన కేంద్రంగా నమోదైన చరిత్రలో అరుదైన విశేషాలతో ఈ గ్రంథాన్ని వెలువరించినట్లు రచయిత కన్నెగంటి వెంకటరమణ చెప్పారు.

నలుగురు దొంగల ముఠా అరెస్ట్

రూ.25వేల నగదు, ఆటో, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం



చోరీ నిందితుల అరెస్ట్ చూపుతున్న ఎస్సై రఘుపతి

ఖానాపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జల్సాలకు అలవాటు పడి పగలు వివిధ పనులు చేసుకుంటూ రాత్రి వేళల్లో ఆటోలో తిరుగుతూ చోరీలకు పాల్పడుతున్న నలుగురు దొంగల ముఠాను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రఘుపతి తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల అరెస్ట్ చూపి ఎస్సై వివరాలను వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన మాలోత్ శివ, భూక్య అభిరామ్, గుడిబండ్ల రాము, ఇదే జిల్లా మాలబంజర గ్రామానికి చెందిన ద్రాక్ష సుధాకర్‌లు స్నేహితులు. శివ, సుధాకర్‌లు వృత్తిరీత్యా ఆటోడ్రైవర్లు, రాము వెల్డింగ్, అభిరామ్ మెకానిక్ పనుల చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. కాగా, కొద్ది నెలలుగా జల్సాలకు అలవాటుపడ్డారు. దీంతో వారికి ఆదాయం సరిపోక దొంగతనాలకు పాల్పడుతున్నారు. పాల్వంచకు చెందిన ఓ వ్యక్తికి చెందిన ఆటోను శివ అద్దెకు తీసుకుని పగలంతా నడుపుకుంటూ రాత్రివేళల్లో నలుగురు ఆటోలో ప్రయాణిస్తూ చోరీలకు పాల్పడేవారు. ఈ క్రమంలో సెప్టెంబర్ 28న పెద్దమ్మగడ్డలో రెండు గొర్రెలను అపహరించకుపోయి కొరివి అంగడిలో విక్రయించుకున్నారు.

మరో వారం రోజుల తరువాత అదే పెద్దమ్మగడ్డలో మరో గొర్రెను అపహరించకుపోయి నెక్కొండ అంగడిలో విక్రయించారు. నవంబర్ 10న మరోసారి పెద్దమ్మగడ్డలో రెండు గొర్రెలను అపహరించుకుపోయి కొరివి అంగడిలో విక్రయించారు. దీంతో పాటు అక్టోబర్ 23 రాత్రి నర్సంపేట పట్టణంలోని పాకాల సెంటర్‌లో 41 సెంట్రింగ్ ప్లేట్స్, బాక్స్‌ను అపహరించుకుపోయారు. వీటిని వరంగల్‌లో విక్రయించుకునేందుకు ఈ నెల 11న పాల్వంచ నుంచి నలుగురు ఆటోలో వస్తుండగా ఖానాపురం శివారులో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా అనుమానస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా పెద్దమ్మగడ్డలో గొర్రెల దొంగతనం, నర్సంపేటలో సెంట్రింగ్ ప్లేట్స్, బాక్స్ దొంగతనం చేసినట్లుగా అంగీకరించారు. వారి వద్ద నుంచి రూ.25వేల నగదు, ఆటో, 4 సెల్‌ఫోన్లు సీజ్ చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన కానిస్టేబుల్ సుమన్, సీతారామరాజు, విజయ్‌కుమార్, వీరస్వామి, రమేశ్, రాజు, సంతోష్ హోం గార్డు రాంబాబు, ఎర్రయ్యను ఎస్సై అభినందించారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు

నలుగురిపై కేసు నమోదు

మహదేవపూర్ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టేందుకు యత్నించిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు మహదేవపూర్ ఎస్సై పవన్ కుమార్ తెలిపారు. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని ఎల్కేశ్వరం శివారు గుట్టల ప్రాంతంలో కొంత మంది అనుమానితులు బుధవారం రాత్రి గుప్తనిధులకు ప్రయత్నిస్తున్నట్లు గ్రామస్థుల ద్వారా సమాచారం అందడంతో అక్కడికి వెళ్లినట్టు ఎస్సై తెలిపారు. ఎల్కేశ్వరంతో పాటు సూరారం గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు పట్టుబడగా వారిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. వారి నుంచి రెండు గడ్డపారలు, ఒక గంప, తవ్వేందుకు ఉపయోగించే పరికరాలు, 10 నిమ్మకాయలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రైల్వే ఇన్‌స్టిట్యూట్‌ను సందర్శించిన ఏడీఆర్‌ఎం

కాజీపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాజీపేట రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్‌ను బుధవారం దక్షిణ మధ్య రైల్వే అడిషనల్ డివిజనల్ మేనేజర్(ఏడీఆర్‌ఎం) ఎ.సంజీవరావు సందర్శించారు. ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్‌ను అభివృద్ధి పనులను అడిగితెలుసుకున్నారు, స్నూకర్ బోర్డు, క్యారమ్ బోర్డు, లైబ్రరీలను సందర్శించారు. ఇనిస్టిట్యూట్ అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తానని ఏడీఆర్‌ఎం తెలిపారు. అంతకుముందు రైల్వేస్టేషన్, డీజిల్ లోకోషెడ్, ఎలక్ట్రిక్ లోకోషెడ్‌లను ఆయన సందర్శించారు. రైల్వే కార్మికులతో, అధికారులతో మాట్లాడి షెడ్‌లలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈఎల్ఎస్‌లో మజ్దూర్ యూనియన్ బ్రాంచి సెక్రటరీ నాయిని సదానందం కార్మికులతో కలసి ఏడీఆర్ఎంకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రంలో ఖాళీలను భర్తీ చేయాలని, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని, పార్కింగ్ సౌకర్యం కల్పించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.



ఇనిస్టిట్యూట్‌ను పరిశీలిస్తున్న ఏడీఆర్‌ఎం సంజీవరావు తదితరులు

పక్కా ప్రణాళికతో మేడారం అభివృద్ధి పనులు

(5వ పేజీ తరువాయి)



మేడారం సమ్మక్క సారలమ్మ గద్దెల వ్యూ

తీసుకెళ్తున్నామని గిరిజన శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. కట్ ఆఫ్ తేదీ నిర్ణయించుకుని లక్ష్యసాధనలో ముందుకు వెళ్లడం సీఎం సంకల్పసిద్ధికి నిదర్శనమని కొనియాడారు. వనదేవతల దయతో గిరిజన శాఖ మంత్రిని అయ్యానన్నారు. జాతరకు ముందే పనులు పూర్తి అయ్యేలా పక్కా ప్రణాళికులతో, సమన్వయంతో పని చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం కార్యదర్శి శ్రీనివాసరాజు, దేవాదాయ, ధర్మదాయ శాఖ కమినర్ హరీశ్, ములుగు కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్, డీఎఫ్‌వో రాహుల్‌కిషన్ జాదవ్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ రేగా కల్యాణి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గోల్లపెల్లి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు, కాంట్రాక్టర్లపై మంత్రి పొంగులేటి ఫైర్

మేడారం అభివృద్ధి పనుల్లో అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తున్నారని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు శాఖల అధికారులు, పూజారులతో హరిత హోటల్ సమావేశపు గదిలో మంత్రులు సీతక్క, సురేఖ, లక్ష్మణ్ కుమార్, ఎంపీ బలరాం నాయక్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా స్లైడ్ షో ద్వారా మాస్టర్‌ప్లాన్ ప్రణాళికల్లో రూపొందించిన డిజైన్లను పరిశీలిస్తూ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జరిగిన పనుల్లో అనుకున్న స్థాయిలో జరగలేదని పొంగులేటి అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. డిసెంబరు 22 లోగా రోడ్ల విస్తరణ పనులు, డిసెంబరు 30లోగా దేవస్థానం అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. అలాగే జనవరి 15 లోగా మహా జాతరకు వచ్చే భక్తులకు సౌకర్యాలు, వసతుల ఏర్పాట్ల పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి సమస్యలు ఎదురైనా అధికారుల పై చర్యలు తప్పవని హెచ్చరించినట్టు తెలిసింది. మేడారం ప్రధాన పరిసర ప్రాంతాల్లో 500 రకాల ఔషధ మొక్కలు నాటాలని అధికారులకు ఆదేశించారు.

మంత్రుల పర్యటన సాగిందిలా..

మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎంపీ బల రాంనాయక్ ఉదయం 11.30 గంటలకు హెలికాప్టర్‌లో మేడారం చేరుకున్నారు. హెలిప్యాడ్ నుంచి రోడ్డు మార్గాన వాహనాల్లో గద్దెల ప్రాంగణానికి వెళ్లారు. వారికి ముందుగా గిరిజన పూజారులు, దేవస్థానం అధికారులు స్వాగతం పలికారు. గద్దెలకు చేరుకున్న మంత్రులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న క్రమంలో కాస్త ఆలస్యంగా వచ్చిన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వారితో కలిసి పూజలో పాల్గొన్నారు. సమ్మక్క-సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెలను దర్శించుకున్న అనంతరం పూజారులు తల్లుల ప్రసాదాలను మంత్రులకు అందజేశారు. పట్టు వస్త్రాలను కప్పి సన్మానించారు. అనంతరం దేవస్థానంలో జరుగుతున్న పునరుద్ధరణ పనులను మంత్రులు కాలి నడకన తిరిగి పరిశీలించారు. పనుల పురోగతిపై మంత్రులకు ఆర్‌ఎండ్‌బీ ఈఎన్‌సీ మోహన్‌రావు వివరించారు. రాతికట్టడాలను నిర్మించే బేస్‌మెంట్, స్వాగత తోరణాల నిర్మాణాల పునాదులు, ప్రాకారం, గోవిందరాజు, పగిడిద్దరాజుల గద్దెల పునఃప్రతిష్ఠించే నిర్మాణాలను పరిశీలించిన మంత్రులు అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే మేడారం వచ్చిన రాతి శిలలను పరిశీలించారు. రోడ్ల విస్తరణ పనులను పరిశీలించి డిసెంబరు 22 లోగా పనులు పూర్తి చేసి భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. అనంతరం హరిత హోటల్‌కు చేరుకొని సమీక్షలో పాల్గొన్నారు.

మంత్రుల పర్యటనలో అపశ్రుతి

మంత్రుల మేడారం పర్యటనలో స్వల్ప అపశ్రుతి చోటు చేసుకుంది. శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, సురేఖ, లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి పనులను పరిశీలిస్తున్న క్రమంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ కాలు స్లిప్ అయి కిందపడిపోయారు. వెంటనే మంత్రులు సీతక్క, సురేఖ ఆమెను పైకి లేపారు. అధికారులు, పూజారులతో సమీక్ష అనంతరం మీడియా సమావేశానికి ముందు మంత్రి కొండా సురేఖను రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తలపై చేయి వేసి ఆప్యాయంగా పలకరించారు. ఈ క్రమంలో ఇద్దరు నవ్వుతూ మాట్లాడుకున్నారు.

పనులను త్వరితగతిన పూర్తి చేస్తాం : మంత్రి సీతక్క

మహాజాతర జనవరి 28 నుంచి 31వరకు జరగనున్న నేపథ్యంలో పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నిశ్చయించుకున్నామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. 90 రోజుల్లో పనులను పూర్తి చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామన్నారు. ఇప్పటికే పనులకు కావాల్సిన మెటీరియల్‌ను తెప్పించుకున్నట్లు తెలిపారు. ఆదివాసీల ఆత్మగౌరవాన్ని కాపాడడమే కాకుండా భక్తుల సౌకర్యార్థం ఈ పనులను ఒక విజన్‌తో చేపడుతున్నామని తెలిపారు.

వారి సేవలు.. ఆదర్శం

- గ్రామాభివృద్ధిలో విలేజ్ డెవలప్‌మెంట్ సొసైటీ భాగస్వామ్యం
- విద్యకు ప్రాధాన్యం.. గ్రంథాలయం ఏర్పాటు

ఖానాపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రామానికి, గ్రామస్థులకు ఏ సమస్య వచ్చినా మేమున్నామంటూ ముందుకు వచ్చారు విలేజ్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు. ఎన్నో పనులను ఒక్కొక్కటిగా చేసుకుంటూ గ్రామాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్నారు. మండలంలోని ధర్మరావుపేట గ్రామానికి చెందిన యువకులు ప్రభుత్వమిచ్చే నిధుల కోసం వేచిచూడకుండా గ్రామాభివృద్ధి కోసం 2017లో 32 మందితో విలేజ్ డెవలప్‌మెంట్ సొసైటీని ఏర్పాటు చేసుకున్నారు. అందులో గ్రామానికి చెందిన వివిధ యువజన సంఘాల అధ్యక్ష, కార్యదర్శితో పాటు ఇద్దరు సభ్యులను కమిటీలో భాగస్వాములను చేశారు. రాజకీయాలకతీతంగా గ్రామానికి సేవలు అందించాలని తీర్మానించారు. గ్రామాభివృద్ధిలో యువతనంతా భాగస్వాములను చేశారు.



గ్రామానికి స్వర్గ రథాన్ని అందజేస్తున్న విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ బాధ్యులు

ఒక్కో విభాగానికి ఒక్కో కమిటీని వేసుకుని గ్రామానికి అత్యవసర పనులను గుర్తించారు. శ్రమదానంతో చేసే పనులను చేపడుతూనే విలేజ్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు చందాలు వేసుకుంటూ గ్రామస్థులు, అలాగే ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారి నుంచి విరాళాలు సేకరించి అభివృద్ధి పనులు చేపడుతున్నారు. విరాళాల ప్రతి పైసకు లెక్కలు చూపుతూ గ్రామాన్ని అభివృద్ధి చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

రూ.30 లక్షలతో అభివృద్ధి పనులు

విలేజ్ డెవలప్‌మెంట్ సభ్యులు ఇప్పటివరకు గ్రామంలో రూ.30 లక్షలతో పలు అభివృద్ధి పనులను చేపట్టారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేశారు. గ్రామంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నందున విలేజ్ డెవలప్‌మెంట్ సభ్యులే ఇంటింటికీ తిరిగి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. రూ.6 లక్షలతో పాఠశాలలో మౌలిక వసతులను మెరుగుపర్చారు. అలాగే స్కూల్‌కు వైఫై సౌకర్యం కల్పించారు. దీంతో పాటు గ్రామంలో రూ.5.30 లక్షలతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి ప్రతి ఏటా రూ.5,116 నగదు అందిస్తున్నారు. అంత్యక్రియల కోసం రూ.7.5 లక్షలతో స్వర్గరథాన్ని కొనుగోలు చేసి గ్రామానికి అప్పగించారు. కరోనా సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన కందుకూరి అక్షితకు రూ.1.60 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. అదేవిధంగా కరోనా సమయంలో మృతి చెందిన చిన్నపల్లి నవీన్ కూతురు పేరుమీద రూ.1.50 లక్షలు సుకన్య సమృద్ధి యోజనలో జమ చేశారు. నిరుపేదల దహన సంస్కారాలకు రూ.25 వేలు అందజేస్తున్నారు. రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. లాభాపేక్ష లేకుండా గ్రామాభివృద్ధే లక్ష్యంగా సేవలు అందిస్తున్న విలేజ్ డెవలప్‌మెంట్ సొసైటీ సేవలు ఆదర్శనీయం.

ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం..



గ్రామంలో సర్పంచ్, కార్యదర్శి, పాలకవర్గ సభ్యులకు సహకరిస్తూ గ్రామాభివృద్ధిలో భాగస్వాములమవుతున్నాం. గ్రామంలో ప్రభుత్వ నిధులతో చేపట్టే పనులను నాణ్యంగా చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నాం. గ్రామం నుంచి యువత రాబోయే రోజుల్లో అధిక సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేలా వారికి అవగాహన కల్పిస్తున్నాం. ధర్మరావుపేటను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం.

చెంచాల కృష్ణ, వీడీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ధర్మరావుపేట

కేయూలో కవి అందెశ్రీకి నివాళి

కేయూ క్యాంపస్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సహజ కవి అందెశ్రీకి బుధవారం కేయూ తెలుగు విభాగాధిపతి మామిడి లింగయ్య నేతృత్వంలో నివాళులర్పించారు. అందెశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం లింగయ్య మాట్లాడారు. అందెశ్రీ రచనలు, కవిత్వం, సాహిత్యం ప్రజా చైతన్యానికి అద్దం పడుతోందన్నారు. ఆయన గీతాలు ప్రజల హృదయాల్లో నిలుస్తాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగం బీవోఎస్ చైర్మన్, కేయూ పాలక మండలి సభ్యులు డాక్టర్ చిర్రా రాజుగౌడ్, డాక్టర్ కర్రె సదాశివ్, డాక్టర్ బానోత్ స్వామి, డాక్టర్ పుల్లాకుమార్ తదితరులు పాల్గొన్నారు. అందెశ్రీ మృతి పట్ల మౌనం పాటించి ఆత్మ శాంతి కలగాలని ఆకాంక్షించారు.



అందెశ్రీ చిత్రపటం వద్ద నివాళు లర్పిస్తున్న లింగయ్య తదితరులు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జయంతి తదితరులు

వృద్ధుల వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

హనుమకొండ సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వయోవృద్ధుల వారోత్సవాల పోస్టర్‌ను అడిషనల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి, డీడబ్ల్యూవో జయంతి ఆవిష్కరించారు. బుధవారం హనుమకొండలోని కలెక్టరేట్ కార్యాలయంలో కార్యక్రమం జరిగింది. వాస్తవానికి అక్టోబర్ 1న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ కార్యక్రమం నిర్వహించాల్సి ఉంది. అప్పుడు ఈ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ ప్రకటించింది. ఈ క్రమంలో నవంబరు 19న వయో వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి జయంతి తెలిపారు. ఈ సందర్భంగానే నవంబరు 13 నుంచి 19 వరకు వయో వృద్ధుల కార్యక్రమ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నవంబరు 13న యాక్టివ్ ఏజింగ్ అంశంపై వయో వృద్ధులకు అవగాహన సదస్సు, 14న వృద్ధాశ్రమాల్లో క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు, 15, 17, 18వ తేదీల్లో వాకతాన్ ర్యాలీ, తల్లిదండ్రుల సంరక్షణ చట్టంపై అవగాహన సదస్సు, 19న ముగింపు కార్యక్రమం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీవో రాథోడ్ రమేశ్, సీనియర్ సిటీజన్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మెగా సదరం శిబిరం ప్రారంభం



సదరం శిబిరం నిర్వహిస్తున్న అధికారులు

వరంగల్ మెడికల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మెగా సదరం శిబిరం ఎంజీఎం ఆస్పత్రి ఆవరణలో బుధవారం ప్రారంభమైంది. హనుమకొండ డీఆర్‌డీఏ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ఎంజీఎం ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరం కొనసాగింది. 600 మంది వికలాంగులు ఈ శిబిరంలో పాల్గొన్నారు. ఈ నెల 15వ తేదీ వరకు శిబిరం కొనసాగుతుంది. వికలాంగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీష్ చంద్రారెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య, డీఆర్‌డీవో మేన శ్రీను, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్‌కు అభినందన



శివకు సర్టిఫికెట్ ఇస్తున్న ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్ తదితరులు

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 వలంటీర్ ఉప్పల శివ గుజరాజ్‌తోని రామచంద్ర నార్త్ గుజరాత్ విశ్వవిద్యాలయంలో అక్టోబరు 31 నుంచి ఈ నెల 9వ తేదీ వరకు జరిగిన ప్రీ రిపబ్లిక్ డే శిక్షణ శిబిరంలో పాల్గొన్నాడు. శిక్షణ పూర్తి చేసుకొని బుధవారం తిగిరి రాగా, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శ్రీనివాస్ శిక్షణ సర్టిఫికెట్ అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఈ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు జనవరి 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ కవాతులో పాల్గొనటానికి ఎంపిక అవుతారని తెలిపారు. ఈ అవకాశం మన కళాశాల విద్యార్థి శివకు రావడం గర్వకారణమన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు సీతారాములు, డాక్టర్ గంగిశెట్టి శ్రీనివాస్, ఘన్‌సింగ్, వైస్‌ప్రిన్సిపాల్ రాజశేఖర్, డాక్టర్ శ్రీనాథ్, రవికుమార్, అధ్యాపకులు కవిత, రవీందర్, చిన్న, వెంకన్న, వెంకట రమణ, సమ్మయ్య, దినకర్, ప్రదీప్, శ్రవణ్, రాంరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ డైరెక్టర్ సహాయ



సమావేశంలో మాట్లాడుతున్న సిస్టర్ సహాయ

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని ఉన్నత స్థాయిలో ఉండాలని ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ సూచించారు. హనుమకొండ సుబేదారిలోని అసుంతభవన్‌లో బుధవారం 150మంది నిరుపేద విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా సిస్టర్ సహాయ మాట్లాడుతూ.. ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ బాల్య వివాహాల నిర్మూలన, బాలల అక్రమ రవాణా నిర్మూలన బాలలపై జరుగుతున్న లైంగిక దాడుల నివారణతో పాటు తప్పనిసరి సెకండరీ స్థాయి విద్యను బాలలకు అందించాలనే ఉద్దేశంతో అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ అన్న మేరీ, సిస్టర్ అల్బర్ట, సిస్టర్ అమృత, సిస్టర్ నిర్మలతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు, సంస్థ కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

కూచిపూడిలో ప్రతిభ చాటిన రిత్విక



హనుమకొండ కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ న్యూశాయంపేటకు చెందిన కంభంపాటి రిత్విక తన అద్భుత ప్రతిభతో కూచిపూడి నృత్యంలో ప్రత్యేక బహుమతి సాధించి ఓరుగల్లు ఖ్యాతిని చాటింది. 4వ తరగతి చదువుతున్న రిత్విక రెండు రోజు ల కిందట ఆంధ్రప్రదేశ్ గుంటూరులోని వెంకటాద్రి ఇం టర్నేషనల్ టెక్నాలజీకల్ యూనివర్సిటీలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన బాలోత్సవ్‌లో కూచిపూడి సబ్ జూనియర్ విభాగంలో ఆమె అద్భుత నృత్యంతో ప్రత్యేక కేటగిరిలో న్యాయ నిర్ణేతలను మెప్పించి ప్రత్యేక బహుమతి తన సొంతం చేసుకుంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 200 మందికిపైగా పాల్గొన్న బాల కళాకారుల్లో వరంగల్ నుంచి పాల్గొన్న రిత్విక నగరంలోని శివానంద నృత్యమాల నాట్యాచారుడు బోంపెల్లి సుధీర్‌రావు వద్ద నృత్యం నేర్చుకుంది.

వ్యర్థాల నిర్వహణలో భాగస్వామ్యం కావాలి

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్, పొడి వ్యర్థాల నిర్వహణలో జీడబ్ల్యూఎంసీని భాగసామ్యం చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. బుధవారం కమిషనర్ చాంబర్‌లో ఐటీసీ వావ్ ప్రతినిధులతో సమావేశంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్, డ్రై వేస్ట్ నిర్వహణలో భాగస్వామ్యం చేయడానికి గల అవకాశాలను పరించాలని, 5 ప్లస్ 1 ఫార్ములాలో భాగంగా నగరంలో ఐదురోజులు తడి చెత్త సేకరణ, ఒకరోజు పొడి చెత్త సేకరణ జరపడానికి అవకాశాలను పరిశీలించాలని కోరారు. ఈ సమావేశంలో సీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజారెడ్డి, ఐటీసీ వావ్ ఎం.డి. ఉమాకాంత్, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, ఐటీసీ వావ్ ప్రతినిధి పవన్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ డిప్యూటేషన్లను వెంటనే రద్దు చేయాలి

ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్ నాయక్



మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు వినతిపత్రం ఇస్తున్న అజ్మీరా వెంకట్‌నాయక్

వడ్డెపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఉమ్మడి జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో అక్రమ డిప్యూటేషన్లను వెంటనే రద్దు చేయాలని లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్ నాయక్ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్ నాయక్ మాట్లాడుతూ.. జనగామ జిల్లాలో ప్రస్తుతం నర్మెట, జనగామ, స్టేషన్ ఘన్‌పూర్‌లో బాలికలు, బాలుర పాఠశాల నాలుగు గిరిజన సంక్షేమ పాఠశాలలు ఉన్నాయని పేర్కొన్నారు. వీటిలో గిరిజన పేద కుటుంబాలకు చెందిన పిల్లలు చదువుకుంటున్నారని తెలిపారు. గిరిజన పిల్లల తల్లిదండ్రులు పేదలు కావడంతో హైదరాబాద్, హనుమకొండ, కరీంనగర్, తదితర పట్టణాల్లో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారన్నారు. ఈ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను డిప్యూటేషన్లతో ఇతర పాఠశాలలకు పంపడం వలన విద్యార్థులకు విద్యా బోధన సక్రమంగా జరగడం లేదని వెంకట్ తెలిపారు. అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేసి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యాబోధన సక్రమంగా నిర్వహించేలా చూడాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు సమర్పించిన వినతి పత్రంలో ఆయన కోరారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 54 మందికి జరిమానా

వరంగల్ క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 54 మందిని బుధవారం కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి ఎ. వేణుగోపాల్ రూ. 58,500 జరిమానా విధించారని హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.సీతారెడ్డి తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని 19 మందిని జడ్జి ఎదుట హాజరు పరచగా రూ.11,400 జరిమానా విధించారన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా గురువారం బాలసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలోని బాలసముద్రం, అంబేద్కర్ సెంటర్ ఏరియా, రమేశ్ ఆస్పత్రి ఏరియా, నక్కలగుట్ట బీఎస్ఎన్ఎల్ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఏరియాలో ఉదయం 9.30 నుంచి 11.30 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి. సాంబరెడ్డి తెలిపారు.

కేయూ డిగ్రీ పరీక్షలు వాయిదా వేయాలి



రిజిస్ట్రార్‌కు వినతిపత్రం ఇస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కేయూ క్యాంపస్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 18 నుంచి నిర్వహించనున్న డిగ్రీ 1, 3, 5వ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని పీడీఎస్‌యూ హనుమకొండ కార్యవర్గం ఆధ్వర్యంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంను తన చాంబర్‌లో కలిసి వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వంశీకృష్ణ మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సమ్మెతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు బంద్‌లు నిర్వహించాయని తెలిపారు. దీంతో విద్యార్థులకు సిలబస్ పూర్తికాలేదని పేర్కొన్నారు. సిలబస్ పూర్తికాకుండా పరీక్షలు నిర్వహిస్తే విద్యార్థులు నష్టపోతారని, ఉత్తీర్ణత పడిపోతుందని తెలిపారు. వర్సిటీ అధికారులు సిలబస్ పూర్తయ్యేవరకు పరీక్షలను వాయిదా వేసి విద్యార్థులు పరీక్షలకు సిద్ధమయ్యేందుకు సమయం ఇవ్వాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు దీక్షిత్‌రెడ్డి, ఆకాశ్, నందు, ప్రసాద్, కిశోర్, ప్రశాంత్, తరుణ్, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠినచర్యలు

డీహెచ్‌ఈడబ్ల్యూ జెండర్ స్పెషలిస్ట్ స్వర్ణలత

ఆత్మకూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రా మీణ ప్రాంతాల్లో ప్రభుత్వ నిబంధనలకు వ్యతి రేకంగా బాల్య వివాహాలు చేస్తున్నారని అలాంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటా మని డీహెచ్‌ఈడబ్ల్యూ జెండర్ స్పెషలిస్ట్ స్వర్ణలత హెచ్చరించారు. బుధవారం మండలంలోని కొత్తగ ట్టు గ్రామంలో తల్లిదండ్రులతో పాటు అధికారులు ర్యాలీ నిర్వహించి, మొక్కలు నాటారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి రాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా స్వర్ణలత పాల్గొని మాట్లాడారు. బాలికల సంరక్షణ కోసం ప్రభుత్వం బాలల సంరక్షణ విభాగం ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వం బాల్య వివాహాల నిరోధక చట్టం 2006 ఏర్పాటు చేశారన్నారు. బాలికల తల్లిదండ్రులు బాల్య వివాహాలు చేయడం మాని వారిని ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరైనా బాల్య వివాహాలు చేస్తే చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం బాలికల తల్లిదండ్రుల నుంచి హామీ పత్రాలను స్వీకరించారు. బాల్య వివాహాలు చేస్తే వారి పై సంవత్సరం జైలు, లక్ష రూపాయలు జరిమానా విధించడం జరుగుతుందని స్వర్ణలత పే ర్కొన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నసీం పర్వీన్, బాలల పరిరక్షణ విభాగం జౌట్‌రీచ్ వర్కర్ విజయ్‌కుమార్, చైల్డ్‌హెల్ప్‌లైన్ వర్కర్ ర మేష్, షేర్ ఎన్జీవో ప్రతినిధి జ్ఞానేశ్వరి, గురువులు అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రుద్రయాగ ఏర్పాట్ల పరిశీలన



యాగ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

పరకాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పరకాల పట్టణ కేంద్రంలోని శ్రీ కుంకుమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 17న నిర్వహించనున్న మహా రుద్రయాగ ఏర్పాట్లను బుధవారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అధికారులు, నిర్వాహకులు, సేవా సంస్థల ప్రతినిధులతో కలిసి సందర్శించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యాగశాల, భక్తుల వసతి, పార్కింగ్, తాగునీటి, ఫైర్ సేఫ్టీ, అన్నదానం, వంటి సదుపాయాలు సక్రమంగా ఏర్పాటు చేయాలని సూచించారు. యాగాన్ని ఘనంగా, భక్తి శ్రద్ధలతో నిర్వహించేందుకు అవసరమైన సహకారాలు అందజేస్తానని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారు లు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. భక్తులు అధిక సం ఖ్యలో హాజరయ్యే మహా రుద్రయాగ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి పిలుపునిచ్చారు.



క్లూస్ టీంతో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

రాంనగర్‌లో దొంగల హల్‌చల్

హనుమకొండ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ రాంనగర్ ప్రాంతంలో దొంగల ముఠా హల్‌చల్ సృష్టించింది. తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనానికి యత్నించిన ఘటన బుధవారం జరిగింది. సుబేదారి సీఐ మేకల రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. రాంనగర్‌కు చెందిన రైల్వే ఉద్యోగి మూడు ఎడ్ల కుమార్, అతడి భార్య రజిత (అంగన్‌వాడీ టీచర్) ఇద్దరు ఉదయం డ్యూటీకి వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగిలి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించినట్లు సీఐ తెలిపారు. బాధితులు నగదు, బంగారం పోయినట్లు ఫిర్యాదు చేయడంతో క్లూస్‌టీంతో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని సీసీ కెమెరాల ఆధారాలను సేకరిస్తున్నట్లు తెలిపారు.

పెళ్లి కావడం లేదని..

యువకుడు ఆత్మహత్య

ఆత్మకూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మూడు పదుల వయస్సు దాటినా పెళ్లి కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది యువకుడు రైలు పట్టాలపై తలపెట్టి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆత్మకూరు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బుధవారం యువకుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన బూర సురేందర్, రమ దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమార్తె వివాహం కాగా, పెద్ద కుమారుడు బూర నరేష్ (32)కు నాలుగు సంవత్సరాల నుంచి తల్లిదండ్రులు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. సంబంధం కోసం ఎక్కడికి వెళ్లినా అబ్బా యి ఏంపని చేస్తున్నాడని ఆడపిల్లల తల్లిదండ్రులు అడుగుతుండడంతో హైదరాబాద్ అమీర్‌పేటలో ఓ బట్టల షాపులో పని చేస్తున్నాడని తెలపడంతో పిల్లను ఇచ్చేందుకు ఎవరూ ముందు రాలేదు. దీంతో జీవితంలో నాకు ఎవరూ పిల్లను ఇవ్వరని మనస్తాపానికి గురైన నరేష్ మంగళవారం మధ్యాహ్నం ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధిలోని మాధవరెడ్డి ఫ్లై ఓవర్ సమీపంలో గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోగా రైల్వేస్టేషన్ పోలీసులు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. బుధవారం గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం నరేష్ మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

పెగడపల్లి పీఏసీఎస్ సభ్యులపై ఫిర్యాదు



ఏసీపీ కార్యాలయం వద్ద రైతులతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంతోష్

వరంగల్ క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జరుగుతున్న అక్రమాలు, అమలు కానీ రైతు రుణ మాఫీపై ప్రశ్నించినందుకు అక్రమ కేసులు బనాయిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో పెగడపల్లి రైతులు హనుమకొండ ఏసీపీ నరసింహారావుకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో సొసైటీలో జరుగుతున్న అక్రమాలు, అక్రమ కేసుల గురించి వివరించినట్లు బాధిత రైతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెగడపల్లికి చెందిన రైతు కత్తుల అనిల్ యాదవ్, ఎస్టీ మోర్చా నాయకుడు నాను నాయక్, ఎస్సీ మోర్చా నాయకుడు సంద్ర మధు, రైతులు పాల్గొన్నారు.

గురుకులంలో స్వయం ఉపాధి శిక్షణ

శంభునిపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రంగశా యిపేట సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం జన్ శిక్షణ్ సంస్థాన్ (జేఎస్ఎస్) స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వి.రాధిక, జేఎస్ఎస్ డైరెక్టర్ ఎమ్డీ ఖాజామసియొద్దీన్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో వృత్తి విద్యా నైపుణ్యాలను మెరుగుపరచడంతో పాటు ఫ్రంట్ ఆఫీస్ అసిస్టెంట్, ఆఫీస్ అసిస్టెంట్, ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్, బ్యూటీషియన్‌లో శిక్షణ అందిస్తామన్నారు. విద్యార్థులు ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోవటానికి ఇలాంటి శిక్షణా శిబిరాలు ఉపయోగపడతాయన్నారు. కోర్సులకు సంబంధించిన రికార్డు బుక్స్, బ్యూటీషియన్ కోర్సు కిట్స్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్‌లు భూక్యా తిరుపతి, పి.రాజు, కె.సుజిత్, రీసోర్స్ పర్సన్స్ జె.సుప్రియ, అర్షియా అంజూమ్, వైస్ ప్రిన్సిపాల్ వి.స్రవంతి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ పి.వీణ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



స్వెట్టర్లను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ వసంత మహేందర్‌రెడ్డి

మునిసిపల్ సిబ్బందికి స్వెట్టర్ల పంపిణీ

జూలైవాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): 59వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మునిసిపల్ కార్మిక సిబ్బందికి స్వెట్టర్లు పంపిణీ చేశారు. ఎక్సైజ్ కాలనీలోని డాక్టర్ నరేశ్-లక్ష్మీ దంపతుల దాతృత్వంతో సుమారు 25 మంది కార్మిక సిబ్బందికి స్వెటర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ కమిటీ సభ్యులు గై నారాయణ, రాము, భాను ప్రసాద్, జవాన్ సతీష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం డివిజన్‌లోని కనకదుర్గా కాలనీ పార్కులో సుందరీకరణ పనులను పర్యవేక్షించారు. పార్కు అభివృద్ధికి కావాల్సిన నిధుల గురించి చీఫ్ ఆర్టికల్చర్ ఆఫీసర్ రమేశ్‌తో మాట్లాడారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ కిరణ్‌కుమార్

హసన్‌పర్తి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తి నూతన తహసీల్దార్‌గా పి.కిరణ్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన చల్ల ప్రసాద్‌ను కిరణ్ కుమార్ స్థానంలో కలెక్టరేట్‌కు డిప్యూటేషన్‌పై బదిలీ చేస్తూ హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన కిరణ్‌కుమార్‌ను పలువురు కాంగ్రెస్ నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎం.డి.రహీం, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఫాజిల్, రాజేంద్రప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ కుమారస్వామి, కంప్యూటర్ ఆపరేటర్ ప్రశాంత్, కాంగ్రెస్ నాయకులు కనపర్తి కిరణ్, జన్ను రవిందర్, వీసం సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు బొకే ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవ్య
కుటుంబ కదంబం
గురువారం
13 నవంబరు 2025



అభిరుచి



పరిసరాలే ప్రేరణగా

తనలో దాగిన చిత్రకారిణిని నిద్ర లేపి, తనదైన శైలిలో చిత్తరువులను సృష్టిస్తున్నారు ఏలూరుకు చెందిన ఊరకరణం అంబిక. గ్రామీణ వాతావరణం, పల్లె ప్రజల జీవన విధానాల నుంచి స్ఫూర్తి పొందుతూ, వాటినే కళాఖండాలుగా మలుస్తూ, దేశ విదేశాల్లో విద్యార్థులకు చిత్రకళను బోధిస్తున్న అంబిక 'నవ్య'తో పంచుకున్న కబుర్లు.

ఆర్టిస్ట్ అనగానే ఊహ తెలిసినప్పటి నుంచి బొమ్మలు గీసే అలవాటు ఉండి ఉంటుందని అందరూ అనుకుంటారు. కానీ నేను అందుకు భిన్నం. నాకు చిన్నప్పటి నుంచి బొమ్మలు గీయడం అలవాటు లేదు. దాంతో ఎనిమిదో తరగతి ప్రాజెక్టు వర్క్‌లో భాగంగా బొమ్మలు గీయడం కోసం కజిన్ల మీద ఆధారపడేదాన్ని. ఓ సందర్భంలో వాళ్లు అందుబాటులో లేకపోవడంతో ఆ పనికి స్వయంగా పూనుకున్నాను. అలా వేసిన మొదటి బొమ్మ స్కూల్లో నాకు మంచి పేరు తెచ్చిపెట్టడంతో బొమ్మలు గీయగలననే ఆత్మవిశ్వాసం పెరిగింది. నాలో అంతర్లీనంగా ఆ కళ దాగి ఉందనే విషయాన్ని కూడా నేనప్పుడే గ్రహించాను. ఆ తర్వాత చూసి బొమ్మలు గీస్తూ సాధన చేయడం మొదలుపెట్టాను. అది చూసి నాన్న కూడా బాగా ప్రోత్సహించారు. రంగుల పెన్సిళ్లు, డ్రాయింగ్ పుస్తకాలు ఇచ్చి నా అభిరుచికి మద్దతు పలికారు. నిజానికి చిత్రకళనే కెరీర్‌గా మలుచుకోవాలనే ఆలోచన ఉన్నా, సరైన గైడెన్స్ లేకపోవడంతో చదువు మీదే దృష్టి పెట్టాను. అలా తిరుపతిలో ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్ పూర్తి చేశాను. ఓ పక్క చదువు కొనసాగుతున్నా, చిత్రకళను నిర్లక్ష్యం చేయకుండా, సాధన చేస్తూనే ఉన్నాను. చదువు పూర్తయ్యాక పెళ్లైపోయింది. దాంతో మా వారి ఉద్యోగరీత్యా హైదరాబాద్, బెంగుళూరు వెళ్లాను. తర్వాత డాటా అనలిస్టుగా కెరీర్ మొదలుపెడదామని అనుకుంటున్న సమయంలో పాప పుట్టింది. దాంతో మా వారు చిత్రకళనే కెరీర్‌గా ఎందుకు మలుచుకోకూడదు? అని ప్రశ్నించారు. అలాగే చిత్రకళకు సంబంధించిన కోర్సు పూర్తి చేయమని కూడా ప్రోత్సహించారు. దాంతో నాలో ఉత్సాహం పెరిగింది. అప్పటివరకూ గీసిన బొమ్మలను ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించడం కోసం సిద్ధపడ్డాను.

గ్రామీణ వాతావరణమే స్ఫూర్తిగా...

బెంగుళూరులో సాటి చిత్రకారులతో కలిసి ఎగ్జిబిషన్స్‌లో బొమ్మలు ప్రదర్శించినప్పుడు, వాటికి మంచి స్పందన వచ్చింది. కొందరు సీనియర్ ఆర్టిస్టులు నేను వేసిన బొమ్మల్లో కొన్ని సవరణలు చేయడంతో నాలో మరింత ఆసక్తి పెరిగింది. ఆ తర్వాత, కర్నాటక చిత్రకళా పరిషత్‌లో చిత్రకళలో ఏడాది పాటు డిప్లొమా కోర్సు చేసి, కళకు మరింత మెరుగులు దిద్దుకున్నాను. అలా అప్పటి నుంచి నాదైన శైలిని సృష్టించుకోవడం మొదలుపెట్టాను. అందుకోసం నా చుట్టూరా ఉన్న ప్రకృతినీ, గ్రామీణ వాతావరణాన్ని, గ్రామీణుల జీవనవిధానాన్ని పరిశీలిస్తూ, ఫొటోలు తీసుకుంటూ, వాటినే నాదైన శైలిలో చిత్తరువులుగా మలచడం మొదలుపెట్టాను. అలా గీసిన బొమ్మలతో బెంగుళూరు, హైదరాబాద్, పాలకొల్లులో 10 ఎగ్జిబిషన్లు పెట్టాను. 2023లో బెంగుళూరులో వంద మంది మహిళా ఆర్టిస్టులతో ఒక చిత్రకళా పోటీ ఏర్పాటు చేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఆ సెల్ఫ్ పోర్ట్రెయిట్ కాంపిటీషన్‌లో ప్రథమ బహుమతిని గెలుచుకున్నాను. అలాగే కళారత్న, చిత్రకళ అవార్డులు కూడా అందుకున్నాను. బెంగుళూరులో ఉన్న 15 ఏళ్లలో చిత్రకళకు మెరుగులు దిద్దుకోవడంతో పాటు దాన్నే కెరీర్‌గా మలుచుకోగలిగాను.

> "నేను ఏలూరులో పుట్టి పెరిగాను. ప్రస్తుతం మేం విజయవాడలో స్థిరపడ్డాం. మావారు చందర్‌రావు ఐటి బ్యాంకింగ్ ఉద్యోగానికి స్వస్తి చెప్పి, ఏలూరులో కోకో, ఆయిల్‌పామ్, గంధం మొక్కలను పెంచడంతో పాటు సేంద్రియ వ్యవసాయం మొదలుపెట్టారు. మాకక్కడ ఫామ్‌హౌస్ ఉంది. కాబట్టి ఏలూరు, విజయవాడ మధ్య తిరుగుతూ ఉంటాం. నాకు ఇద్దరు ఆడపిల్లలు. పెద్ద పాప సౌజన్య, ఒడిసాలో అగ్రికల్చర్‌లో మాస్టర్స్ చేస్తోంది. చిన్న పాప, సాహితి బెంగుళూరులో మెడిసిన్ చదువుతోంది. చిత్రకళ పట్ల ఆసక్తి ఉన్నా, బొమ్మలు గీయలేమోననే సందిగ్ధంలో ఉండిపోయేవాళ్లకు నేనిచ్చే సలహా ఒక్కటే! మొదట బెరుకును వదిలించుకుని, ఒకడుగు ముందుకేయాలి. తర్వాత సాటి కళాకారుల మార్గదర్శకత్వంలో బేసిక్స్ నేర్చుకుని, సాధన చేయడం కొనసాగిస్తే, కచ్చితంగా కళాకారులుగా ఎదగగలుగుతారు."



దేశవిదేశాల విద్యార్థులకు బోధిస్తూ...

ప్రస్తుతం విజయవాడలో స్థిరపడ్డాను. ఇక్కడ స్టూడియో ఏర్పాటు చేసుకుని ఓ పక్క బొమ్మలు గీస్తూనే, మరో పక్క చిత్రకళను బోధిస్తున్నాను. బొమ్మలు గీయడం కోసం అన్ని రకాల మీడియమ్స్‌నూ ప్రయత్నించాను. చివరకు నాకు తగిన మీడియం అక్రిలిక్ అనే విషయాన్ని గ్రహించాను. ప్రస్తుతం నా బొమ్మలన్నిటినీ ప్రధానంగా అక్రిలిక్స్‌తోనే రూపొందిస్తూ ఉంటాను. చార్కోల్‌తో కూడా బొమ్మలు గీయగలుగుతాను. గత పదిహేనేళ్లుగా విద్యార్థులకు కూడా చిత్రకళను నేర్పిస్తున్నాను. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ రెండు మార్గాల్లోనూ బోధిస్తున్నాను. అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, ఫిన్‌ల్యాండ్, సింగపూర్‌లో స్థిరపడిన భారతీయులతో పాటు మన దేశంలో ఢిల్లీ, లడక్‌కు చెందిన విద్యార్థులు నా దగ్గర చిత్రకళను నేర్చుకుంటున్నారు. వీళ్లలో 6 నుంచి 60 ఏళ్ల వయసు వాళ్లున్నారు. ప్రస్తుతం 200 మంది విద్యార్థులకు నేను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పాఠాలు నేర్పిస్తున్నాను.

● గోగుమళ్ల కవిత

కౌన్సెలింగ్

హెయిర్ డై వేసుకోవచ్చా?

డాక్టర్! నేను చాలా కాలంగా హెయిర్ డై వాడుతున్నాను. అయితే రంగు వేసుకున్న ప్రతి సారీ, ముఖం మీద దద్దుర్లు వస్తున్నాయి. దీన్ని హెయిర్‌డై రియాక్షన్‌గా భావించాలా? ఈ సమస్యను ఎలా పరిష్కరించుకోవాలి?

- ఓ సోదరి, హైదరాబాద్

తలకు వేసుకునే రంగు విషయంలో మనకెన్నో అనుమానాలుంటాయి. హెయిర్ డైను ఎంచుకునేటప్పుడు, ఏ రంగు సురక్షితం, ఏ రంగు ఎక్కువ కాలం మన్నుతుంది? దేంతో దుష్ప్రభావాలు తక్కువగా ఉంటాయి? లాంటి అంశాలను మనం పరిగణనలోకి తీసుకుంటూ ఉంటాం. అయితే ఎన్ని జాగ్రత్తలు పాటించినా పదే పదే ఉపయోగించే హెయిర్ డైలతో కొన్ని దుష్ప్రభావాలను ఎదుర్కోక తప్పదు. కాలక్రమేణా హెయిర్ డైలలో అనేక మార్పులు కూడా చోటు చేసుకుంటున్నాయి. అయినప్పటికీ వీటిలో ఉండే ఫార్మల్‌డిహైడ్ వల్ల ముఖం మీద దద్దుర్లు, తలలో పుండ్లు లాంటి రియాక్షన్లు కనిపిస్తూ ఉంటాయి. తరచూ హెయిర్ డైలను వాడే వారిలో ఈ సమస్య ఎక్కువ. అయితే ఈ దుష్ప్రభావాలకు గురి కాకుండా ఉండాలనుకుంటే, కొత్తగా అందుబాటులోకొస్తున్న వృక్షాధారిత హెయిర్ డైలను ఎంచుకోవడం మంచిది. రసాయనాలతో తయారయ్యే హెయిర్ డైలతో పోలిస్తే, వృక్షాధారిత హెయిర్ డైలు సురక్షితమైనవి. వీటితో దుష్ప్రభావాలకు తావు కూడా ఉండదు.



- డాక్టర్ స్వప్న ప్రియ,
డెర్మటాలజిస్ట్,
కాస్మో ష్యూర్, హైదరాబాద్

స్టీల్ సింక్ తళ తళ

చాలామంది వంటింట్లో స్టీల్ సింక్‌ను ఏర్పాటు చేసుకోవడానికే ఇష్టపడుతుంటారు. రోజూ సరైన విధానంలో శుభ్రం చేయకపోతే స్టీల్ సింక్ మొత్తం మరకలతో నిండిపోతుంది. అలాకాకుండా స్టీల్ సింక్ ఎప్పుడూ తళ తళలాడుతూ ఉండాలంటే ఏ చిట్కాలు పాటించాలో తెలుసుకుందాం...



- ఒక పళ్లెంలో రెండు చెంచాల ఉప్పు వేసి సగానికి కోసిన నిమ్మచెక్కతో అద్దాలి. దీంతో స్టీల్ సింక్‌ను రుద్దితే మరకలు, మురికి వెంటనే వదిలిపోతాయి. సింక్ చక్కగా మెరుస్తుంది.
- తరచూ సింక్‌లో గోరువెచ్చని నీటిని పోస్తూ ఉండాలి. దీనివల్ల డ్రెయిన్‌లో చిక్కుకున్న వ్యర్థాలన్నీ తొలగిపోతాయి. సింక్ నుంచి దుర్వాసన రాదు. తరువాత లిక్విడ్ డిటర్జెంట్‌లో అద్దిన స్క్రబ్బర్‌తో తోమితే సింక్ మీద పేరుకున్న జిడ్డు త్వరగా వదులుతుంది. ఆపైన సింక్ తళ తళలాడుతుంది.
- చిన్న గిన్నెలో రెండు చెంచాల బేకింగ్ సోడా, నాలుగు చెంచాల వెనిగర్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని పాత టూత్‌బ్రష్ సహాయంతో సింక్ మొత్తానికి పట్టించాలి. పావు గంట తరువాత స్క్రబ్బర్‌తో తోమితే మరకలు పూర్తిగా వదిలి సింక్ శుభ్రంగా కనిపిస్తుంది.
- సింక్‌లో మెత్తటి ఉప్పు, ముగ్గు, బ్లీచింగ్ పౌడర్, బేకింగ్ సోడాలలో ఒకటి చల్లి పాత టూత్‌బ్రష్‌తో రుద్దినా మరకలు తొలగిపోతాయి.

ఇంటిని అందంగా మార్చేద్దాం

సామాన్లను క్రమపద్ధతిలో సర్దుకుని కొంత సృజనాత్మకత జోడిస్తే చిన్న ఇంటిని కూడా అందంగా ఆకర్షణీయంగా కనిపించేలా చేయవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఎంత చిన్న ఇంటినైనా అపురూపంగా తీర్చిదిద్దే చిట్కాల గురించి తెలుసుకుందాం...

- వస్తువులను గోడవారగా, గది మూలల్లో నేలపై పెట్టకూడదు. పుస్తకాలు, బొమ్మలు, బట్టలు, గాజు లేదా పింగాణీ సామాగ్రిని అరల్లో చక్కగా సర్దుకోవాలి. ఇంట్లో అరలు ఎక్కువగా లేకపోతే స్టాకింగ్ బోర్డులు, ప్లాస్టిక్ ఫోల్డబుల్ అల్మారాలను ఏర్పాటు చేసుకోవాలి.



- ఇంట్లోకి గాలి, వెలుతురు ప్రసరించేలా చూసుకోవాలి. దీని వల్ల ఇల్లు విశాలంగా కనిపిస్తుంది. విద్యుత్ బల్బులు అమర్చడానికి వీలులేని చోట నేలపై స్కాన్ ల్యాంప్స్ ఏర్పాటు చేసుకుంటే ఇల్లు ప్రకాశవంతంగా ఉంటుంది. ఇంటి పై కప్పు ఎత్తుగా ఉంటే లాకెట్ దీపాలు వేలాడదీసుకోవచ్చు. టేబుల్ ల్యాంప్‌లు పెట్టుకున్నా ఇల్లు అందంగా మెరుస్తుంటుంది. వంటగది, హాల్, పిల్లలు చదువుకునే చోట, వాకిట్లో ఎక్కువ వెలుతురు వచ్చే లైట్లను ఏర్పాటు చేసుకుంటే బాగుంటుంది.
- బయటి గోడలకు సున్నానికి బదులు అందమైన ముదురు రంగులు వేయిస్తే ఇల్లు ఆకర్షణీయంగా కనిపిస్తుంది. అలాగే లోపలి గోడలకు ఒకే రంగును కాకుండా రెండు లేదా మూడు రంగులు ఉండేలా చూసుకుంటే ఇంటి అందం పెరుగుతుంది. ఇంట్లో ఉండే ఫర్నిచర్‌కు నప్పేలా గోడ రంగులు ఎంచుకోవాలి.
- కిటికీలకు చెక్క తలుపులకు బదులు అద్దాలు అమర్చుకుంటే ఇల్లు విశాలంగా కనిపిస్తుంది. అలాగే కిటికీలకు ఎదురుగా ఇంట్లో అద్దాలు పెట్టుకున్నా చూడడానికి బాగుంటుంది.

పోషకాల గని కొబ్బరి పువ్వు

కొబ్బరి నీళ్లలో కంటే కొబ్బరి పువ్వులోనే అధిక పోషకాలుంటాయనీ, దాన్ని తినడం ఆరోగ్యకరమనీ నిపుణులు చెబుతున్నారు.

- కొబ్బరి పువ్వులో పీచు పదార్థాలు పుష్కలంగా ఉంటాయి. కేలరీలు చాలా స్వల్ప పరిమాణంలో ఉంటాయి. కాబట్టి దాన్ని తినడం వల్ల ఆకలి అదుపులో ఉంటుంది. శరీరం బరువు పెరగదు. అదనపు కొవ్వులు కరిగి శరీరం సరైన ఆకృతిని సంతరించుకుంటుంది.



- కొబ్బరి పువ్వులో యాంటీ ఆక్సిడెంట్లతోపాటు ఖనిజాలు, అమైనో ఆమ్లాలు, శరీరానికి కావాల్సిన ఇతర పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. వీటి వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. జీవక్రియల పనితీరు మెరుగుపడుతుంది. రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయి తగ్గుతుంది.
- కొబ్బరి పువ్వులో గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా తక్కువ. కాబట్టి మధుమేహం ఉన్నవారు కూడా నిర్భయంగా తినవచ్చు. దానిలో ఉండే ఫ్రీ రాడికల్స్ శరీరాన్ని కేన్సర్ కారకాల నుంచి రక్షిస్తాయి. మహిళలకు నెలసరి సమస్యల నుంచి ఉపశమనాన్ని కల్గిస్తాయి.
- కొబ్బరి పువ్వు తినడం వల్ల చర్మం, శిరోజాలకు కావాల్సినంత తేమ లభిస్తుంది. శిరోజాలు నల్లగా మెరుస్తుంటాయి. మొటిమలు, మచ్చలు, ముడుతలు తొలగిపోయి చర్మం బిగుతుగా, కాంతివంతంగా మారుతుంది.
- దీనిలోని యాంటీ మైక్రోబయల్, యాంటీ వైరల్, యాంటీ పెరాసిటిక్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు అనారోగ్యాన్ని దరిచేర్చనివ్వవు.

వినూత్నం



చెరువులు, కుంటల్లో పరుచుకొన్న గుర్రపుడెక్క అందాలు... వాటి నుంచి విచ్చుకొనే పూలు... చూడ్డానికి ఇంపుగా ఉంటాయి. మనసును ఆహ్లాదంలో తేలియాడిస్తాయి. 'కానీ అవి అంతకంతకూ పెరిగి... జీవ వైవిధ్యాన్ని దెబ్బతీసి... చెరువులు, సరస్సులకు ముప్పుగా పరిణమిస్తాయ'ని అంటారు సుస్మిత కృష్ణన్. అందుకే ఆ వ్యర్థంతో కాగితం తయారు చేసి... జటిలమైన సమస్యకు చక్కని పరిష్కారం చూపారు ఈ 25 ఏళ్ల పర్యావరణ శాస్త్రవేత్త. ఏమిటా పరిష్కారం..? ఆమె మాటల్లోనే...

కలుపు మొక్కతో కాగితం

"ఎందుకో తెలియదు... చిన్నప్పటి నుంచి నాకు పర్యావరణం, దానిపై ఆధారపడ్డ జీవజాతుల గురించి ఆసక్తి ఎక్కువ. అందుకే నా చదువు కూడా అదే దారిలో సాగింది. తమిళనాడులోని తిరుచిరాపల్లి మాది. స్థానిక 'భారతీదాసన్ విశ్వవిద్యాలయం'లో లైఫ్ సైన్సెస్‌లో మాస్టర్స్ చేశాను. ఆ సమయంలోనే జీవజాతులు, పర్యావరణ వ్యవస్థల మధ్యనున్న సంక్లిష్టమైన సంబంధాన్ని గమనించాను. తరువాత 2019లో బెంగళూరు 'ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్'లో ఇంటర్న్‌షిప్‌లో భాగంగా కీటకాల తెగుళ్లు, వాటివల్ల కలిగే ఆర్థిక నష్టాలపై అధ్యయనం చేశాను. గుర్రపుడెక్క మొక్కలు ఎంతలా చెరువంతటినీ ఆక్రమించుకొంటున్నాయో, అవి ఎంత జటిలమైన సమస్యగా మారుతున్నాయో అప్పుడే అర్థమైంది. దీనికి సరైన పరిష్కారం ఏమిటనే ఆలోచన నాలో మొదలైంది.

భిన్నాభిప్రాయాలు ఉన్నా...

రెండేళ్ల కిందట అలప్పుళ 'ఎస్‌డీ కాలేజీ' ప్రొఫెసర్ డాక్టర్ నాగేంద్ర ప్రభు నేతృత్వంలోని బృందంతో కలిసి నీటి మీద పెరిగే పూల మొక్కలపై విస్తృత స్థాయిలో అధ్యయనం చేశాను. ఇది నాకు లోతైన అవగాహన కలిగించింది. సమస్య పరిష్కారం దిశగా తొలి అడుగు వేయడానికి దోహదపడింది. అయితే కొందరు పరిశోధకులు ఈ మొక్కలు చెరువుల్లోని కలుషిత నీటిని శుభ్రం చేయడానికి ఉపకరిస్తాయని చెబుతారు. అది నిజమే కావచ్చు. కానీ వాటి వల్ల ప్రయోజనం కంటే జరిగే నష్టమే ఎక్కువనేది పర్యావరణ శాస్త్రవేత్తల పలు పరిశోధనలు చెబుతున్నాయి. అవి నీటి ప్రవాహానికి అడ్డుపడతాయి. ఆక్సిజన్ స్థాయిలను తగ్గించి, పర్యావరణ వ్యవస్థకు ముప్పుగా పరిణమిస్తాయి. వీటిని తొలగించినా... అత్యంత వేగంగా, అంటే వారం నుంచి రెండు వారాల్లోపు రెట్టింపు అవుతాయి. అంతెందుకు... మా తిరుచిరాపల్లిలోని నీటి వనరుల్లోనే ఇరవై కిలోమీటర్ల మేర ఈ మొక్కలు పరుచుకున్నాయి. ప్రతి వానాకాలానికి ముందు వాటిని తొలగించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. బుల్డోజర్ల సాయంతో రోజుల తరబడి కష్టపడితే రెండు కిలోమీటర్ల కంటే ఎక్కువ తొలగించడం సాధ్యంకావడంలేదు. ఇరవై లారీలకు మించిన వ్యర్థం, భారీ వ్యయం మిగులుతున్నాయి.

పరిశోధనతో కొత్త ఉత్సాహం...

అసోమ్, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో నీటిపై పెరిగే కలుపు మొక్కలతో కొన్ని తెగలవారు బుట్టలు, బ్యాగ్‌ల లాంటివి తయారు చేస్తారు. అయితే వాటి తయారీ సులువు కాదు. చాలా సమయం పడుతుంది. అంత కష్టపడినా కొనేవారు తక్కువ. వీటన్నిటికీ పరిష్కారం కనుగొనే క్రమంలో మరింత అధ్యయనం అవసరమని భావించాను. అదే సమయంలో జర్మనీలోని ప్రతిష్ఠాత్మక 'ఇంటర్నేషనల్ సస్టెయినబిలిటీ అకాడమీ (ఐఎస్ఏ) ఫెలోషిప్ దక్కింది. పర్యావరణ పరంగా ఎదురయ్యే సవాళ్లను అధిగమించడానికి ప్రయత్నించే యువతకు ఈ ఫెలోషిప్ ఇస్తారు. దీని కోసం ప్రపంచ వ్యాప్తంగా ఎంపిక చేసిన పన్నెండు మందిలో భారత్ నుంచి నేనొక్కదాన్నే ఉన్నాను. అక్కడి 'హాంబర్గ్ విశ్వవిద్యాలయం'లో కాగితం తయారీకి ఉపయోగించే వివిధ గుజ్జులపై పరిశోధన చేశాం. ఈ క్రమంలోనే నీటిలో పెరిగే కలుపు మొక్కల గుజ్జుపై చేసిన పరిశోధన ఆశ్చర్యకర ఫలితాలను ఇచ్చింది. కాగితం తయారీ ప్రక్రియలో సాధారణంగా వాడే చెట్ల గుజ్జుకు అరవై శాతం సోడా కలపాలి. అదే దీనికైతే ఆరు శాతం సరిపోతోంది. నాణ్యత కూడా ఎంతో మెరుగ్గా ఉంది.



> పర్యావరణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కొంతమంది మహిళలకు వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నాను. మరికొన్ని కళాశాలలు, ఇతర సంస్థలు ముందుకు వస్తున్నాయి. దీంతోపాటు ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా పేపర్ ప్లేట్లు, కప్‌లు కూడా చేయాలని ప్రయత్నిస్తున్నాను. దానివల్ల ఉత్పత్తిదారులకు అదనపు ఆదాయం లభిస్తుంది. ఒక పరిశ్రమ స్థాయికి వీటి ఉత్పత్తిని తీసుకువెళ్లాలనేదే నా లక్ష్యం.

జర్మనీ వెళ్లి వచ్చాక...

జర్మనీలో పరిశోధన నాకు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. తిరిగి రాగానే కార్యక్షేత్రంలోకి దిగాను. గుర్రపుడెక్క మొక్కలతో సాధారణ కాగితానికి సరైన ప్రత్యామ్నాయ ఉత్పతి అందివ్వాలని అనుకున్నా. పేపర్ పరిశ్రమలను సంప్రతించి, వారికి దీని గురించి వివరించాను. నా పరిశోధనా పత్రాలు, సంబంధిత డేటానూ వారి ముందు పెట్టాను. కానీ వాళ్లకు నాపై నమ్మకం కలగలేదు. కొత్త విధానాన్ని చేపట్టడానికి సంకోచించారు. నా ప్రతిపాదనను తిరస్కరించారు. దాంతో నేనే ఉత్పత్తి ప్రారంభించాలని నిర్ణయించుకున్నాను.


వర్క్‌షాప్‌లతో అవగాహన...

సాధ్యమైనంతమందికి అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో వర్క్‌షాప్‌లు నిర్వహించాను. ముఖ్యంగా స్థానిక మహిళలకు అవగాహన కల్పించి, తయారీ ప్రక్రియను నేర్పించాను. కొన్ని కాలేజీ యాజమాన్యాలు ఆసక్తి కనబరిచాయి. తమ విద్యార్థులకు శిక్షణ ఇప్పించాయి. ఈ ప్రక్రియ చాలా సులువు. మొక్కల కాండాలను కోసి, ఎండబెట్టి, ఆల్కలైన్ సొల్యూషన్‌లో ఉడకబెడితే పీచు విడిపడుతుంది. పలు దశల తరువాత ఇది కాగితంగా మారుతుంది. తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో, నాణ్యమైన పేపర్ ఉత్పత్తి చేయవచ్చు. పైగా పర్యావరణహితం. ఇప్పుడు చాలామంది ఔత్సాహికులు ఈ తరహా కాగితం తయారు చేస్తున్నారు. గ్రీటింగ్ కార్డులకు, కాలేజీలో జరిగే కార్యక్రమాలకు ఆ పేపర్‌నే ఉపయోగిస్తున్నారు. ఇలాంటి మార్పునే నేను కోరుకున్నది."

ఇవి తింటే డార్క్ సర్కిల్స్ మాయం

పోషకాహారం లోపం, తగినంత నిద్ర లేకపోవడం, విపరీతమైన అలసటలాంటి కారణాల వల్ల కళ్ల కింద నల్లని వలయాలు(డార్క్ సర్కిల్స్) ఏర్పడుతుంటాయి. వీటిని తొలగించుకోవడానికి ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలుసుకుందాం...

- కీర, పుచ్చకాయలలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. వీటిని తరచూ తినడం వల్ల శరీరంలో రక్త ప్రసరణ మెరుగుపడడంతోపాటు చర్మానికి తగినంత తేమ అందుతుంది. దీంతో కళ్ల కింద వాపు, నల్ల మచ్చలు తగ్గుతాయి.
- టమాటాలో లైకోపీన్ అనే యాంటీ ఆక్సిడెంట్ ఉంటుంది. ఇది కళ్ల కింద నల్లని వలయాలను తగ్గించడంలో ప్రభావవంతంగా పనిచేస్తుంది. రోజూ ఆహారంలో టమాటాలను చేర్చుకోవడం వల్ల సమస్య తీరుతుంది.
- బొప్పాయి పండులో పపైన్ అనే ఎంజైమ్‌తో పాటు ఎ, సి విటమిన్లు ఉంటాయి. ఇవి చర్మ ఆరోగ్యాన్ని సంరక్షిస్తాయి. పండిన బొప్పాయి పండును తినడం వల్ల కళ్ల కింద చర్మం కాంతివంతంగా మారుతుంది.
- బీట్‌రూట్‌లో చర్మాన్ని రక్షించే యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి చర్మం పొరల్లో పేరుకున్న వ్యర్థాలను తొలగిస్తాయి. వారానికి రెండుసార్లు బీట్‌రూట్‌ను ఆహారంలో చేర్చుకుంటే మొటిమలు, నల్ల మచ్చలతోపాటు కళ్ల కింద ఏర్పడే డార్క్ సర్కిల్స్ మాయమవుతాయి.
- పాలకూర, తోటకూరల్లో కె విటమిన్ అధికంగా ఉంటుంది. ఇది చర్మానికి రక్త ప్రసరణ అందేలా చేస్తుంది. రోజూ ఈ ఆకుకూరలను తింటూ ఉంటే కళ్ల కింద చర్మం బిగుతుగా ఛాయగా మెరుస్తుంది.
- చర్మం తేమతో నిండి ఉంటే కళ్ల కింద నల్లని వలయాలు రావు. కాబట్టి రోజుకి కనీసం నాలుగు గ్లాసుల మంచినీరు తాగడం అలవాటు చేసుకోవాలి.
- బాదం, పల్లీలు, బ్రోకలీ, పొద్దు తిరుగుడు గింజలు, గుమ్మడి గింజల్లో ఇ విటమిన్ అధికంగా ఉంటుంది. రోజూ వీటిని తగుమాత్రంలో తీసుకోవడం వల్ల మంచి ప్రయోజనం కనిపిస్తుంది.
- రోజుకు ఒక నారింజ పండు తినడం వల్ల కొల్లాజెన్ ఉత్పత్తి పెరిగి చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. దీంతో డార్క్ సర్కిల్స్ వాటంతట అవే మాయమవుతాయి.



తప్పు చేశా.. క్షమించండి

» బెట్టింగ్ యాప్‌లకు ప్రచారంపై సినీనటుడు ప్రకాష్ రాజ్



హైదరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బెట్టింగ్ యాప్‌లకు ప్రమోట్ చేసి తప్పు చేశానని, తనని క్షమించాలని, మరోసారి అలాంటి పొరపాటు చెయ్యనని ప్రముఖ సినీనటుడు ప్రకాష్ రాజ్ అన్నారు. బెట్టింగ్ యాప్‌లకు సంబంధించిన కేసులో సిట్ విచారణకు ప్రకాష్ రాజ్ బుధవారం హాజరయ్యారు. దాదాపు గంట సేపు ప్రకాష్‌రాజ్‌ను ప్రశ్నించిన సిట్ అధికారులు.. ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు. సిట్ విచారణ అనంతరం ప్రకాష్‌రాజ్ విలేకరులతో మాట్లాడారు. బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేసి తప్పు చేశానని, ప్రజలు క్షమించాలని, మరోసారి ఇలాంటి పొరపాటు చేయనని అన్నారు. ఓ యాప్ ప్రమోషన్‌కు సంబంధించి 2016లో ఒప్పందం చేసుకొని ప్రచారం చేశానని, ఆ యాప్ తర్వాత బెట్టింగ్ యాప్‌గా మారిందని తెలిపారు. ఆ విషయం తెలిసి వెంటనే ఒప్పందాన్ని రద్దు చేసుకున్నానని వివరించారు. ఆ ఒప్పందానికి సంబంధించి సిట్ అధికారులు అడిగిన వివరాలను అందజేశానని చెప్పారు. బెట్టింగ్, గేమింగ్ యాప్‌ల్లో ఎంతోమంది యువత పెద్ద ఎత్తున డబ్బు పెట్టి నష్టపోతున్నారని, ఫలితంగా వారి కుటుంబాలు కష్టాలు పడుతున్నాయని ప్రకాష్‌రాజ్ పేర్కొన్నారు. కష్టపడకుండా ఉచితంగా వచ్చే డబ్బు ఆశించవద్దని, బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండాలని ఆయన ఈ సందర్భంగా యువతకు పిలుపునిచ్చారు. కాగా, బెట్టింగ్ యాప్‌ల ప్రచారానికి సంబంధించి నమోదైన రెండు కేసులను సిట్ అధికారులు విచారిస్తున్నారు. ఈ కేసులకు సంబంధించి సినీ ప్రముఖులు దగ్గుబాటి రానా, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మి, ప్రకాష్ రాజ్ తదితరులపై కేసులు నమోదైన సంగతి తెలిసిందే.

మీ విషయంలో తప్పు చేశాను!

ఏబీవీ, జాస్తి కృష్ణకిశోర్‌కు ప్రవీణ్ ప్రకాశ్ క్షమాపణ.. వారిపై చర్యల ఫైళ్లను తిరస్కరించి ఉండాల్సింది

» నైతికత, విలువల కోణంలో చూడాల్సింది

» అలా చేయనందుకు ఇప్పుడు ఇద్దరికీ ఫోన్‌చేసి క్షమాపణ కోరాను

» వీడియో విడుదల చేసిన రిటైర్డ్ ఐఏఎస్

అమరావతి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు, ఐఆర్ఎస్ అధికారి జాస్తి కృష్ణ కిశోర్‌కు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ప్రవీణ్ ప్రకాశ్ క్షమాపణలు చెప్పారు. జగన్ హయాంలో తాను జీఏడీ (పొలిటికల్) ముఖ్య కార్యదర్శిగా ఉన్న సమయంలో వారి పట్ల వ్యవహరించిన తీరుకు పశ్చాత్తాపపడుతూ బహిరంగ క్షమాపణలతో తాజాగా ఆయన వీడియో విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రవీణ్ ప్రకాశ్ వీఆర్ఎస్ తీసుకున్న సంగతి తెలిసిందే. వీడియోలో ఆయన మాట్లాడుతూ.. తానెప్పుడూ చట్టవిరుద్ధంగా ఫైలు రాయలేదన్నారు. జూనియర్లకు, కింది ఉద్యోగులకు కూడా చట్టవిరుద్ధంగా వ్యవహరించాలని ఎన్నడూ చెప్పలేదని తెలిపారు. 'అయితే నాపై సమాజానికి ఉన్న అంచనాల మేరకు పనిచేయలేకపోయాను. అందుకే సోషల్ మీడియాలో ట్రోలింగ్‌కు గురయ్యాను. 2020లో జీఏడీకి పొలిటికల్ విభాగానికి ముఖ్య కార్యదర్శిగా పనిచేశాను. ఆ సమయంలో డీజీపీ కార్యాలయం నుంచి నాకో ఫైలు వచ్చింది. అప్పటి అదనపు డీజీ ర్యాంకు అధికారి ఏబీ వెంకటేశ్వరరావుపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని అందులో కోరారు. ఆ సమస్య ఎలా ఉందంటే.. సివిల్ సర్వీసెస్ కండక్ట్ రూల్స్ ప్రకారం.. ప్రభుత్వ వాహనాన్ని వ్యక్తిగత పనుల కోసం వాడితే ప్రభుత్వానికి తెలియజేసి అదనంగా డబ్బు చెల్లించాలి. కానీ మేం 24 గంటలూ ప్రభుత్వ పనే చేస్తుంటాం. ఇంట్లో ఉన్నా, బయట ఇంకెక్కడ ఉన్నా పనిచేస్తూనే ఉంటాం. అందుకే మా జీవితాల్లో ప్రభుత్వం, వ్యక్తిగతం అనే గీతలు లేవు. ప్రభుత్వానికి 24 గంటలూ అందుబాటులోనే ఉంటాం. నెలకు 300 కిలోమీటర్లు వ్యక్తిగత అవసరాల కోసం ప్రభుత్వ కారు వాడితే 30 ఏళ్లకు లక్ష కిలోమీటర్లు అవుతుంది. మీ కెరీర్‌లో మొత్తం లక్ష కిలోమీటర్లు ప్రభుత్వ వాహనాన్ని వ్యక్తిగత అవసరాల కోసం వాడారు.. కాబట్టి పెనాల్టీతో రూ.40 లక్షలు చెల్లించాలంటే చట్ట ప్రకారం అది కరెక్టే. చట్టవిరుద్ధమైన పనులు చేసినట్లే! ప్రపంచంలో ఏ కోర్టుకు వెళ్లినా ఈ కేసులో ఊరట లభించదు. కానీ ప్రాక్టికల్‌గా చూస్తే అది తప్పేమీ కాదు. ఇలాంటి సమస్యే ఏబీ వెంకటేశ్వరరావు ఫైలులో ఉంది. నా కంటే 5 ఏళ్లు సీనియర్ అయిన ఐపీఎస్ అధికారి ఫైలు చూసి టెన్షన్ పడ్డాను. చట్ట ప్రకారం ఇది కరెక్టా కాదా అన్న లైన్‌లో ఫైలు పరిశీలించాను. చట్టవిరుద్ధంగా, సివిల్ సర్వీసెస్ కండక్ట్ రూల్స్‌కు వ్యతిరేకంగా ఉందని.. డీజీపీ కార్యాలయం నుంచి వచ్చిన ప్రతిపాదనల ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకోవచ్చని ఆ ఫైలులో రాశాను. ఒక ముఖ్య కార్యదర్శిగా ఆ సమస్యను నేను విలువలు, నైతికత కోణంలో చూడాల్సింది. క్రమశిక్షణ చర్యలు ఎదుర్కొంటున్న వ్యక్తి స్థానంలో ఉండి ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సింది. ఆ ఫైలును తిరస్కరించాల్సింది. అలా చేయకపోవడం కరెక్టు కాదనే ఇప్పుడు అనిపిస్తోంది. జాస్తి కృష్ణకిశోర్ ఫైలు విషయంలోనూ ఇదే తప్పు చేశాను. ఈ రెండు ఫైళ్లను నేను నైతికత, విలువల కోణంతో చూసి నిర్ణయం తీసుకోవాల్సింది. అప్పుడు చేయలేదు. అందుకే ఇప్పుడు ఏబీ వెంకటేశ్వరరావు, కృష్ణకిశోర్‌కు ఫోన్ చేసి వారికి, వారి కుటుంబ సభ్యులకు క్షమాపణ చెప్పాను. నాలో ఉన్న అపరాధ భావన పోగొట్టుకోవడానికి బహిరంగంగా కూడా వారిద్దరికీ క్షమాపణలు చెబుతున్నాను' అంటూ ప్రవీణ్ ప్రకాశ్ ముగించారు.

నాగార్జున కుటుంబంపై వ్యాఖ్యలకు
కొండా సురేఖ పశ్చాత్తాపం


» మంగళవారం అర్ధరాత్రి ట్వీట్



వరంగల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సినీ నటుడు అక్కినేని నాగార్జున కుటుంబంపై గతంలో చేసిన వ్యాఖ్యలపై పశ్చాత్తాపం వ్యక్తం చేస్తూ మంత్రి కొండా సురేఖ మంగళవారం అర్ధరాత్రి ఎక్స్‌లో పోస్టు పెట్టారు. నాగార్జున కుటుంబాన్ని కించపరచాలన్న ఉద్దేశం తనకు ఎక్కడా లేదని పేర్కొన్నారు. తన వ్యాఖ్యలకు వారు బాధపడి ఉంటే అందుకు చింతిస్తున్నట్లుగా తెలిపారు. గతంలో తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు చెప్పారు. కాగా, ఇప్పటికే కొండా సురేఖపై నాగార్జున పరువునష్టం దావా వేశారు. కోర్టులో కేసు కూడా నడుస్తోంది. ఈ సమయంలో అకస్మాత్తుగా.. అర్ధరాత్రి దాటిన తరువాత సురేఖ పశ్చాత్తాపం వ్యక్తం చేయటంపై పలు రకాల చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం సూచనలతోనే ఆమె పశ్చాత్తాపం వ్యక్తం చేశారని తెలుస్తోంది. అలాగే మంత్రి పొంగులేటితో ఉన్న విభేదాలను కూడా పరిష్కరించుకుని బుధవారం మేడారం జాతరలో జరిగిన అభివృద్ధి పనుల పరిశీలన, అధికారుల సమీక్ష సమావేశంలో సురేఖ పాల్గొన్నారనే చర్చ నడుస్తోంది.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

ఫస్ట్ డే ఫస్ట్ షో



రామ్ పోతినేని కథానాయకుడిగా పి మహేశ్‌బాబు తెరకెక్కించిన చిత్రం 'ఆంధ్రా కింగ్ తాలూకా'. మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. కన్నడ నటుడు ఉపేంద్ర, రావురమేశ్, మురళీ శర్మ, రామకృష్ణ కీలక పాత్రల్లో నటించారు. తాజాగా ఈ సినిమా టైటిల్ సాంగ్ 'ఫస్ట్ డే ఫస్ట్ షో'ను విడుదల చేశారు మేకర్స్. తమ అభిమాన కథానాయకుల సినిమా విడుదల రోజున, ముఖ్యంగా ఫస్ట్ డే ఫస్ట్ షో సమయంలో ఫ్యాన్స్ చేసే హంగామాను ఈ పాట ఆవిష్కరిస్తోంది. సినీ ప్రేమికుల ఉత్సాహాన్ని, అభిమానులకు తమ ఆరాధ్యదైవాలపై ఉన్న ప్రేమను తెలిపేలా ఉన్న ఈ పాట ప్రస్తుతం నెట్టింట సందడి చేస్తోంది. దినేశ్ కాకర్ల రాసిన ఈ పాటకు వివేక్, మెర్విన్ సంగీతం అందించారు. ఈ నెల 28న ప్రేక్షకుల ముందుకు వస్తోంది చిత్రం.



విజయ్ అంటే ఒక ఆశీర్వాదం

రష్మిక మందన్న

'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమా ప్రారంభం నుంచి విజయవంతమయ్యే వరకూ ఈ చిత్రంలో విజయ్ కూడా వ్యక్తిగతంగా ఒక భాగంగా ఉన్నాడు. ప్రతి ఒక్కరి జీవితంలో ఒక విజయ్ దేవరకొండ ఉండాలని నేను కోరుకుంటున్నాను. ఎందుకంటే అదొక ఆశీర్వాదం' అని కథానాయిక రష్మిక మందన్న అన్నారు. ఆమె ప్రధాన పాత్రలో రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించిన ఈ చిత్రం సక్సెస్‌మీట్ బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి హీరో విజయ్ దేవరకొండ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ 'ఈ రోజే 'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమా చూశాను. చాలా సార్లు కన్నీళ్లు ఆపుకోవాల్సి వచ్చింది. ఈ మధ్యకాలంలో నేను చూసిన గొప్ప చిత్రాల్లో ఇదొకటి. అందరి అమ్మాయిల్లానే రష్మిక కూడా వేధింపులు ఎదుర్కొన్నారు. ఆమె కెరీర్‌లో ఎదిగిన తీరు చూస్తుంటే చాలా గర్వంగా ఉంది. నన్ను ఎవరైనా ఏమైనా అంటే నేను రివర్స్‌లో వెళ్తాను. కానీ రష్మిక మాత్రం తనను ఎగతాళి చేసినా పట్టించుకోకుండా తన కెరీర్ పైనే ఫోకస్ పెట్టింది. తనొక అద్భుతమైన మహిళ. ప్రపంచం ఏదో ఒక రోజు నీ సత్తా తెలుసుకుంటుంది అని చెప్పాను. అది నిజమైంది' అని ప్రశంసించారు.

కాంత రూపంలో మా కోరిక తీరింది

- దుల్కర్ సల్మాన్, రానా



'కాంత' సినిమా మా ఇద్దరికీ చాలా ప్రత్యేకం. ఇండస్ట్రీ మాకు చాలా ఇచ్చింది. ఇలాంటి మంచి చిత్రంతో ఇండస్ట్రీ రుణం కొంతైనా తీర్చుకునే అవకాశం దక్కిందని భావిస్తున్నాం. అలాగే మేమిద్దరం కలసి ఓ సినిమా చేయాలని చాలా కాలంగా అనుకుంటున్నాం. 'కాంత' రూపంలో ఆ కోరిక తీరింది. ఇందులో మా పాత్రలు ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచుతాయి' అని దుల్కర్ సల్మాన్, రానా అన్నారు. వారిద్దరూ ప్రధాన పాత్రలు పోషిస్తూ, నిర్మించిన చిత్రం 'కాంత'. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. సెల్వమణి సెల్వరాజ్ దర్శకుడు. ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా దుల్కర్ సల్మాన్, రానా మీడియాతో ముచ్చటించారు.

దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ 'కథ విన్న వెంటనే ఈ సినిమా చేయాలనుకున్నాం. దర్శకుడు సెల్వ తన విజన్‌తో సినిమాను అద్భుతంగా క్రియేట్ చేశారు. ఇందులో నా నటన ఎలా ఉంటే బావుంటుందో దర్శకుడు, నేనూ చర్చించి ఒక నిర్ణయానికి వచ్చేవాళ్లం. రానా, సముద్రఖని, భాగ్యశ్రీ తమ పాత్రలకు పరిపూర్ణత చేకూర్చారు. ఈ సినిమాను తెరకెక్కించే క్రమంలో ఒక మ్యాజిక్ క్రియేట్ అయింది. కాంత నా కెరీర్లో ప్రత్యేక చిత్రం. ఇలాంటి సినిమా చేసే అవకాశం జీవితంలోఒక్కసారే వస్తుంది' అని చెప్పారు. రానా మాట్లాడుతూ "అందరూ అనుకుంటున్నట్లు 'కాంత' చిత్రం బయోపిక్ కాదు. అలాంటి అనుమానాలను నివృత్తి చేసే ఆలోచనతో చెన్నైలో ప్రత్యేకంగా ఒక షో వేస్తున్నాం. ఇది పూర్తిగా కల్పిత గాథ. ఇప్పుడు ఇండస్ట్రీలో ఏదైనా జరిగితే వెంటనే అందరికీ తెలిసిపోతుంది. కానీ పాతకాలంలో చాలా తక్కువ మందికి తెలిసేవి. ఆ కాలం నుంచి స్ఫూర్తి పొందిన రాసిన కథ ఇది. గొప్ప వ్యక్తుల జీవితాల్లోని చీకటి కోణం గురించి చెబుతుంది. ఇండస్ట్రీలో దిగ్గజాలైన ఇద్దరు వ్యక్తులు తమ అహంతో గొడవలు పడిన నేపథ్యం చాలా ఆసక్తికరంగా ఉంటుంది.

తోట తరణి అరుదైన ఘనత



కళా దర్శకుడు తోటతరణి అరుదైన ఘనత సాధించారు. ఫ్రాన్స్ ప్రభుత్వపు అత్యున్నత పురస్కారమైన 'చెవాలియర్'కు ఎంపికయ్యారు. ఆయన ఈ పురస్కారం సాధించినందుకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సంతోషం వ్యక్తం చేశారు. ఇటీవల విడుదలైన 'ఘాటి', 'హరి హర వీరమల్లు', 'కుబేర' చిత్రాలతో పాటు 'అతడు', 'గీతాంజలి', 'పుష్పక విమానం', 'సాగర సంగమం' వంటి సూపర్ హిట్స్‌కు ఆయన కళాదర్శకత్వం వహించారు. ఉత్తమ కళా దర్శకత్వం విభాగంలో 'నాయకుడు', 'భారతీయుడు' చిత్రాలకు రెండు సార్లు జాతీయ అవార్డు అందుకున్నారు. అలాగే మూడు నంది పురస్కారాలు దక్కించుకున్నారు. 2001లో పద్మశ్రీ అవార్డును స్వీకరించారు. చెన్నైలోని ఫ్రెంచ్ కాన్సులేట్‌లో ఈ పురస్కారాన్ని ఆయన నేడు అందుకోనున్నారు. దివంగత నటుడు శివాజీ గణేశన్, తారలు అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, షారుక్ ఖాన్, ఐశ్వర్యా రాయ్ తదితరులు గతంలో 'చెవాలియర్' అవార్డును అందుకున్నారు.



రోషన్ కనకాల కథానాయకుడిగా సందీప్‌రాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'మోగ్లీ 2025'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. డిసెంబర్ 12న విడుదలవుతోంది. బుధవారం హీరో ఎన్టీఆర్ చేతుల మీదుగా ఈ చిత్రం టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు.



ఆ బాలనటికి క్షమాపణలు చెప్పిన ఆర్జీవీ


శివ సినిమా రీ రిలీజ్ సందర్భంగా దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ అందులో నటించిన బాల నటి సుష్మకి సారీ చెప్పారు. సైకిల్ ఛేజ్ సీక్వెన్స్‌లో నటించిన ఆ అమ్మాయి ఇప్పుడెలా ఉందో తెలియజేస్తూ ఆమె ఫొటోను షేర్ చేశారు. 'సుష్మ.. నువ్వు సాహసోపేతమైన సన్నివేశాల్లో నటించావు. ఆ రిస్కీ షాట్‌తో నువ్వు ఎంతగా భయపడ్డావో దర్శకుడిగా అప్పుడు నాకు తెలియదు. ఇప్పుడు మనస్ఫూర్తిగా క్షమాపణలు కోరుతున్నా. అంగీకరించు' అని ఆమెకు విజ్ఞప్తి చేశారు. ఇందులో హీరో నాగార్జున అన్న కూతురి పాత్రలో సుష్మ నటించింది. సినిమాలోని ముఖ్యమైన సన్నివేశాల్లో ఈ సన్నివేశం ఒకటిగా నిలిచింది. ఈ నెల 14న 'శివ' మరోసారి ప్రేక్షకుల ముందుకు వస్తున్న సంగతి తెలిసిందే.



రైల్వే కాలనీ భయపెడుతుంది

అల్లరి నరేశ్

'నేను ఇప్పటివరకూ '12ఏ రైల్వే కాలనీ' లాంటి అద్భుతమైన థ్రిల్లర్‌లో నటించలేదు. ఈ సినిమా కథ చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ప్రేక్షకుడిని పూర్తిగా తనవైపు ఆకర్షిస్తుంది. ఇందులో విలన్ ఎవరనేది ఊహించలేరు. పతాక సన్నివేశాల్లో ప్రేక్షకులు భయపడతారు' అని అల్లరి నరేశ్ అన్నారు. ఆయన కథానాయకుడిగా నాని కాసరగడ్డ తెరకెక్కించిన '12 ఏ రైల్వేకాలనీ' ఈ నెల 21న విడుదలవుతోంది. శ్రీనివాస సిల్వర్ స్ర్కీన్ బేనర్‌పై శ్రీనివాస చిట్టూరి నిర్మించారు. కామాక్షి భాస్కర్ల హీరోయిన్. ఈ సందర్భంగా నిర్వహించిన ట్రైలర్ లాంచ్ వేడుకలో అల్లరి నరేశ్ మాట్లాడుతూ 'మర్డర్ మిస్టరీ నేపథ్యంలో సాగే ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది. చిత్రం మొత్తం విభిన్నమైన కథనంతో నడుస్తుంది' అని చెప్పారు. 'ఈ సినిమా విజయంపై టీమ్ అంతా పూర్తి ధీమాతో ఉన్నాం' అని నాని కాసరగడ్డ చెప్పారు. 'నా కెరీర్‌లోనే ఇది ల్యాండ్ మార్క్ చిత్రంగా మిగిలిపోతుందనే నమ్మకం ఉంది' అని కామాక్షి భాస్కర్ల తెలిపారు.



మందాకిని వచ్చేసింది

మహేశ్ బాబు కథానాయకుడిగా దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి తెరకెక్కిస్తున్న 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' నుంచి మరో అప్డేట్ వచ్చేసింది. ఇందులో హీరోయిన్‌గా నటిస్తున్న ప్రియాంక చోప్రా పాత్ర పేరును, ఆమె ఫస్ట్ లుక్‌ను రాజమౌళి విడుదల చేశారు. మందాకినిగా ఆమె కనిపించనున్నారు. చీరకట్టులో గన్ పట్టుకున్న యాక్షన్ మోడ్‌లో ఉన్నారామె. 'భారతీయ సినిమా ఖ్యాతిని విశ్వవ్యాప్తంగా పునర్నిర్వచించిన దేశీ గర్ల్ ప్రియాంకకు తిరిగి స్వాగతం. మందాకిని పాత్రలోని భిన్న పార్శ్వాలను చూడడానికి యావత్ ప్రపంచం ఎదురుచూస్తోంది' అని రాజమౌళి పోస్ట్ చేశారు. 'మందాకినికి హలో చెప్పండి' అని ప్రియాంక చోప్రా పేర్కొన్నారు. 'ఇదిగో మందాకిని' అని మహేశ్ కూడా ఈ పిక్‌ను షేర్ చేశారు. కేఎల్ నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

హీమ్యాన్ ఇంటికి వచ్చేశారు!



బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర ఆరోగ్య పరిస్థితి గురించి కొన్ని రోజులుగా ఆందోళన చెందిన వారంతా ఊపిరిపీల్చుకుంటున్నారు. కొన్ని రోజులుగా ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్న ఆయన బుధవారం ఉదయం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. ధర్మేంద్రను ఇంటికి తరలించాలని కుటుంబసభ్యులు నిర్ణయించుకున్నట్లు ఆయనకు చికిత్స అందించిన ప్రతీత్ సందానీ తెలిపారు. ఇంటివద్దే ఆయనకు చికిత్సను కొనసాగిస్తామని చెప్పారు. అక్టోబరు 31న శ్వాస సంబంధిత సమస్యతో ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పతిలో ధర్మేంద్ర చేరిన సంగతి తెలిసిందే.

సోషల్ మీడియాను షేక్ చేస్తున్న గిరిజ



గిరిజ పేరు కలిగిన ఇద్దరు నటీమణులు గతంలో తెలుగు ప్రేక్షకులను అలరించారు. వారిలో ఒకరి హాస్యనటి గిరిజ, మరొకరు 'గీతాంజలి' చిత్ర కథానాయిక గిరిజ. వీరిద్దరూ కాకుండా గిరిజ పేరు కలిగిన మరో నటి ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. 37 ఏళ్ల వయసు కలిగిన ఈ మరాఠీ నటి పూర్తి పేరు గిరిజా ఓక్ గోడ్బలే. 15 ఏళ్ల వయసులో నటిగా మరాఠీ చిత్రంతో కెరీర్ ప్రారంభించిన గిరిజ ఇంతవరకూ మరాఠీ, హిందీ, కన్నడ చిత్రాల్లో నటించారు. 'తారే జమీన్ పర్', 'షోర్ ఇన్ ద సిటీ', 'జవాన్' చిత్రాల్లో పోషించిన పాత్రలు ఆమెకు గుర్తింపు తెచ్చాయి. ప్రస్తుతం 'థెరపీ షెరపీ' వెబ్ సిరీస్‌లో నటిస్తోంది. ఇందులో గుల్షన్ దేవయ్యతో కలసి ఆమె పాల్గొన్న బోల్డ్ సీన్లు హాట్ టాపిక్ గా మారాయి. ఇటీవల ఇచ్చిన ఓ వీడియో ఇంటర్వ్యూలో గిరిజ చెప్పిన మాటలు కూడా వైరల్ అయ్యాయి. ఈ ఇంటర్వ్యూలో బ్లూ శారీ, స్లీవ్‌లెస్ జాకెట్‌తో కనిపించిన గిరిజ ఫొటోలు నెటిజన్ల మతులు పోగొడుతున్నాయి. అన్నట్లు గిరిజకు పెళ్లయిందండోయ్.. ఆమె భర్త సుహృద్ దర్శకుడు. వీరికి ఓ బాబు కూడా ఉన్నాడు.

రికార్డు కనిష్ఠానికి ధరల సూచీ



- గతనెలలో 0.25 శాతానికి తగ్గుదల
- దోహదపడిన జీఎస్‌టీ రేట్ల తగ్గింపు
- వడ్డీ రేట్లు మరింత తగ్గే అవకాశం

న్యూఢిల్లీ: ఈ అక్టోబరులో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం రికార్డు కనిష్ఠ స్థాయి 0.25 శాతానికి తగ్గింది. ద్రవ్యోల్బణానికి 2014 జనవరి నుంచి 2012 బేస్ ఇయర్ సిరీస్ అమలులోకి వచ్చినప్పటి నుంచి నమోదైన అత్యల్ప స్థాయి ఇదే. కేంద్ర ప్రభుత్వం ఈ సెప్టెంబరు 22 నుంచి దాదాపు 380 ఉత్పత్తులు, వస్తువులపై జీఎస్‌టీని తగ్గించడంతో పాటు గతనెలలో కూరగాయలు, పండ్లు, కోడిగుడ్ల ధరలు తగ్గుముఖం పట్టడం ఇందుకు ప్రధానంగా దోహదపడింది. ఈ సెప్టెంబరులో ద్రవ్యోల్బణం 1.44 శాతంగా నమోదు కాగా.. 2024 అక్టోబరులో 6.21 శాతంగా ఉంది.

ఏపీలో 0.25 శాతం.. తెలంగాణలో మైనస్ 1.16 శాతం: జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) బుధవారం విడుదల చేసిన డేటా ప్రకారం.. గత నెలలో ఆహార ధరల ద్రవ్యోల్బణం మైనస్ 5.02 శాతానికి జారుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో రిటైల్ ద్రవ్యోల్బణం మైనస్ 0.25 శాతానికి తగ్గగా.. పట్టణ ప్రాంతాల్లో 0.88 శాతంగా నమోదైంది. రాష్ట్రాలవారీగా చూస్తే, కేరళలో అత్యధికంగా 8.56 శాతంగా నమోదైంది. తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే, ఆంధ్రప్రదేశ్‌లో 0.25 శాతంగా, తెలంగాణలో మైనస్ 1.16 శాతంగా నమోదైంది.

రుణగ్రహీతలకు రిలీఫ్!?: రిటైల్ ద్రవ్యోల్బణాన్ని 4 శాతానికి (+/- 2%) కట్టడి చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆర్‌బీఐకి లక్ష్యాన్ని నిర్దేశించింది. గడిచిన కొన్ని నెలలుగా నియంత్రిత లక్ష్యంలోపే నమోదవుతూ వస్తున్న ద్రవ్యోల్బణం.. గతనెలలో రికార్డు కనిష్ఠానికి దిగివచ్చింది. దీంతో వచ్చేనెల 3-5 తేదీల్లో జరగనున్న ద్రవ్యపరపతి విధాన సమీక్షలో ఆర్థిక వృద్ధికి ఊతమిచ్చే లక్ష్యంతో ఆర్‌బీఐ కీలక రెపోరేటును మరో 0.25% తగ్గించే అవకాశాలున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. రెపోరేట్లపై నిర్ణయానికి రిటైల్ ద్రవ్యోల్బణం గణాంకాలే కీలకం. రెపో రేటు తగ్గితే తదనుగుణంగా బ్యాంక్‌లు రుణాలపై వడ్డీరేట్లను తగ్గిస్తాయి. ఫలితంగా రుణాలు మరింత చవకగా లభించడంతోపాటు ఇప్పటికే రుణం తీసుకున్నవారికి ఈఎంఐల భారం సైతం తగ్గుతుంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,25,510 ▼	1,15,050 ▼	1,73,000 ▲
విజయవాడ	1,27,500 ▼	1,20,000 ▲	1,60,000 ▲
విశాఖపట్నం	1,27,880 ▼	1,15,350 ▲	1,73,000 ▲
రాజమండ్రి	1,25,510 ▼	1,15,050 ▼	1,59,000 ▲
ప్రొద్దుటూరు	1,24,100 ▼	1,14,170 ▼	1,60,000 ▲
ముంబై	1,23,910 ▼	1,13,500 ▼	1,56,705 ▲

జీఆర్‌టీలో గోల్డ్ ఎక్స్ఛేంజ్ మేళా



చెన్నై (ఆంధ్రజ్యోతి): 'జీఆర్‌టీ జువెలర్స్' గోల్డ్ ఎక్స్ఛేంజ్ మేళాను ప్రకటించింది. వినియోగదారులు తమ పాత బంగారాన్ని తీసుకువచ్చి, మార్పిడి విలువపై గ్రాముకు రూ.150 అదనంగా పొందవచ్చని జీఆర్‌టీ జువెలర్స్ మేనేజింగ్ డైరెక్టర్లు జీఆర్ ఆనంద్ అనంత పద్మనాభన్, జీఆర్ రాధాకృష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. గోల్డ్ ఎక్స్ఛేంజ్ మేళా ద్వారా వినియోగదారులకు తమ పాత బంగారాన్ని వివాహాలు, వేడుకల కోసం రూపొందించిన అద్భుతమైన కొత్త డిజైన్లతో మార్పిడి చేసుకునే అపూర్వ అవకాశాన్ని అందిస్తున్నట్టు చెప్పారు. వినియోగదారుల కోసం జీఆర్‌టీ ఎలెవెన్ ఫ్లెక్సీ ప్లాన్‌ను కూడా అందిస్తున్నామన్నారు. ఇది నెలవారీ ఆభరణాల కొనుగోలు ప్రణాళిక. 18 శాతం వరకు వేస్టేజీ చార్జీల మినహాయింపు లేదా విలువ ఆధారంగా అనువైన ఎంపికలతో, వినియోగదారులు బంగారం ధరల హెచ్చుతగ్గుల ప్రభావం లేకుండా స్వేచ్ఛగా పెట్టుబడి పెట్టే సౌలభ్యాన్ని ఈ ప్రణాళిక అందిస్తుందని వివరించారు.

సిమెంట్ రంగంలో రూ.1.2 లక్షల కోట్ల పెట్టుబడులు

2028 నాటికి మరో 16-17 కోట్ల టన్నుల సామర్థ్యం జోడింపు



న్యూఢిల్లీ: దేశీయ సిమెంట్ పరిశ్రమ మంచి జోరు మీదుంది. గత మూడేళ్లుగా గిరాకీ ఏటా సగటున 9.5% చొప్పున పెరుగుతోంది. పెరుగుతున్న గిరాకీని తట్టుకునేందుకు కంపెనీలు ఉత్పత్తి సామర్థ్య విస్తరణ, కొత్త ప్లాంట్ల ఏర్పాటుకు సిద్ధమయ్యాయి. వచ్చే మూడేళ్లలో కంపెనీలు ఇందు కోసం ఎంతలేదన్నా రూ.1.2 లక్షల కోట్ల వరకు ఖర్చు చేస్తాయని రేటింగ్ సంస్థ క్రిసిల్ అంచనా. గత మూడేళ్లతో పోలిస్తే ఇది 50% ఎక్కువ. ఈ విస్తరణ, నూతన ప్రాజెక్టులతో వచ్చే మూడేళ్లలో (2026-28) అదనంగా మరో 16 నుంచి 17 కోట్ల టన్నుల గ్రైండింగ్ సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని కూడా అంచనా వేసింది. గత మూడేళ్లలో నమోదైన 9.5 కోట్ల అదనపు ఉత్పత్తి సామర్థ్యంతో పోలిస్తే ఇది 75% ఎక్కువ. దీంతో ప్రస్తుతం 66.8 కోట్ల టన్నులుగా ఉన్న కంపెనీల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 2028 మార్చి నాటికి 82.8 లేదా 83.8 కోట్ల టన్నులకు పెరుగుతుందని పేర్కొంది. అయితే కొత్తగా అందుబాటులోకి వచ్చే ఉత్పత్తి సామర్థ్యంలో 65% ఇప్పటికే ఉత్పత్తిలో ఉన్న ప్లాంట్ల సామర్థ్య విస్తరణ ద్వారా వస్తుందని, ఈ కారణంగా పెట్టుబడి వ్యయాలు మరీ అంత భారీగా ఉండకపోవచ్చని క్రిసిల్ పేర్కొంది. ఈ కొత్త పెట్టుబడుల్లో 10 నుంచి 15% పెట్టుబడులను సిమెంట్ కంపెనీలు సొంత ఇంధన అవసరాల కోసం ఏర్పాటు చేసే హరిత ఇంధన ప్రాజెక్టులు, ఉత్పత్తి ఖర్చులు తగ్గించే ప్రాజెక్టులపై ఖర్చు చేయబోతున్నాయి. దీంతో కంపెనీల అప్పుల భారం సైతం స్థిరంగా ఉండి, వాటి లాభాలకూ పెద్దగా ఇబ్బంది ఉండకపోవచ్చని క్రిసిల్ తెలిపింది.

కలిసొచ్చే అంశాలు

వచ్చే మూడేళ్లలో దేశీయ సిమెంట్ పరిశ్రమకు పలు సానుకూల అంశాలు కలిసి రానున్నాయి. మౌలిక సదుపాయాలు, గృహ నిర్మాణ రంగాలపై పెరుగుతున్న పెట్టుబడులు ఇందుకు ప్రధానంగా కలిసి రానున్నాయి. దీంతో అదానీల నిర్వహణలోని అంబుజా సిమెంట్, ఆదిత్య బిర్లా గ్రూపునకు చెందిన అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీలు పెద్ద ఎత్తున విస్తరణ చేపట్టాయి. ఇందుకోసం కొత్త ప్లాంట్ల ఏర్పాటు, సామర్థ్య విస్తరణతో పాటు ఆయా రాష్ట్రాల్లో బలంగా ఉన్న చిన్న చిన్న సిమెంట్ కంపెనీలను కొనేస్తున్నాయి. దీంతో ఈ ఏడాది మార్చి నాటికి ఉన్న 66.8 కోట్ల టన్నుల స్థాపిత సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యంలో 85 శాతం 17 కంపెనీల చేతుల్లో కేంద్రీకృతమైంది. గత పదేళ్లుగా సిమెంట్ రంగంలో ఉత్పత్తి సామర్థ్య వినియోగం సగటున 65% మాత్రమే. అయితే పెరుగుతున్న డిమాండ్‌తో ఇది గత ఆర్థిక సంవత్సరం 70 శాతానికి చేరిందని క్రిసిల్ తెలిపింది.

సైబర్ దాడుల నుంచి రక్షణకు టాటా ఏఐజీ 'సైబర్ ఎడ్జ్'

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): పెరిగిపోతున్న సైబర్ దాడుల నుంచి కంపెనీలకు ఆర్థిక రక్షణ కల్పించేందుకు టాటా ఏఐజీ 'సైబర్ ఎడ్జ్' పేరుతో కొత్త బీమా పాలసీ తీసుకొచ్చింది. సైబర్ దాడులతో ఏర్పడే ఆర్థిక నష్టాలతో పాటు, పేరు ప్రతిష్ఠలకు ఏర్పడే నష్టాల నుంచీ కంపెనీలను ఈ పాలసీ కాపాడుతుందని టాటా ఏఐజీ కంపెనీ (ఫైనాన్సియల్ లైన్స్) నేషనల్ హెడ్ నజ్మ్ బిల్‌గ్రామి చెప్పారు. ఇప్పటి వరకు దేశంలోని 1,700 నుంచి 1,800 కంపెనీలు ఈ పాలసీ తీసుకున్నట్టు వెల్లడించారు. ప్రస్తుతం కార్పొరేట్ సైబర్ ఇన్సూరెన్స్ మార్కెట్ విలువ రూ.900 కోట్లకు చేరిందని, ఏటా 25% చొప్పున సగటు వృద్ధి నమోదు చేస్తోందని చెప్పారు. సైబర్ దాడుల విషయంలో ఏపీ, తెలంగాణ కంపెనీలు దేశంలో రెండో స్థానంలో ఉన్నా, సైబర్ ఇన్సూరెన్స్ పాలసీలు తీసుకోవడంలో బాగా వెనకబడి ఉన్నట్టు చెప్పారు. దీంతో 2028 నాటికి ఈ రెండు రాష్ట్రాల్లో రెండు రెట్ల వృద్ధి రేటు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు.

26,000 చేరువలో నిఫ్టీ

రూ.4 లక్షల కోట్లకు పైగా సంపద వృద్ధి

ముంబై: భారత స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా మూడో రోజూ లాభపడ్డాయి. బుధవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒకదశలో 780.69 పాయింట్ల వరకు ఎగబాకి 84,652.01 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 595.19 పాయింట్ల లాభంతో 84,466.51 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా ఇంట్రాడేలో 239.6 పాయింట్ల వరకు పెరిగి 25,934.55కు చేరినప్పటికీ, మళ్లీ కాస్త తగ్గి 180.85 పాయింట్ల లాభంతో 25,875.80 వద్ద ముగిసింది. దీంతో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.4 లక్షల కోట్లకు పైగా పెరిగి రూ.473.69 లక్షల కోట్లకు (5.34 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్ల ర్యాలీ నేపథ్యంలో దేశీయంగానూ మదుపరులు ఐటీ, కన్స్యూమర్ డ్యూరబుల్ రంగాల షేర్లలో భారీగా కొనుగోళ్లు జరపడం ఇందుకు దోహదపడింది. బిహార్ ఎన్నికల్లో ఎన్‌డీఏ స్పష్టమైన మెజారిటీతో గెలుపొందవచ్చన్న ఎగ్జిట్ పోల్స్ అంచనాలు మార్కెట్లో ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మరింత బలపరిచాయని వారన్నారు. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 22 లాభపడగా.. ఏషియన్ పెయింట్స్ షేరు 4.46 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది.

- విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) రూ.1,750.03 కోట్ల నికర అమ్మకాలు జరుపగా.. దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు (డీఐఐ) నికరంగా రూ.5,127.12 కోట్ల కొనుగోళ్లు జరిపారు.
- ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 12 పైసల నష్టంతో రూ.88.62 వద్ద ముగిసింది.
- ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర రూ.2,000 పెరిగి రూ.1,27,900కు చేరగా.. కిలో వెండి రూ.5,540 ఎగబాకి రూ.1,61,300 ధర పలికింది. .

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



13వ తేదీ			
హైదరాబాద్	595	విజయవాడ	600
వరంగల్	597	గోదావరి	605
చిత్తూరు	633	విశాఖపట్నం	590
		డజను గుడ్లు రూ.	84

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	107	విజయవాడ	109
వరంగల్	107	గుంటూరు	111
కరీంనగర్	107	ఒంగోలు	111
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	112
కర్నూలు	107	నెల్లూరు	117
విశాఖపట్నం	108	అనంతపురం	117
గోదావరి	109		

గ్రో బంపర్ లిస్టింగ్

ఆన్‌లైన్ స్టాక్ బ్రోకింగ్ సేవల ప్లాట్‌ఫామ్ 'గ్రో' మాతృ సంస్థ బిలియన్‌బ్రెయిన్స్ గ్యారేజ్ వెంచర్స్ స్టాక్ మార్కెట్ లిస్టింగ్‌కు భారీ స్పందన లభించింది. ఐపీఓ ధర రూ.100తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు 14% లాభంతో రూ.114 వద్ద నమోదైంది. ట్రేడింగ్ ముగిసేసరికి 30.94% లాభంతో రూ.130.94 వద్ద ముగిసింది.

ఆర్డీ ఇంజనీరింగ్ రూ.15 కోట్ల సమీకరణ

హైదరాబాద్‌కు చెందిన ఆర్డీ ఇంజనీరింగ్ రెండో విడత ప్రీ-ఐపీఓ ప్లేస్‌మెంట్ ద్వారా రూ.15 కోట్లు సమీకరించింది. డెల్టా ఇన్నోవేటివ్ రీసెర్చ్ ఎల్ఎల్‌పీ, సెంచురీ ఫ్లోర్ మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ పెట్టుబడులు పెట్టినట్టు ఆర్డీ ఇంజనీరింగ్ బుధవారం వెల్లడించింది. ఈ జూలైలో కంపెనీ తొలి విడత ప్రీ-ఐపీఓ ప్లేస్‌మెంట్ ద్వారా రూ.17.43 కోట్లు సేకరించింది.

లుపిన్ వైజాగ్ ప్లాంటులో అంకాలజీ బ్లాక్ ప్రారంభం

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్ వద్ద ఉన్న తమ అనుబంధ సంస్థ ప్లాంటులో ప్రత్యేక అంకాలజీ (కేన్సర్) బ్లాక్ ప్రారంభించినట్టు ఫార్మా దిగ్గజం లుపిన్ ప్రకటించింది. ఈ బ్లాకులో కేన్సర్ చికిత్సలో ఉపయోగించే తుది ఔషధాల తయారీకి అవసరమైన ప్రత్యేక ఏపీఐ ముడి పదార్థాలను కాంట్రాక్టు డెవలప్‌మెంట్, మాన్యుఫ్యాక్చరింగ్ పద్ధతిలో తయారు చేస్తారు. ఈ బ్లాకులోని ప్రాసెస్ డెవలప్‌మెంట్ ల్యాబ్‌ను క్వాలిటీ కంట్రోల్ లేబోరేటరీతో అనుసంధానం చేసినట్టు లుపిన్ మాన్యుఫ్యాక్చరింగ్ సొల్యూషన్స్ (ఎల్ఎంఎస్) సీఈఓ అబ్దెల్‌అజీజ్ టౌమీ తెలిపారు.

స్పోర్ట్స్

ప్రణయ్, లక్ష్య శుభారంభం

జపాన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్


ప్రణయ్

కుమమొటో (జపాన్): భారత స్టార్ షట్లర్లు హెచ్ఎస్ ప్రణయ్, లక్ష్య సేన్ జపాన్ ఓపెన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో శుభారంభం చేశారు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో ఏడో సీడ్ లక్ష్య 21-12, 21-16తో స్థానిక షట్లర్ కొకి వతనబెపై, ప్రణయ్ 16-21, 21-13, 23-21తో జున్ హావో లియోంగ్ (మలేసియా)పై గెలిచారు. లక్ష్య, ప్రణయ్ మినహా తొలిరోజు బరిలోకి దిగిన మిగతా భారత షట్లర్లంతా విఫలమయ్యారు. సింగిల్స్‌లో కిరణ్ జార్జ్, ఆయుష్ శెట్టి, తరుణ్ మన్నేపల్లి, మిక్స్‌డ్ డబుల్స్‌లో రుత్విక శివాని/రోహన్ కపూర్ ఇంటిబాట పట్టారు.

మిక్స్‌డ్ ఫైనల్‌కు దీప్షిక జోడీ

ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్



ఢాకా: ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారుల జోరు కొనసాగుతోంది. బుధవారం జరిగిన కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత జోడీ దీప్షిక/అభిషేక్ వర్మ ఫైనల్‌కు దూసుకెళ్లి స్వర్ణానికి అడుగుదూరంలో నిలిచింది. సెమీఫైనల్లో దీప్షిక ద్వయం 156-153తో కజకిస్థాన్‌ను చిత్తుచేసింది. టైటిల్‌పోరులో ఆతిథ్య బంగ్లాదేశ్‌తో భారత జంట అమీతుమీ తేల్చుకోనుంది. ఇక, రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు చెందిన అన్షికా కుమారి/యశ్‌దీప్ భోగె జోడీ కాంస్య పతక పోరులో నిలిచింది. క్వార్టర్స్‌లో 5-1తో బంగ్లాను మట్టికరిపించిన అన్షిక జంట సెమీస్‌లో మాత్రం 0-6తో చైనీస్ తైపీ ద్వయం చేతిలో ఓటమిపాలైంది. దీంతో కాంస్యం కోసం టాప్‌సీడ్ కొరియాతో భారత్ తలపడనుంది.

టైబ్రేక్‌కు అర్జున్, హరి

చెస్ ప్రపంచకప్

- ప్రజ్ఞానంద కూడా..
- కార్తీక్ అవుట్

పనాజీ: ఫిడే చెస్ వరల్డ్‌కప్‌లో తెలుగు గ్రాండ్‌మాస్టర్లు అర్జున్ ఇరిగేసి, పెంటేల హరికృష్ణ నాలుగో రౌండ్‌ను డ్రా చేసుకొన్నారు. దీంతో గురువారం జరిగే టైబ్రేక్‌లో ఫలితం తేలనుంది. బుధవారం జరిగిన నాలుగో రౌండ్ రెండో గేమ్‌లో తెల్లపావులతో ఆడిన అర్జున్ 36 ఎత్తుల అనంతరం పీటర్ లెకో (హంగేరీ)తో డ్రాకు అంగీకరించాడు. దీంతో ఇద్దరూ 1-1తో సమంగా నిలిచారు. గ్రాండిలస్ (స్వీడన్)తో రెండో గేమ్‌ను హరికృష్ణ 38 ఎత్తుల్లో డ్రా చేసుకొన్నాడు. డేనియల్ దుబోవ్‌తో ప్రజ్ఞానంద పాయింట్ పంచుకొన్నాడు. కాగా, కార్తీక్ వెంకట్రామన్ 0.5-1.5తో లి క్వాంగ్ లియమ్ (వియత్నాం) చేతిలో, ప్రణవ్ 0.5-1.5తో నోడిబెక్ (ఉజ్బెకిస్థాన్) చేతిలో ఓడారు.

భారత్ చేతిలో ఆసీస్ చిత్తు

- అంధ మహిళల టీ20 వరల్డ్‌కప్

న్యూఢిల్లీ: అంధుల టీ20 వరల్డ్‌కప్‌లో భారత మహిళల జట్టు 209 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాను చిత్తు చేసింది. తొలుత భారత్ 20 ఓవర్లలో 292/4 స్కోరు చేసింది. కెప్టెన్ దీపిక (91), ఫులా సరీన్ (54 నాటౌట్) రాణించారు. ఛేదనలో ఆస్ట్రేలియా 19.3 ఓవర్లలో 83 పరుగులకు ఆలౌటైంది. మరో మ్యాచ్‌లో నేపాల్ 9 వికెట్ల తేడాతో శ్రీలంకపై గెలిచింది.

'హజారే'లో ఆడండి!

రోహిత్, కోహ్లీకి స్పష్టంజేసిన బోర్డు



న్యూఢిల్లీ: జాతీయ జట్టులో కొనసాగాలంటే దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో ఆడాల్సిందేనని సీనియర్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీకి బీసీసీఐ స్పష్టం చేసినట్టు తెలిసింది. డిసెంబరు 24 నుంచి జరిగే ఈ టోర్నీలో ఆడేదీ లేనిదీ వీరిద్దరూ ఇంకా బోర్డుకు సమాచారం అందించలేదు. అయితే తాను ఆడతానని ముంబై క్రికెట్ సంఘం (ఎంసీఏ)కు రోహిత్ చెప్పినట్టు వార్తలు వచ్చాయి. కానీ, ఎంసీఏ వాటిని తోసిపుచ్చింది. రోహిత్ నుంచి తమకెలాంటి సమాచారమూ లేదని తెలిపింది. కాగా, దక్షిణాఫ్రికాతో ఈ నెల 30 నుంచి జరిగే మూడు వన్డేల సిరీస్‌ను దృష్టిలో ఉంచుకొని రోహిత్ రోజూ ప్రాక్టీస్ చేస్తున్నాడు. దేశవాళీ క్రికెట్ ఆడే విషయమై కోహ్లీ కూడా మౌనంగా ఉన్నాడు. టెస్టులు, టీ20లకు వీడ్కోలు పలికిన రోహిత్, కోహ్లీ వన్డేలు మాత్రమే ఆడుతున్న విషయం తెలిసిందే. ఇటీవలే ఆస్ట్రేలియా టూర్‌లో మూడు వన్డేల సిరీస్‌లో వీరిద్దరూ బరిలోకి దిగారు.

టాప్‌లోనే రోహిత్

దుబాయ్: ఐసీసీ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో రోహిత్ శర్మ అగ్రస్థానంలోనే కొనసాగుతున్నాడు. ఆస్ట్రేలియా టూర్‌లో అదరగొట్టిన రోహిత్ కెరీర్‌లో తొలిసారి నెం:1 ర్యాంక్‌ను కైవసం చేసుకొన్న సంగతి విదితమే. బుధవారం విడుదల చేసిన తాజా ర్యాంక్‌ల జాబితాలో రోహిత్ 781 పాయింట్లతో టాప్‌లోనే ఉన్నాడు. కాగా, కోహ్లీ ఒక స్థానం మెరుగుపర్చుకొని ఐదో ర్యాంక్‌కు ఎగబాకగా.. శుభ్‌మన్ గిల్ నాలుగో స్థానంలో నిలకడగా ఉన్నాడు. ఇబ్రహీం జద్రాన్ (అఫ్ఘానిస్థాన్), డారెల్ మిచెల్ (న్యూజిలాండ్) రెండు, మూడు ర్యాంక్‌ల్లో నిలిచారు.

హసన్ అజేయ శతకం

- బంగ్లా 338/1
- ఐర్లాండ్ 286 ఆలౌట్

సిల్హట్: హసన్ జాయ్ (169 బ్యాటింగ్) శతకంతో చెలరేగడంతో.. ఐర్లాండ్‌తో తొలి టెస్ట్‌లో ఆతిథ్య బంగ్లాదేశ్ భారీ స్కోరు దిశగా సాగుతోంది. ఆటకు రెండో రోజు తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లా 338/1 స్కోరు చేసింది. బుధవారం ఆట ఆఖరుకు హసన్‌తోపాటు మోమినుల్ హక్ (80 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. ఐర్లాండ్ మొదటి ఇన్నింగ్స్‌లో 286 పరుగులకు ఆలౌటైంది.

అనుకున్నట్టే.. జురెల్

టెస్ట్ జట్టునుంచి నితీశ్ అవుట్

'ఈడెన్' మ్యాచ్‌కు ముందు టీమిండియాలో మార్పు


జురెల్

కోల్‌కతా: ఫామ్‌లో ఉన్న వికెట్ కీపర్-బ్యాటర్ ధ్రువ్ జురెల్‌కు భారత జట్టులో చోటు దక్కింది. దక్షిణాఫ్రికాతో జరిగే టెస్ట్ సిరీస్‌కు అతడికి జట్టులో చోటు లభించగా.. పేలవ ప్రదర్శన కనబరుస్తున్న ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డిపై వేటుపడింది. గురువారం నుంచి భారత్-దక్షిణాఫ్రికా 'ఎ' జట్ల మధ్య జరిగే వన్డే సిరీస్ కోసం నితీశ్‌ను టెస్టు జట్టు నుంచి విడుదల చేసినట్టు సహాయ కోచ్ ర్యాన్ టెన్ డస్కాటే బుధవారమిక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపాడు. తాజాగా బెంగళూరులో దక్షిణాఫ్రికా-ఎతో జరిగిన రెండు అనధికార టెస్ట్‌ల్లో ధ్రువ్ రెండు సెంచరీలతో అదరగొట్టాడు. మరోవైపు ఇంగ్లండ్ టూర్‌లో గాయంతో జట్టుకు దూరమైన రిషభ్ పంత్ మళ్లీ జట్టులోకి రావడంతో.. జురెల్‌ను స్పెషలిస్ట్ బ్యాటర్‌గా ఎంపిక చేశారు. జడేజా, సుందర్, అక్షర్ పటేల్ రూపంలో స్పిన్ ఆల్‌రౌండర్లు అందుబాటులో ఉండడంతో అదనపు బ్యాటర్‌తో ఆడే అవకాశం ఉంటుందని డస్కాటే చెప్పాడు. అంటే, తుది జట్టులో కుల్దీప్‌కు చోటు దక్కడం కష్టమే. కాగా, నితీశ్‌ను భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా తీర్చిదిద్దాలనుకొంటున్నట్టు పేర్కొన్నాడు. 'వెస్టిండీస్‌తో టెస్ట్‌లు, వన్డే సిరీస్‌ల్లో నితీశ్ ఆడాడు. భవిష్యత్ అవసరాల కోసం అతడు మరింతగా రాటుదేలాల్సి ఉంది. ఈ సిరీస్ నెగ్గడం ఎంతో కీలకం కావడంతో.. అందుకు తగ్గట్టుగా జట్టు కూర్పు ఉంటుంద'ని డస్కాటే తెలిపాడు. అయితే, అవసరమైతే నితీశ్‌ను గువాహటిలో జరిగే రెండో టెస్ట్‌కు పిలిచే అవకాశం ఉందని ఓ అధికారి వెల్లడించాడు. పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ అయిన నితీశ్ ఆశించిన రీతిలో రాణించడం లేదు. విండీస్‌తో తొలి టెస్ట్‌లో నాలుగు ఓవర్లు మాత్రమే బౌల్ చేసి ఒక్క వికెట్ కూడా పడగొట్టలేకపోయాడు. ఓ ఇన్నింగ్స్‌లో 43 పరుగులు మాత్రమే చేశాడు.



స్పిన్ బలంతోనే..?

స్వదేశంలో స్పిన్ బౌలింగ్ టీమిండియా ప్రధాన బలం. ఈడెన్ గార్డెన్స్‌లో కూడా ఇదే ఫార్ములాను భారత మేనేజ్‌మెంట్ అమలు చేసే అవకాశం ఉంది. సఫారీల బ్యాటర్లు కూడా ఉపఖండంలో స్పిన్‌ను ఎదుర్కోవడంలో అనేక సందర్భాల్లో తడబడ్డారు.

బవుమాకు ఫిట్‌నెస్ డ్రిల్

బుధవారం ఉదయం దక్షిణాఫ్రికా జట్టు తీవ్రంగా ప్రాక్టీస్ చేసింది. గాయం నుంచి కోలుకొని మళ్లీ జట్టులోకి వచ్చిన కెప్టెన్ టెంబా బవుమా.. కోచ్, ఫిజియో సమక్షంలో ఫిట్‌నెస్ నిరూపించుకొన్నాడు. 20 నిమిషాలపాటు ఫిట్‌నెస్ టెస్ట్‌లో పాల్గొన్న బవుమా ఆ తర్వాత నెట్స్‌లో సాధన చేశాడు. ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్‌లో కండర గాయం కావడంతో బవుమా జట్టుకు దూరమయ్యాడు. గతవారం భారత్-ఎతో జరిగిన రెండో అనధికార టెస్ట్‌తో మళ్లీ ఎంట్రీ ఇచ్చాడు.

చరిత్ర సృష్టించాలనుకొంటున్నాం

గత 15 ఏళ్లలో భారత్‌తో దక్షిణాఫ్రికా ఒక్క టెస్ట్ కూడా నెగ్గలేదు. కానీ, ఈసారి ఆ దాహాన్ని తీర్చుకోవాలనే పట్టుదలతో ఉన్నామని సౌతాఫ్రికా స్పిన్నర్ కేశవ్ మహరాజ్ అన్నాడు. పిచ్‌ను చూస్తే మ్యాచ్ ఆఖరి రోజు వరకు సాగే అవకాశం ఉందని చెప్పాడు. దక్షిణాఫ్రికా కోచ్ షుక్రి కాన్రాడ్ కూడా అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. కేశవ్ మహరాజ్, ముత్తుసామి, సైమన్ హార్మర్‌లతో కూడిన స్పిన్ త్రయం.. టీమిండియాకు దీటుగా ఉందన్నాడు.

అంజుమ్, కౌర్‌కు నిరాశ

కైరో (ఈజిప్టు): ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో బుధవారం భారత షట్లర్లకు నిరాశ ఎదురైంది. యువ షూటర్ ఆషి చౌక్సీ, ఒలింపియన్లు అంజుమ్ మోద్గిల్, సిఫ్ట్ కౌర్ మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఈవెంట్‌లో కనీసం ఫైనల్స్ కూడా చేరలేకపోయారు. క్వాలిఫికేషన్స్‌లో ఆషి 15వ, అంజుమ్ 17వ, సిఫ్ట్ కౌర్ 48వ స్థానాలకు పరిమితమయ్యారు. ఇక, గురువారం జరిగే పోటీల్లో మను భాకర్, ఇషా సింగ్, రాహీ సర్నోబాత్ 25 మీటర్ల పిస్టల్ విభాగంలో తలపడనున్నారు. ప్రస్తుతం టోర్నీలో భారత్ 3 స్వర్ణాలు, 5 రజతాలు, 3 కాంస్యాలతో రెండో స్థానంలో కొనసాగుతోంది. 8 స్వర్ణాలు సహా మొత్తం 15 పతకాలతో చైనా అగ్రస్థానంలో ఉంది.

ఇక్కడ ఆడలేం.. టూర్ రద్దు చేయండి

పాక్‌లో భద్రతపై ఆందోళనలో లంక క్రికెటర్లు

సందిగ్ధంలో వన్డే సిరీస్

రావల్పిండి: ప్రస్తుతం పాకిస్థాన్ పర్యటనలో ఉన్న శ్రీలంక క్రికెట్ జట్టు క్రికెటర్లు తమ భద్రతపై ఆందోళనగా ఉన్నారు. ఇస్లామాబాద్‌లోని సెషన్స్ కోర్టు వద్ద మంగళవారం జరిగిన ఆత్మాహుతి దాడిలో 12 మంది మృతి చెందగా, అనేక మంది గాయపడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇక్కడ ఉండడం అంత క్షేమకరం కాదని తమ దేశ ఆటగాళ్లు అభ్యంతరం వ్యక్తం చేసినట్టు శ్రీలంక క్రికెట్ బోర్డు (ఎస్ఎల్‌సీ) వర్గాలు తెలిపాయి. లంక జట్టులోని ఎనిమిది మంది ఆటగాళ్లు గురువారం స్వదేశం వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారని కూడా సమాచారం. ఆతిథ్య పాక్‌తో మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా లంక ఇప్పటికే తొలి మ్యాచ్ ఆడేసింది. రెండోది గురువారం, ఆఖరిదైన మూడోది శనివారం జరగనుంది. ఈ మూడు మ్యాచ్‌లకు వేదిక రావల్పిండి. అయితే, దాడి జరిగిన ఇస్లామాబాద్ నగరం, రావల్పిండికి అత్యంత సమీపంలోనే ఉండడం గమనార్హం. తమ భద్రత విషయమై కలవరపడుతూ లంక జట్టులోని కొందరు ఆటగాళ్లు.. ఈ పర్యటనను వెంటనే రద్దు చేయాల్సిందిగా తమ దేశ క్రికెట్ బోర్డును కోరారట. దీంతో ఈ సిరీస్ జరగడం సందిగ్ధంగా మారింది. మరోవైపు దాడి నేపథ్యంలో లంక జట్టుకు భద్రతను కట్టుదిట్టం చేశారు. పాక్ క్రికెట్ బోర్డు చైర్మన్‌గా ఉన్న ఆ దేశ మంత్రి మొహిసిన్ నఖ్వీ బుధవారం లంక జట్టు అధికారులను కలిశారు. దాడి ఘటన గురించి ఆందోళనపడొద్దని, లంక ఆటగాళ్లకు అన్నివిధాలా భద్రత ఉంటుందని ఆ జట్టు అధికారులకు నఖ్వీ హామీ ఇచ్చారు. 2009 మార్చిలో పాకిస్థాన్ పర్యటనకు వచ్చిన లంక క్రికెట్ జట్టు బస్సుపై లాహోర్‌లోని గడాఫీ స్టేడియం సమీపంలో తీవ్రవాదులు దాడులకు పాల్పడ్డారు. దీంతో అంతర్జాతీయ జట్లు పాక్‌లో ఆడేందుకు నిరాకరించడంతో పదేళ్లపాటు ఇక్కడ ఎలాంటి క్రికెట్ సిరీస్‌లు జరగని సంగతి తెలిసిందే.

ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్ విచారణ రేపటికి వాయిదా

హైదరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ ఆ పార్టీ నేతలు వేసిన పిటిషన్‌పై స్పీకర్ విచారణ రేపటికి వాయిదా పడింది. ముందుగా నిర్ణయించిన షెడ్యూలు ప్రకారం.. ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, పోచారం శ్రీనివా‌స్‌రెడ్డి, తెల్లం వెంకట్రావు, అరికెపూడి గాంధీలపై దాఖలైన పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బుధ, గురువారాల్లో విచారణ జరపాల్సి ఉంది. అయితే, ఈ విచారణను శుక్ర, శని వారాలకు వాయిదా వేసినట్లు అసెంబ్లీ కార్యాలయం బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ సమయంలో అసెంబ్లీ పరిసరాల్లో ఆంక్షలు ఉంటాయని, సందర్శకులు ఎవరినీ అనుమతించబోమని పేర్కొంది. విచారణకు హాజరైన వారిని సైతం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడడాన్ని నిషేధించినట్లు అసెంబ్లీ కార్యదర్శి వెల్లడించారు.

పార్లమెంటరీ సంయుక్త కమిటీలో తెలుగు ఎంపీలు

- కె.లక్ష్మణ్, డీకే అరుణ, ఓవైసీలకు స్థానం

న్యూఢిల్లీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగంలోని 130వ సవరణ బిల్లు, జమ్మూకశ్మీర్ పునర్విభజన సవరణ బిల్లు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వ సవరణ బిల్లులపై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ సంయుక్త కమిటీలో తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ఎంపీలకు స్థానం లభించింది. బీజేపీ ఎంపీ అపరాజిత సారంగి సారథ్యం వహిస్తున్న ఈ 31 మంది సభ్యుల కమిటీలో (లోక్‌సభ నుంచి 21 మంది, రాజ్యసభ నుంచి 10 మంది) లోక్‌సభ నుంచి బీజేపీ ఎంపీ డీకే అరుణ, మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జనసేన ఎంపీ బాలాశౌరి వల్లభనేని సభ్యులుగా ఉన్నారు. అలాగే, రాజ్యసభ నుంచి బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్, వైసీపీ ఎంపీ ఎస్.నిరంజన్‌రెడ్డి లు ఈ కమిటీలో భాగమయ్యారు.

స్కూల్ ప్రిన్సిపాల్‌పై పీడీఎస్‌యూ నేతల దాడి

- చందా కోసం బెదిరింపులు, నిరాకరించారని దాడి
- హనుమకొండ కుమార్‌పల్లిలో ఘటన

వరంగల్ క్రైం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): హనుమకొండ కుమార్‌పల్లిలోని స్మైల్ డీజీ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌పై చందా విషయంలో పీడీఎస్‌యూ నేతలు దాడిచేశారని హనుమకొండ సీఐ శివకుమార్ తెలిపారు. ఈ మేరకు పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నర్సంపేట సిద్ధార్థ కళాశాలకు చెందిన గుర్రం అజయ్, మరో వ్యక్తి మర్రి మహేశ్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పీడీఎస్‌యూ 23వ రాష్ట్ర మహాసభల నిర్వహణ కోసం చందా ఇవ్వాలని పీడీఎస్‌యూ నేతలు అడగడంతో పాఠశాల యాజమాన్యం రూ.500 ఇచ్చింది. అయితే పాఠశాల నుంచి వెళ్లకుండా పాఠశాల మహిళా సిబ్బందితో వాదనకు దిగారు. ఇది గమనించిన ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పీడీఎస్‌యూ నేతలను వెళ్లిపోవాలని కోరారు. దీంతో గుర్రం అజయ్ ఆవేశంతో ఊగిపోతూ ప్రిన్సిపాల్ చెంపపై రెండుసార్లు గట్టిగా కొట్టాడు. ఈ క్రమంలో ఫర్నిచర్ ధ్వంసమైంది. సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. ఘటనపై ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు దాడికి నిరసనగా గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలలు, ఇంటర్, డిగ్రీ కళాశాలల బంద్‌కు పిలుపుచ్చినట్లు వడుప్సా వరంగల్, హనుమకొండ, జిల్లా అధ్యక్షులు చల్ల నాగార్జునరెడ్డి, మాదాల సతీష్ తెలిపారు.

పోలీసుల అదుపులోని 10 మంది నక్సల్స్‌ను కోర్టులో హాజరుపర్చాలి..

- పౌరహక్కుల సంఘం డిమాండ్

హైదరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పోలీసులు అదుపులోకి తీసుకున్న 10 మంది నక్సల్స్‌ను కోర్టులో హాజరుపర్చాలని తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా మద్దేడ్ తార్లగూడ అటవీ ప్రాంతంలో బుధవారం ఉదయం కాల్పులు జరిపి పది మంది మావోయిస్టులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారముందని అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నారాయణరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో ఏరియా కమిటీ సభ్యుడు మున్నా సహా పలువురు గాయపడినట్లు తెలిసిందని, వారికి చికిత్స అందించి కోర్టులో హాజరుపర్చాలని డిమాండ్ చేశారు. పట్టుబడిన వారిని ఎన్‌కౌంటర్ చేసే ప్రమాదముందని, ఇప్పటికే 22 నెలలుగా కొనసాగిస్తున్న ఆపరేషన్ కగార్‌లో 80 ఎన్‌కౌంటర్లలో 700 వరకు హత్యలు జరిగాయని తెలిపారు.

క్యూఎస్ వరల్డ్ వర్సిటీ ర్యాంకుల్లో ఐఐటీహెచ్ సత్తా

- ఆసియాలోనే 270వ స్థానం

కంది, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోని అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాల జాబితాలో సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్ చోటు దక్కించుకుంది. 2026 క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకుల్లో ఆసియాలో 270వ స్థానాన్ని సాధించి ఈ మైలురాయిని తాకింది. గత సంవత్సరం ఐఐటీహెచ్ ఆసియాలో 320వ ర్యాంకు సాధించగా, ఈసారి 50 ర్యాంకులు మెరుగుపర్చుకుంది. ప్రపంచవ్యాప్తంగా 1,700 విశ్వవిద్యాలయాల్లో 55 రకాల పాఠ్యాంశాలపై సమగ్ర విశ్లేషణ చేపట్టి క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ఈ ఎడిషన్‌ను రూపొందించింది. అంతర్జాతీయ విద్యావిశ్లేషకుడు క్యాప్సారెల్లి సైమండ్స్ బుధవారం ఈ జాబితాను విడుదల చేశారు. ఈ విశ్లేషణాత్మక అధ్యయనంలో ఐఐటీహెచ్ విశేష ప్రతిభను ప్రదర్శించడం పట్ల ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఐఐటీహెచ్‌లో పరిశోధనా నైపుణ్యం, వినూత్న విద్యా వ్యవస్థ ద్వారా ఆసియాలో వేగంగా అభివృద్ధి చెందుతున్న సంస్థగా నిలిచిందని, ఈ గుర్తింపు ఐఐటీహెచ్‌ను ప్రపంచ స్థాయి సంస్థగా నిర్మించాలనే తమ దృక్పథాన్ని ప్రతిబింబిస్తుందని వెల్లడించారు.

వీఐటీ మారిషస్‌లో ఇంజనీరింగ్ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

చెన్నై, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వేలూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) మారిషస్ ప్రాంగణంలో.. 2026 విద్యాసంవత్సరం(ఫిబ్రవరి, ఆగస్టు) ఇంజనీరింగ్ ప్రోగ్రాంలకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఔత్సాహికులైన విద్యార్థులు www.vitmauritius.mu లో దరఖాస్తు చేసుకోవచ్చు. దీనికి ఎలాంటి ప్రవేశ పరీక్ష అవసరం లేదని, హైస్కూలు పనితీరు, వ్యక్తిగత ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో నిర్వాహకులు పేర్కొన్నారు. మెరిట్‌తో పాటు అవసరమైన విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు కూడా లభిస్తాయని తెలిపారు. విద్యార్థులు తమ అధ్యయన కాలంలో పార్ట్‌టైం జాబ్‌తో పాటు మూడు సంవత్సరాల పోస్ట్-స్టడీ వర్క్ పర్మిట్ కూడా పొందవచ్చని వివరించారు.

ఏఐసీసీ కార్యదర్శిగా కుసుమ్ కుమార్

ఒడిసాలో పార్టీ సహ ఇన్‌చార్జిగా నియామకం

రాష్ట్రంలో కమ్మ సామాజిక వర్గ నేతకు కీలక పదవి.. మొత్తం 8 మందికి ఏఐసీసీ కార్యదర్శులుగా చాన్స్

తెలంగాణకు మరో ఇన్‌చార్జిగా సచిన్ సావంత్.. కుసుమ్‌కు అభినందనలు తెలిపిన టీపీసీసీ చీఫ్



హైదరాబాద్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): టీపీసీసీ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి కుసుమ్‌కుమార్.. ఏఐసీసీ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఒడిసా కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జికి అనుబంధంగా పార్టీ వ్యవహారాలు చూసే బాధ్యతలను అప్పగిస్తూ ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే ఉత్తర్వులు జారీ చేసినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ఓ ప్రకటనలో వెల్లడించారు. దశాబ్దాలుగా కమ్మ సామాజిక వర్గం నుంచి ఏఐసీసీ కార్యదర్శిగా ఎవరూ ఎంపిక కాలేదని, కమ్మ సామాజిక వర్గం ప్రాధాన్యతను గుర్తించిన అధిష్ఠానం.. కుసుమ్ కుమార్‌కు కీలక పదవి అప్పజెప్పిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కాగా, కుసుమ్‌కుమార్‌తో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన మరో 8 మందిని ఏఐసీసీ కార్యదర్శులుగా ఖర్గే నియమించారు. వీరిలో సచిన్ సావంత్‌కు.. మీనాక్షి నటరాజన్‌తో కలిసి తెలంగాణలో పార్టీ వ్యవహారాలు చూసే బాధ్యతలను అప్పగించారు. కాగా, ఏఐసీసీ కార్యదర్శిగా నియమితులైన కుసుమ్‌కుమార్‌కు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషికి ఫలితం దక్కిందన్నారు. తెలంగాణకు మరో ఇన్‌చార్జిగా నియమితులైన సచిన్ సావంత్‌కు స్వాగతం చెప్పారు.

విద్యార్థి దశ నుంచీ కాంగ్రెస్‌లోనే!

ఏఐసీసీ కార్యదర్శిగా నియమితులైన జెట్టి కుసుమ్‌కుమార్.. ఎన్ఎస్‌యూఐ కార్యకర్తగా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా, ఉపాధ్యక్షుడిగా కొనసాగారు. 2003లో ఏపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కుసుమ్.. తెలంగాణ ఏర్పడ్డాక టీపీసీసీలోనూ అదే హోదాలో కొనసాగారు. 2018లో టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమితులయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డి సన్నిహితుడిగా పేరున్న కుసుమ్.. కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. తాజాగా ఏఐసీసీ కార్యదర్శిగా నియమితులయ్యారు.

జాగృతికి బీఆర్ఎస్ దుష్మన్

జాగృతిని విమర్శించడాన్ని ఆ పార్టీ నేతల పని.. ప్రజాసమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం జాగృతి బాధ్యత

- నిర్వాసితుల సమస్య పరిష్కరించకుంటే సీఎం ఇంటి ముందు ధర్నా
- నల్లగొండ పర్యటనలో జాగృతి అధ్యక్షురాలు కవిత



నల్లగొండ, నవంబరు12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ జాగృతికి బీఆర్ఎస్ కూడా శత్రువే (దుష్మన్)నని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. కాంగ్రెస్‌తోపాటు బీఆర్ఎస్ నేతలు కూడా జాగృతిని విమర్శించడాన్ని పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. 'జాగృతి- జనం బాట' కార్యక్రమంలో భాగంగా కవిత బుధవారం నల్లగొండలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. అధికారంలో బీఆర్ఎస్ ఉన్నా, కాంగ్రెస్ ఉన్నా ప్రజాసమస్యలు అలాగే ఉన్నాయని విమర్శించారు. ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి తెచ్చే బాధ్యతను జాగృతి తీసుకుందని చెప్పారు. తప్పు ఎవరు చేసినా తప్పేనని, బీఆర్ఎస్ తప్పులు చేయడం వల్లే ప్రజలు ఆ పార్టీని అధికారం నుంచి తప్పించారని అన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పని చేయకపోతే ప్రజలు వేరే వారికి అధికారమిస్తారని హెచ్చరించారు. పదేళ్ల బీఆర్ఎస్, రెండేళ్ల కాంగ్రెస్ పాలన కలిపి మొత్తం పన్నెండేళ్లలో కృష్ణా జలాలు తెలంగాణకు ఎందుకు తేలేకపోయారో మేధావులు ఆలోచించాలని కోరారు. దేవరకొండ ఎస్సీ గురుకుల పాఠశాల భూములు, భూదాన్ భూముల కబ్జాలపై పదేపదే మాట్లాడి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని కవిత ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితంతో రాష్ట్ర ప్రజలకు ఒరిగేదేమీలేదని అభిప్రాయపడ్డారు. కృష్ణా జలాలు తేవడంలో అలసత్వం ప్రదర్శించినా, భూనిర్వాసితుల సమస్యలు పరిష్కరించకపోయినా నిర్వాసితులతో కలిసి సీఎం ఇంటి ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. అలాగే, నాగార్జున సాగర్ ఎడమ కాల్వను రాష్ట్ర అధీనంలోకి తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం, డిండి ఎత్తిపోతల పథకాలు ఎప్పటికీ పూర్తవుతాయో మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి చెప్పాలని నిలదీశారు. డిండి, నక్కలగండి, నెల్లికల్లు ప్రాజెక్టులు, యాదాద్రి థర్మల్ పవర్‌స్టేషన్ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోళ్లలో అధికారుల అలసత్వం వల్ల రైతులు నష్టపోతున్నారని, పత్తి రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దేవరకొండ వద్ద కొమ్మేపల్లి గురుకుల పాఠశాలలోని సమస్యలపై మంత్రులు, జిల్లా అధికారులు దృష్టి సారించాలని కోరారు. కాగా, ప్రసవానికి వచ్చే మహిళలకు నొప్పుల బాధ నుంచి ఉపశమనం కలిగించేందుకు ఇచ్చే ఎపిడ్యూరల్ ఇంజక్షన్లను ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంచాలని కవిత ప్రభుత్వాన్ని కోరారు. బీఆర్ఎస్ హయాంలో తాను ఈ సదుపాయం కల్పించలేకపోయినందుకు మహిళలకు క్షమాపణలు చెప్పారు.

మంత్రి కోమటిరెడ్డితో పంచాయితీ లేదు

కవిత పర్యటన నేపథ్యంలో జాగృతి కార్యకర్తలు అనుమతి తీసుకోకుండా నల్లగొండలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మునిసిపల్ సిబ్బంది తొలగించారు. దీంతో ధర్నాకు దిగిన జాగృతి కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. దీనిపై కవిత మాట్లాడుతూ.. మంత్రి కోమటిరెడ్డితో తమకు పంచాయితీ లేదని, జాగృతి నాయకులతో పెట్టుకున్న వారెవరూ బాగుపడలేదన్నారు. తమ కార్యకర్తలను విడుదల చేయాలని కోరారు. కవిత పర్యటన తర్వాత జాగృతి కార్యకర్తలను పోలీసులు వదిలిపెట్టారు.

కవిత బీఆర్ఎస్ నేతలనే ప్రశ్నించాలి : మంత్రి కోమటిరెడ్డి



ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ప్రాజెక్టులు, మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఇతర అభివృద్ధి కార్యక్రమాల తాత్సారానికి రాష్ట్రాన్ని పదేళ్ల పాలించిన బీఆర్ఎస్సే కారణమని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. ఆయా అభివృద్ధి పనులపై కవిత ప్రశ్నించాలని అనుకుంటే ముందుగా బీఆర్ఎస్ నేతలను ప్రశ్నించాలని ఆయన సూచించారు. నల్లగొండ పర్యటనలో భాగంగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత చేసిన వ్యాఖ్యలకు ఆయన ఈ మేరకు స్పందించారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు ప్రమాదం వల్ల కొన్ని నెలలు మాత్రమే ఆగాయని, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పనులు చేసేందుకు సర్వే నిర్వహిస్తున్న విషయాన్ని కవిత తెలుసుకోవాలన్నారు. నల్లగొండ ప్రభుత్వాసుపత్రిలో తన సొంత నిధులతో పలు సదుపాయాలు కల్పించానని, చేసింది చెప్పుకోవడం తన నైజం కాదన్నారు. ఇక, కవిత పర్యటన సందర్భంగా ఫ్లెక్సీలు ఏర్పాటు, వాటి తొలగింపు అంశాలు తనకు తెలియదన్నారు. జాగృతి కార్యకర్తలను అదుపులోకి తీసుకొని ఉంటే వదిలేయమని పోలీసులు చెప్పానని వెల్లడించారు.

ప్రజాస్వామ్య పునరుద్ధరణ తర్వాతే తిరిగొస్తా!

- యూనుస్ మూర్ఖత్వంతో భారత్‌తో సంబంధాలు క్షీణిస్తున్నాయ్
- బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా వెల్లడి

కోల్‌కతా, నవంబరు 12: బంగ్లాదేశ్‌లో అందరి భాగస్వామ్యం ఉండేలా ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించిన తర్వాతే తాను స్వదేశానికి తిరిగొస్తానని ఆ దేశ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా స్పష్టం చేశారు. యూనుస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం అవామీ లీగ్ పార్టీపై విధించిన నిషేధాన్ని ఎత్తివేయాలని, ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా నిర్వహించాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రస్తుతం భారతదేశంలో ఆశ్రయం పొందుతున్న ఆమె ఒక ఆంగ్లవార్తా సంస్థకు ఈమెయిల్ ఇంటర్వ్యూలో ఈ వివరాలను వెల్లడించారు. ప్రజలు ఎన్నుకోని యూనుస్ ప్రభుత్వం భారతదేశంతో ఉన్న సంబంధాలను దెబ్బతీస్తోందని ఆమె ఆరోపించారు. తన ప్రభుత్వంలో భారత్‌తో నెలకొన్న 'విస్తృతమైన, లోతైన' సంబంధాలు యూనుస్ పాలనలోని మూర్ఖత్వాన్ని తట్టుకొని నిలబడగలగాలని ఆమె ఆకాంక్షించారు. యూనుస్ ప్రభుత్వం తీవ్రవాద శక్తుల మద్దతుపై ఆధారపడుతోందని ఆరోపించారు. తనకు ఆశ్రయం కల్పించినందుకు భారత ప్రభుత్వానికి, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థుల ఆందోళనల విషయంలో మీ ప్రభుత్వం విఫలమైందా? అని ప్రశ్నించగా, అవునని ఆమె సమాధానం ఇచ్చారు. పరిస్థితిని నియంత్రించలేకపోయామంటూ విచారం వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరుగనున్న ఎన్నికలను బహిష్కరించాలని తాను పిలుపు ఇచ్చినట్టు వచ్చిన వార్తలను ఆమె తోసిపుచ్చారు. అయితే, అవామీలీగ్ లేని ఎన్నికలకు చట్టబద్ధత ఉండదని ఆమె వ్యాఖ్యానించారు. తమ పార్టీకి కోట్లాదిమంది ప్రజల మద్దతు ఉందని చెప్పారు. భారత్‌పై యూనుస్ శత్రుత్వాన్ని మూర్ఖత్వంగా అభివర్ణించారు. పదవి నుంచి దిగిపోయే లోపు యూనుస్ దౌత్యపరంగా మరిన్ని తప్పులు చేయకూడదని ఆమె ఆకాంక్షించారు.





డీజీపీపై కేటీఆర్ వ్యాఖ్యలు అనాగరికం

- పోలీసు సంఘాల తీవ్ర ఆగ్రహం
- క్షమాపణ చెప్పాలని డిమాండ్
- లీగల్ యాక్షన్ తీసుకుంటామని హెచ్చరిక

హైదరాబాద్, నవంబర్12(ఆంధ్రజ్యోతి): డీజీపీ శివధర్‌రెడ్డిని ఉద్దేశించి బీఆర్ఎస్ నేత కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఐపీఎస్ అధికారుల, పోలీసు అధికారుల సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. డీజీపీని లక్ష్యంగా చేసుకుని తెలంగాణ పోలీసు వ్యవస్థపై ఆయన ఆధారరహిత వ్యాఖ్యలు చేశారని, తద్వారా మొత్తం రాష్ట్ర పోలీసు వ్యవస్థను అవమానించినట్లుగా భావిస్తున్నామని ఐపీఎస్ అధికారుల సంఘం కార్యదర్శి విక్రంసింగ్ మాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యలను కేటీఆర్ బేషరతుగా ఉపసంహరించుకోకపోతే... న్యాయపరమైన చర్యలకు వెనుకాడబోమన్నారు. నిర్మాణాత్మక విమర్శలకు ఎల్లప్పుడూ స్వాగతం పలుకుతామని స్పష్టం చేశారు. పోలీసు అధికారులపై అనుచిత వ్యాఖ్యలు ఎవరు చేసినా లీగల్ యాక్షన్ తీసుకుంటామన్నారు. ఓ వార్తా చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రాజకీయ ప్రేరేపిత సంఘటనలను దృష్టిలో పెట్టుకుని డీజీపీపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు.. అభ్యంతరకరంగా, అనాగరికంగా ఉన్నాయని మరో ప్రకటనలో పోలీసు అధికారుల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. వాటిని ఉపసంహరించుకుని, పత్రికాముఖంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. కేటీఆర్ ప్రస్తావించిన అన్ని సంఘటనల్లో కేసులు నమోదు చేశామని సంఘం అధ్యక్షుడు గోపిరెడ్డి పేర్కొన్నారు. పోలీసుల పనితీరులో ఆక్షేపించాల్సినదేమీ లేదని, ఒకవేళ ప్రశ్నించాల్సి వచ్చినా సభ్యత పాటించాలన్నారు.

యుద్ధ ప్రాతిపదికన మేడారం పనులు

డిసెంబరు నెలాఖరుకు పనులన్నీ పూర్తి చేయాలి.. జనవరి 15 నాటికి భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

- గడువులోగా పనులు పూర్తి చేస్తేనే కాంట్రాక్టర్లకు బిల్లులు
- నాణ్యతలో తేడా వస్తే ఉపేక్షించేది లేదు: పొంగులేటి
- మేడారం జాతరకు జాతీయ హోదా ఇవ్వాలి: కొండా సురేఖ
- దేవుళ్లపై రాజకీయం చేస్తున్న ప్రతిపక్షాలు: సీతక్క
- సమ్మక్క సారలమ్మ దీవెనతోనే మంత్రినయ్యాను: అడ్లూరి



మేడారంలో మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి ముచ్చట్లు

వరంగల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడారం మహా జాతర అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని రాష్ట్ర గృహనిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. పనులన్నీ డిసెంబరు 31 నాటికి పూర్తయ్యేలా లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలన్నారు. జనవరి 15లోగా జాతరలో భక్తులకు అన్ని సౌకర్యాలు అందుబాటులోకి రావాలని ఆదేశించారు. 24 గంటలు షిఫ్టుల వారీగా పనులు జరుగుతూనే ఉండాలని, అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. బుధవారం సహచర మంత్రులు కొండా సురేఖ, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి మేడారంలో మహా జాతర పనులను మంత్రి పొంగులేటి పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. మేడారం జాతర పనులను రాబోయే 200 ఏళ్ల వరకు ఉపయోగపడేలా చేపట్టామన్నారు. ప్రస్తుతం జాతరకు రెండు మూడు కోట్ల మంది భక్తులు వస్తున్నారని, పది కోట్ల మంది భక్తులు వచ్చినా ఇబ్బంది లేనివిధంగా సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. 25 రోజుల కిందట పనులు మొదలు పెట్టామని, మాస్టర్ ప్లాన్‌లో మరికొన్ని పనులను ఈ నెల 22 తరువాత చేరుస్తామని అన్నారు. జాతర అభివృద్ధి పనులకు కావాల్సిన 19 ఎకరాల భూసేకరణను అధికారులు త్వరగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. జంపన్నవాగుపై చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, నాలుగు అధునాతన జంతు వధశాలలను ఏర్పాటు చేయాలని సూచించారు.

గడువులోగా పూర్తిచేస్తేనే బిల్లులు..

గడువులోగా పనులు పూర్తి చేస్తేనే బిల్లులు ఇస్తామని మంత్రి పొంగులేటి అన్నారు. గత ప్రభుత్వం తరహాలో జాతర నాటికి కూడా పనులు చేస్తూపోతే కుదరదని స్పష్టం చేశారు. నాణ్యతలో తేడా వస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పనుల పరిశీలనకు ఈ నెల 22న మళ్లీ వస్తామన్నారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ మేడారం జాతరకు జాతీయ హోదా తెచ్చే బాధ్యతను కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వాలు ఏనాడూ జాతరను పట్టించుకోలేదని ఆరోపించారు. రాబోయే తరాలకు కూడా సౌకర్యాలు కల్పించేలా సీఎం రేవంత్‌రెడ్డి మేడారం జాతరను అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. కాగా, ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారంతో దేవుళ్లపై రాజకీయం చేస్తున్నాయని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క విమర్శించారు. వారం, పది రోజుల తరువాత గద్దెల వద్ద ఒక రూపం వస్తుందన్నారు. మేడారంలోని సమ్మక్క, సారలమ్మ తల్లుల ఆశీర్వాదంతోనే తాను మంత్రినయ్యానని గిరిజన సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. మేడారంలో అభివృద్ధి పనులను పరిశీలించేందుకు వచ్చిన మంత్రులకు గిరిజన పూజారులు, దేవస్థానం అధికారులు స్వాగతం పలికారు. మంత్రులు గద్దెల వద్దకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న సమయంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ కాలుజారి ప్రహరీ కోసం తీసిన పునాదిలో పడిపోయారు. పక్కనే ఉన్న మంత్రులు సీతక్క, సురేఖతో పాటు వ్యక్తిగత సిబ్బంది వెంటనే ఆమెను పైకి లేపారు. స్వల్పంగా గాయాలు కావడంతో కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నారు.

మంత్రుల మధ్య విభేదాలకు ఫుల్‌స్టాప్!

మేడారం జాతర పనుల పరిశీలనకు మంత్రులు పొంగులేటి, సీతక్క, అడ్లూరి హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో రాగా, సురేఖ వరంగల్ నుంచి కారులో కాస్త ఆలస్యంగా వచ్చారు. దీంతో పొంగులేటి ఆమెకు ఎదురెళ్లి అక్కా.. అంటూ ఆప్యాయంగా పలకరించి ఆహ్వానించారు. ఆ తరువాత కూడా వారు ఆప్యాయంగా మాట్లాడుకున్నారు. దీంతో వారిద్దరి మధ్య తలెత్తిన విభేదాలకు ఫుల్‌స్టాప్ పడినట్లేనన్న చర్చ జరుగుతోంది.

పటాన్‌చెరులో రోహింగ్యాలు

బెంగాల్‌లోకి చొరబడుతున్న వారిని పరిశ్రమల్లో పనిచేయించేందుకు తరలింపు

స్థానిక కార్మికులకు ఇచ్చేదాంట్లో సగం వేతనానికే పని.. వారికి ఆధార్, బీసీ సర్టిఫికెట్లు.. సహకరిస్తున్న అధికారులు

ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గుడారాల్లో ఆవాసం.. పటాన్‌చెరు మార్కెట్ ప్రాంతంలో రోహింగ్యాలు ఉంటున్నట్లు ప్రచారం

పటాన్‌చెరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరులో అక్రమంగా ఆవాసం ఏర్పాటు చేసుకొని వందలమంది రోహింగ్యాలు స్థానిక పరిశ్రమలు, ఫ్యాక్టరీలో పనిచేస్తున్నట్లు సమాచారం. పశ్చిమ బెంగాల్‌లోకి అక్రమంగా ప్రవేశించిన రోహింగ్యాలను పరిశ్రమలు, ఫ్యాక్టరీల్లోని లేబర్ కాంట్రాక్టర్లు గుట్టుగా పటాన్‌చెరుకు తరలిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఎవ్వరికీ అనుమానం రాకుండా ఉండేందుకు రోహింగ్యాల్లో కొందరికి కాంట్రాక్టర్లు స్థానికంగా ఆధార్ కార్డులు తయారుచేయిస్తున్నారని, ఇందుకు కొందరు రెవెన్యూ అధికారులు సహకరిస్తున్నట్లు తెలుస్తోంది. పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో. రెండు వేల పైచిలుకు కంపెనీలున్నాయి. వీటిల్లో సుమారు లక్ష పైచిలుకు కార్మికులు పని చేస్తున్నారు. కార్మికులకు డిమాండ్ ఉండటంతో వివిధ రాష్ట్రాల నుంచి వారిని తీసుకొచ్చే బాధ్యతను కంట్రాక్టర్లకు అప్పగిస్తారు. ఈ మేరకు బిహార్, యూపీ, ఒడిసా, ఛత్తీస్‌గఢ్ అస్సాం, బెంగాల్ నుంచి కార్మికులను తీసుకొస్తున్నారు. కార్మికులు కంపెనీల్లో చేరగానే వారి మొదటి వేతనంలో కొంత మొత్తాన్ని కాంట్రాక్టర్‌కు ఇస్తారు. కార్మికులకు నివాసం, భోజన సౌకర్యాలు కల్పిస్తారు. కార్మికులతో యాజమాన్యం 12 గంటలు పనిచేయించుకుంటే, ఎనిమిది గంటల వేతనమే వారి ఖాతాల్లోకి వెళుతుంది. మిగిలిన నాలుగు గంటల తాలూకు వేతనాన్ని వారిని పనిలోకి చేర్చిన కాంట్రాక్టరే తీసుకుంటాడు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులకు నెలకు రూ.14వేలు చెల్లిస్తున్నారు. ఇందులో సగం వేతనానికే పని చేయించుకోవడానికి వీలుగా బెంగాల్‌లోకి అక్రమంగా ప్రవేశించిన రోహింగ్యాలను పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోకి కంట్రాక్టర్లు తరలిస్తున్నారు. ప్రధానంగా పటాన్‌చెరు, పాశమైలారం, రుద్రారం, గడ్డపోతారం, ఖాజిపల్లి, ఐడీఏబొల్లారం, బొంతపల్లి పారిశ్రామికవాడల్లోని రసాయన, రబ్బరు పరిశ్రమల్లో రోహింగ్యాలు పనిచేస్తున్నట్లు సమాచారం. రోహింగ్యాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గుడారాల్లో ఉంచుతున్నారు. పటాన్‌చెరు మార్కెట్ ప్రాంతంలోని ఓ భవనంలో పెద్దఎత్తున రోహింగ్యాలు నివాసం ఉంటున్నట్టు ప్రచారం జరుగుతోంది. రోహింగ్యాలకు స్థానిక ముసుగు తొడిగేందుకు ఓ ఆర్‌ఐ వారికి ఇష్టారీతిన బీసీ సర్టిఫికెట్లు మంజూరు చేస్తున్నట్లు, కంపెనీ యజమాని ఇచ్చిన చిరునామా ఆధారంగా ఆన్‌లైన్‌విధానంలో ఆధార్‌కార్డులను పుట్టిస్తున్నట్లు తెలుస్తోంది. పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోకి వచ్చే వరకు బెంగాల్‌లోని మారుమూల గ్రామానికి చెందిన ఆధార్‌కార్డును రోహింగ్యాలు వెంట ఉంచుకుంటున్నారు. పోలీసులు తనిఖీ చేసినా ఆ గ్రామం పేరు రావడంతో వాహనాన్ని వదులుతున్నారు. ఇక్కడికి రాగానే కొత్త ఆధార్ కార్డులు పొంది స్థానికులుగా చెలామణి అవుతున్నారు. ఇటీవల బెంగాల్‌లోని ఓ చెరువులో వేల సంఖ్యలో నకిలీ ఆధార్ కార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

గురుకులాల బకాయిలు విడుదల చేయండి

» ఆర్థిక శాఖకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం



హైదరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, మైనారిటీ గురుకులాల డైట్, అద్దె బకాయిలు, మధ్యాహ్న భోజన బకాయిలు మొత్తం రూ.162.89 కోట్లను వెంటనే విడుదల చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ప్రజాభవన్‌లో ఆర్థిక శాఖ అధికారులు, గురుకుల సంస్థల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని ఎస్సీ గురుకులాలు, హాస్టళ్లు, ఇతర సంస్థలకు సంబంధించిన డైట్, అద్దె, కాస్మెటిక్స్ బకాయిలు రూ.51.36 కోట్లు, మైనారిటీ గురుకులాలు, మైనారిటీ విద్యా సంస్థల డైట్, అద్దె బకాయిలు రూ.47.61 కోట్లను వెంటనే విడుదల చేయాలని చెప్పారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.63.92 కోట్లను కూడా విడుదల చేయాలని ఆదేశించారు. ఆహార నాణ్యతలో ఎక్కడా రాజీ పడొద్దని పేర్కొన్నారు.

సివిల్స్‌లో మెరిసిన 'రాజీవ్ సివిల్స్ అభయ హస్తం' అభ్యర్థులు

» మెయిన్స్‌లో 43 మంది ఉత్తీర్ణత.. ఇంటర్వ్యూలకు ఎంపిక

» అభ్యర్థులకు సీఎం, డిప్యూటీ సీఎం అభినందనలు

హైదరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించిన సివిల్స్ మెయిన్స్ -2025 పరీక్షలో 'రాజీవ్ సివిల్స్ అభయ హస్తం' లబ్ధిదారులు 43 మంది అర్హత సాధించటం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హర్షం వ్యక్తంచేశారు. మంగళవారం వెల్లడైన ఫలితాల్లో అర్హత సాధించిన తెలంగాణ అభ్యర్థులకు వారు బుధవారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. సివిల్స్ పరీక్షలకు సిద్ధమయ్యే పేద అభ్యర్థులకు రూ.లక్ష చొప్పున ప్రోత్సాహ కం అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం గతేడాది 'రాజీవ్ సివిల్స్ అభయ హస్తం' పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. సింగరేణి సంస్థ ద్వారా ఈ మొత్తాన్ని అందిస్తున్నారు. ఈ ఏడాది కూడా సివిల్స్ ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన 202 మంది అభ్యర్థులకు రూ.లక్ష చొప్పున ప్రోత్సాహకాలు అందించారు. వీరిలో 43 మంది తాజాగా మెయిన్స్‌లో ఉత్తీర్ణులై ఇంటర్వ్యూలకు అర్హత సాధించారు. వీరందరికీ గతేడాది మాదిరిగానే ఈసారి కూడా మరో రూ.లక్ష చొప్పున అందించనున్నారు. ఈ పథకం కింద ఇప్పటివరకు 342 మంది అభ్యర్థులకు రూ.3.62 కోట్లు అందించినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. మొదటి సంవత్సరం 140 మంది మెయిన్స్‌కు ఎంపికయ్యారని, అందులో 20 మంది ఇంటర్వ్యూ వరకు వెళ్లారని, ఏడుగురు సివిల్ సర్వీసెస్ సాధించారని వెల్లడించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు నిరంతర నిఘా

» జిల్లాస్థాయిలో 33 ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు.. రాష్ట్రస్థాయిలో 3 ఫ్లయింగ్ స్క్వాడ్‌ల ఏర్పాటు: మంత్రి పొన్నం



హైదరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు తగ్గించడమే లక్ష్యంగా నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇందుకు నిరంతర నిఘా ఉండేలా ఎన్‌ఫోర్స్‌మెంట్ కఠినతరం చేయడంపై రవాణా శాఖ ముఖ్య అధికారులతో సచివాలయంలో మంత్రి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు జిల్లాల వారీగా 33 బృందాలు, రాష్ట్రస్థాయిలో మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ప్రత్యేక బృందాలు ప్రతి రోజు విధిగా ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని చెప్పారు. ముఖ్యంగా ఓవర్ లోడింగ్ లారీలు, బస్సులు, ఇసుక, ఫ్లై యాష్, స్టోన్, బిల్డింగ్ మెటీరియల్ రవాణా వాహనాలు, వాహనాల ఫిట్‌నెస్, పొల్యూషన్, చలానాలపై ఈ బృందాలు తనిఖీలు చేపట్టాలని మంత్రి వివరించారు. ఓవర్‌లోడింగ్ చేసిన వాహనాలకు అదనపు పెనాల్టీ విధించడంతోపాటు ఆ వాహనాన్ని సీజ్ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి స్పష్టం చేశారు. గత వారం చేవెళ్ల సమీపంలో జరిగిన టిప్పర్, ఆర్టీసీ బస్సు ప్రమాదం అనంతరం నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై 2,576 కేసులు నమోదు చేశామని రవాణా శాఖ అధికారులు మంత్రికి వివరించారు. డిసెంబరులో చేపట్టనున్న 'రోడ్డు భద్రత నెలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు.

మహిళలకు ఆటో అనుమతులు

ప్రభుత్వ ఉద్యోగాలు, రాజకీయాల్లో మహిళలకు ప్రత్యేక కోటా అమలు చేస్తున్నట్లే హైదరాబాద్‌తోపాటు రాష్ట్ర వ్యాప్తంగా కొత్త ఆటోలకు అనుమతుల విషయంలోనూ మహిళలకు ప్రత్యేక కోటా అమలు చేయాలని రవాణా శాఖ నిర్ణయించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంటున్నామన్నారు. ఇందుకు కార్యాచరణ రూపొందించాలని రవాణా శాఖ అధికారుల్ని మంత్రి ఆదేశించారు.

ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

» మంత్రి ఉత్తమ్‌కు వ్యవసాయ కమిషన్ విజ్ఞప్తి

హైదరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్లలో రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని, కొనుగోలు కేంద్రాల వద్దే రైతులకు రసీదులు ఇవ్వాలని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు భవానీరెడ్డి, గోపాల్‌రెడ్డి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. తూకం వేసిన ధాన్యాన్ని లారీల ద్వారా రైస్‌మిల్లులకు పంపిస్తున్నారని, అయితే మిల్లుల్లో ధాన్యం దించేవరకు రైతులను బాధ్యులను చేయటం సరైంది కాదని చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. వెంటనే మంత్రి స్పందించి కమిషనర్ స్టీఫెన్ రవీంద్రకు ఫోన్ చేసి.. కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు కమిషన్ సభ్యులు తెలిపారు. రైతులకు కనీస వసతులు కల్పించాలని సూచించారు.

16న ఉపరాష్ట్రపతి, 21న రాష్ట్రపతి పర్యటన

» ఏర్పాట్లు చేయాలని అధికారులకు సీఎస్ ఆదేశం

హైదరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి పర్యటనలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. ఈ నెల 16న ఉపరాష్ట్రపతి, 21న రాష్ట్రపతి హైదరాబాద్‌లో పర్యటిస్తారని తెలిపారు. ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ 16న మధ్యాహ్నం గవర్నర్ హై టీ కార్యక్రమంలో పాల్గొని... రామోజీ ఫిల్మ్‌సిటీలో జరిగే కార్యక్రమానికి హాజరవుతారని వివరించారు. అనంతరం రాత్రి 8 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి న్యూఢిల్లీకి బయలుదేరి వెళతారని తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 21న రాష్ట్రపతి నిలయంలో నిర్వహించే భారతీయ కళామహోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఆరోజు రాత్రి రాజ్‌భవన్‌లో బస చేసి, 22న ఉదయం పుట్టపర్తి పర్యటనకు వెళతారని వివరించారు. ఈ రెండు పర్యటనలకు సంబంధించి భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, బందోబస్త్, ఇతర ఏర్పాట్లు చేయాలని పోలీసు, జీఏడీ, ఫైర్ సర్వీసులు, రోడ్లు- భవనాలు, వైద్య ఆరోగ్య, మున్సిపల్, ఇంధన శాఖలను ఆదేశించారు.

ఇకపై మీసేవ కేంద్రాల్లోనూ డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్

హైదరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లకు సౌకర్యాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు వేసింది. వారు ప్రతి ఏడాది సమర్పించే డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్‌ను ఇకనుంచి మీసేవ కేంద్రాల్లో కూడా అందుబాటులోకి తెచ్చింది. ఈ సేవతో ఇప్పుడు పెన్షనర్లు బ్యాంకులు, ట్రెజరీ కార్యాలయాలకు వెళ్లకుండా ఇంటి నుంచే లైఫ్ సర్టిఫికేట్ సమర్పించుకోవచ్చని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బుధవారం ప్రకటించారు. ఈ నూతన సేవ ప్రజా పాలనకు నిదర్శనమన్నారు. ప్రస్తుతం మీసేవా కేంద్రాల ద్వారా 300కు పైగా ప్రభుత్వ, వ్యాపార సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

మంత్రి తుమ్మల ఆకస్మిక తనిఖీలు

» సమయపాలన పాటించని అధికారులపై ఆగ్రహం

» చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ

హైదరాబాద్, నవంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ, విత్తన ధ్రువీకరణ అథారిటీ, హాకా, చేనేత- జౌళీ శాఖ ప్రధాన కార్యాలయాల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. సమయపాలన పాటించని అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జనరల్ మేనేజర్, మేనేజర్ స్థాయి అధికారులు సైతం సమయానికి రాకపోవడమేంటని నిలదీశారు. విధి నిర్వహణలో అలసత్వాన్ని సహించేది లేదని, సమయపాలన పాటించని అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల కమిషనర్లు, మేనేజింగ్ డైరెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజా సేవ కోసం నియమితులైన అధికారులు, ఉద్యోగులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిర్ణీత సమయానికి కార్యాలయాల్లో ఉండాలని సూచించారు. తనిఖీల సందర్భంగా రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డితో తుమ్మల మాట్లాడారు. సబ్సిడీ విత్తనాల పంపిణీ, కార్పొరేషన్ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించారు.



విత్తనాభివృద్ధి సంస్థ కార్యాలయంలో తుమ్మల తనిఖీలు

'పంట నష్టం'లో పొరపాట్లకు తావు లేకుండా..

పంట నష్టం నివేదికలో పొరపాట్లకు తావు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తుమ్మల తెలిపారు. పంట నష్టం వివరాలను గ్రామ పంచాయతీ కార్యాయాల్లో నోటీస్ బోర్డులపై అంటించి, ఏమైనా అభ్యంతరాలు వస్తే స్వీకరిస్తామని వెల్లడించారు. పంట నష్టం సర్వేపై ఫిర్యాదులొచ్చిన చోట మరోసారి పరిశీలించాలని ఆదేశించినట్లు తెలిపారు. రైతుస్వరాజ్య వేదిక ప్రతినిధులు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులతో సచివాలయంలో మంత్రి తుమ్మల సమావేశమయ్యారు. రైతు స్వరాజ్య వేదిక ప్రతినిధులు లేవనెత్తిన అంశాలపై అధికారులతో సమాధానాలు చెప్పించారు. రైతుల సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. కేంద్రం నుంచి తగిన సహాయం అందకపోవడంతో పత్తి రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సోయాబీన్ రంగు మారినా కొనుగోలు చేయాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు.

మేడిగడ్డ 7వ బ్లాకుపై ఫోకస్

పటిష్టం చేయడమా లేదా సురక్షితంగా తొలగించడమా?

» పరిష్కారాలను సూచించండి

» టెక్నికల్ బిడ్‌లో అర్హత సాధించిన సంస్థలను కోరిన ప్రభుత్వం



ప్రాజెక్టులపై సమీక్ష చేస్తున్న మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల పునరుద్ధరణ విషయంలో జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్డీఎస్ఏ) నిపుణుల కమిటీ చేసిన తుది నివేదిక సిఫారసులకు అనుగుణంగా డిజైన్లు అందించాలని టెక్నికల్ బిడ్లు వేసిన సంస్థలను ప్రభుత్వం కోరింది. ఎన్డీఎస్ఏ సిఫారసుల మేరకు మేడిగడ్డ బ్యారేజీలోని 7వ బ్లాకును పటిష్టం చేయడం లేదా సురక్షితంగా తొలగించే అంశంపై అధ్యయనం జరిపి తగిన పరిష్కారాలను సూచించాలని తెలిపింది. ఈక్రమంలో పక్కనే ఉన్న ఇతర బ్లాక్‌లకు ఎలాంటి నష్టం చేకూరకుండా 7వ బ్లాక్‌ను తొలగించే విధంగా ఈ పరిష్కారాలు ఉండాలని షరతు విధించింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కట్టగా 2023 అక్టోబరు 21న మేడిగడ్డలోని ఏడో బ్లాకు కుంగిపోగా ఆ తర్వాత అన్నారం, సుందిళ్లలో భారీగా సీపేజీలు బయటపడ్డాయి. దీనిపై అధ్యయనం చేసిన ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ వానాకాలానికి ముందు, తర్వాత భూభౌతిక, భూసాంకేతిక పరీక్షలు చేయించి ఆ పరీక్షల నివేదికల అనంతరం బ్యారేజీల పునరుద్ధరణ డిజైన్లు సమర్పించి, సీడబ్ల్యూసీ ఆమోదం తీసుకోవాలని సిఫారసు చేసింది.

పునరుద్ధరణ ఏజెన్సీలతో నేడు భేటీ

కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు అర్హత సాధించిన ఏజెన్సీలతో గురువారం నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు సమావేశం కానున్నారు. ఐదు సంస్థలు టెక్నికల్ బిడ్లు వేయగా అందులో నాలుగు అర్హత సాధించాయి. వాటిలో ఒకటి మద్రాస్ ఐఐటీ, ఆర్వీ కన్సల్టెన్సీ, ఐప్రీసాస్(స్పెయిన్ సంస్థ) జేవీ కాగా మరొకటి పోలవరం ప్రాజెక్టు పనులు చేస్తున్న ఆఫ్రీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్(ముంబై), నిప్పాన్ కోయి ఎంఎన్‌సీ(జపాన్)తో పాటు మరో సంస్థ ఉంది. గురువారం సమావేశం అనంతరం ఈ సంస్థల నుంచి ఈ సంస్థల నుంచి ఫైనాన్షియల్ బిడ్ల దాఖలు కోరుతూ రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. ఇక ఐఐటీ మద్రాస్‌తో కూడిన జేవీకే పనులు అప్పగించాలనే యోచనతో ప్రభుత్వం ఉంది.

వరదలు తగ్గగానే పరీక్షలు

గోదావరిలో ప్రవాహం తగ్గిన వెంటనే కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు పరీక్షలు నిర్వహించి, ఆ తర్వాత పునరుద్ధరణ డిజైన్లు తెప్పించుకొని శాస్త్రీయ పద్ధతుల్లో మరమ్మతులు చేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. బ్యారేజీల పునరుద్ధరణకు అయ్యే వ్యయాన్ని నిర్మాణ సంస్థలే భరించాల్సి ఉంటుందని గుర్తు చేశారు. మేడిగడ్డ బ్యారేజీకి వరద వస్తున్నందున వరద తగ్గుముఖం పట్టగానే కేంద్ర నీటి, విద్యుత్ పరిశోధన సంస్థ(సీడబ్ల్యూపీఆర్ఎస్-పూణే)తో భూభౌతిక, హైడ్రాలిక్ పరీక్షలు నిర్వహించి, ఎంత మేరకు నష్టం జరిగిందో అంచనా వేస్తామన్నారు. పరీక్షల ఫలితాల ఆధారంగా కన్సల్టెంట్లు బ్యారేజీల పునరుద్ధరణకు ప్రణాళిక, డిజైన్లు, అంచనాలను సిద్ధం చేస్తాయన్నారు. కన్సల్టెంట్లు ఇచ్చిన డిజైన్లను సీడబ్ల్యూసీ ఆమోదం తీసుకున్నాకే పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తామన్నారు. విలువైన ప్రజాధనాన్ని బ్యారేజీల నిర్మాణంలో వెచ్చించినందున వాటిని వినియోగంలోకి తేవడమే తమ బాధ్యతన్నారు. బుధవారం సచివాలయంలో బ్యారేజీల పునరుద్ధరణపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. బ్యారేజీల వైఫల్యానికి రాజకీయ జోక్యమే కారణమని జస్టిస్ ఘోష్ కమిషన్ విచారణలో తేలిందన్నారు. ఇంజనీర్లు చేయాల్సిన పనిని రాజకీయ నాయకులు చేయడమే దీనికి కారణమని కమిషన్ నిగ్గు తేల్చిందన్నారు. నీటిపారుదల శాఖలోని సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ కూడా బ్యారేజీల వైఫల్యానికి కారణమనే విమర్శలుండడంతో అత్యున్నత సాంకేతిక అర్హతలు కలిగి, ఐఐటీల సంయుక్త సహకారంతో వాటి పునరుద్ధరణ పనులకి డిజైన్లను తయారు చేయిస్తున్నామన్నారు. సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకి ఛత్తీస్‌గఢ్ నుంచి నిరభ్యంతర పత్రాన్ని సత్వరంగా రాబట్టుకుని ప్రాజెక్టుకి టెక్నికల్ అడ్వైజరీ కమిటీ సాంకేతిక అనుమతులు పొందేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

తుమ్మిడిహెట్టి బ్యారేజీ డీపీఆర్ కోసం టెండర్లు

తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంతో పాటు గ్రావిటీ కెనాల్, టన్నెల్, సుందిళ్ల లింక్‌కు డీపీఆర్ సిద్ధం చేయడానికి వీలుగా నీటిపారుదల శాఖ ఇ-ప్రొక్యూర్‌మెంట్ కింద టెండర్ నోటీసు ఇచ్చింది. సంస్థలు టెండర్లు వేయడానికి ఈనెల 26వ తేదీ మధ్యాహ్నం 3 గంటల దాకా గడువు ఇచ్చారు. డీపీఆర్ అంచనా విలువ రూ.9.94 కోట్లుగా ఖరారు చేయగా ప్రభుత్వం డీపీఆర్ తయారీ కోసం అనుమతినిస్తూ జీవోనెం.278ను జారీ చేసింది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీని రెండు విడతలుగా కట్టాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. డీపీఆర్ తయారీ అనంతరం నిర్మాణ అంచనా వ్యయంపై స్పష్టత రానుంది. తుమ్మిడిహెట్టి బ్యారేజీని 150 మీటర్ల ఎత్తుతో కడితే 129.23 టీఎంసీల దాకా తరలించడానికి వీలుంటుందని అధికారులు తేల్చారు.

కేసీఆర్‌పై జనవరి 19 వరకు చర్యలొద్దు

ఘోష్ కమిషన్ ఆధారంగా చర్యలొద్దన్న మధ్యంతర ఉత్తర్వులను పొడిగించిన హైకోర్టు

హైదరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టులో అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎస్కే జోషి, ఐఏఎస్ స్మితాసభర్వాల్‌పై ఎలాంటి చర్యలు తీసుకోరాదంటూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను వచ్చే ఏడాది జనవరి 19 వరకు పొడిగిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో నిధుల దుర్వినియోగానికి కారణమైన కేసీఆర్, హరీశ్‌రావు ఇతరులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఘోష్ కమిషన్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన విషయం తెలిసిందే. తమ వాదన వినకుండా, సాక్షులను క్రాస్ ఎగ్జామినేషన్ చేసే అవకాశం ఇవ్వకుండా, తమకు వ్యతిరేకంగా నివేదిక ఇవ్వడం చెల్లదని.. దాన్ని కొట్టేయాలని వారు హైకోర్టులో వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లపై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం.. కమిషన్ రిపోర్ట్ ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోరాదని గతంలో మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఈ పిటిషన్లు బుధవారం మరోసారి విచారణకు రావటంతో, కౌంటర్లు దాఖలు చేయడానికి మరింత సమయం ఇవ్వాలని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎస్ రాహుల్ రెడ్డి ధర్మాసనాన్ని కోరారు. అయితే, తగినంత సమయం ఇచ్చినా కేసీఆర్‌కు సంబంధించిన ఒక్క పిటిషన్‌పైనే కౌంటర్ దాఖలు చేశారని ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. చివరి అవకాశంగా కౌంటర్లు దాఖలు చేయడానికి ప్రభుత్వానికి నాలుగు వారాలు, వాటికి ప్రత్యుత్తరం ఇవ్వడానికి పిటిషనర్లకు మూడు వారాలు సమయం ఇస్తున్నామని పేర్కొంది. విచారణను వచ్చే ఏడాది జనవరి 19కి వాయిదా వేసింది.

పిల్లల ఆరోగ్యం కోసం 'బాల భరోసా'!

» త్వరలో ప్రారంభించనున్న సీఎం రేవంత్

» ఇటీవలి సర్వేలో 8లక్షల మందికి వైకల్యాల గుర్తింపు

» వారికి శస్త్రచికిత్సలతోపాటు మెరుగైన వైద్య సహాయం

హైదరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలోపు పిల్లల ఆరోగ్య భవిష్యత్తుకు భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించిన సర్వేలో దాదాపుగా 8 లక్షల మంది చిన్నారుల్లో వయసుకు తగిన ఎదుగుదల లేకపోవడం (పోషకాహార లోపం), రక్తహీనత, వినికిడి, దృష్టి లోపాలు, శారీరక వైకల్యాలు వంటి లక్షణాలు గుర్తించారు. ఈ చిన్నారులందరికీ ఉచితంగా నాణ్యమైన వైద్య సాయం అందించేందుకు 'బాల భరోసా' పేరిట కొత్త పథకాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వైకల్యాలను సరిచేసేందుకు శస్త్రచికిత్సలు చేయడం, వినికిడి యంత్రాల అమరిక..ఇలా అనేక చికిత్సలు ఇందులో ఉంటాయి. వైద్య ఆరోగ్య, మహిళా శిశు సంక్షేమశాఖలు సంయుక్తంగా ఈ పథకాన్ని అమలు చేయనున్నాయి. బాల భరోసాకు ఆరోగ్య శ్రీ పథకాన్ని అనుసంధానం చేయనున్నారు. ఆ పథకం వర్తించని వ్యాధులుంటే.. సీఎం సహాయ నిధి నుంచి డబ్బులు చెల్లించేందుకు కసరత్తు చేస్తున్నారు. కేంద్రం ఆధ్వర్యంలో అమలవుతున్న రాష్ట్రీయ బాల స్వస్థ (ఆర్‌బీఎస్‌కే) పథకాన్ని కూడా బాల భరోసాతో అనుసంధానం చేయనున్నారు. బాల భరోసా పథకాన్ని పకడ్బందీగా అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కొత్త సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తోంది. ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా ప్రతి చిన్నారి వైద్య చరిత్రను ట్రాక్ చేయడం, చికిత్సల పురోగతిని పర్యవేక్షించడం... సులభతరం కానుంది. బాల భరోసా పథకం విజయవంతమైతే.. లక్షలాది మంది చిన్నారులకు బాల్యంలోనే మెరుగైన చికిత్సలు అంది, ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది పడనుంది. ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న బాల భరోసా పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి త్వరలోనే ప్రారంభించనున్నారు.

వాదనలన్నీ వినిపించి.. నోటీసు ఇవ్వలేదంటారా?

కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ పూర్తి సమయం ఇచ్చింది.. సహజ న్యాయసూత్రాలను పక్కాగా పాటించింది

» కమిషన్ నివేదికను ప్రభుత్వం మీడియాకు ఇవ్వలేదు

» అక్రమాలపై దర్యాప్తును ప్రభుత్వం సీబీఐకి అప్పగించింది

» నివేదికను కొట్టేయాలన్న పిటిషన్లకు కాలం చెల్లింది

» కేసీఆర్ నిర్ణయాలతో రాష్ట్రానికి నేరపూరిత నష్టం

» కేసీఆర్ పిటిషన్‌పై హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్



హైదరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్.. మాజీ సీఎం కేసీఆర్‌కు పూర్తిస్థాయి అవకాశం ఇచ్చి వాదనలు విన్నదని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. విచారణకు హాజరై, పూర్తి స్థాయి వాదనలు వినిపించి.. ఇప్పుడు కమిషన్ తనకు నోటీసు ఇవ్వలేదని కేసీఆర్ అనడం సమంజసం కాదని పేర్కొంది. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ యాక్ట్‌లోని సెక్షన్ 8-బీ, సెక్షన్ 8-సీ కింద నోటీసులివ్వకుండా, తన వాదన వినకుండా, సాక్షులను క్రాస్ ఎగ్జామినేషన్ చేసే అవకాశం ఇవ్వకుండా కమిషన్ నివేదిక ఇచ్చిందని, దానిని కొట్టేయాలని కోరుతూ కేసీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తాజాగా కౌంటర్ దాఖలు చేసింది. అందులో పలు కీలక అంశాలను వివరించింది. అవి..

● పిటిషనర్ కేసీఆర్‌కు కమిషన్ పూర్తిస్థాయి సమయం ఇచ్చింది. కమిషన్ నోటీసులు జారీ చేయడమంటేనే కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ యాక్ట్ సెక్షన్ 8-బీ కింద జారీ చేసినట్లు లెక్క. పిటిషనర్ తన వాదనలను పూర్తిస్థాయిలో కమిషన్ ఎదుట వివరించి.. తప్పుదోవ పట్టించే ఉద్దేశంతో నోటీసు ఇవ్వలేదని చెప్పడం సమంజసం కాదు. యాక్ట్ ప్రకారం సెక్షన్ 8-బీ, సెక్షన్ 8-సీ నోటీసుకు ప్రత్యేకమైన ఫార్మాట్ అంటూ ఏదీ లేదు. నోటీసులో సెక్షన్‌ను ప్రస్తావించనంత మాత్రాన తప్పు జరిగిపోయినట్లు కాదు. ఈ వాదన న్యాయసమీక్షకు నిలబడదు. కమిషన్ చేపట్టిన ఎగ్జామినేషన్‌కు పిటిషనర్ ఎలాంటి అభ్యంతరం తెలపలేదనే విషయాన్ని గుర్తించాలి. బ్యారేజీల నిర్మాణానికి అనుమతులు ఉన్నాయని చెప్పిన కేసీఆర్.. దానికి సంబంధించిన ఎలాంటి డాక్యుమెంట్లనూ సమర్పించలేదు. సాక్షులను క్రాస్ ఎగ్జామినేషన్ చేసే అవకాశమిచ్చినా ఉపయోగించుకోలేదు. కమిషన్ సహజ న్యాయసూత్రాలను పక్కాగా పాటించింది.

● కాళేశ్వరం కమిషన్ నివేదిక కాపీని తనకు అందజేయకుండా మీడియాకు విడుదల చేసిందనే వాదన తప్పు. నివేదికను ప్రభుత్వం మీడియాకు ఇవ్వలేదు. దానిపై నిర్ణయం తీసుకోవడంలో భాగంగా మంత్రివర్గానికి సులభంగా అర్థం కావడానికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను అధికారులు సిద్ధం చేశారు. దానివల్ల పిటిషనర్ హక్కులకు ఎలాంటి భంగం కలగలేదు. పిటిషనర్ ప్రతిష్ఠను దెబ్బతీయాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేదు. మీడియాలో వచ్చే కథనాలపై ఆధారపడకూడదని సుప్రీంకోర్టు పలు తీర్పుల్లో చెప్పిన విషయాన్ని పిటిషనర్ గుర్తించాలి.

● అన్ని ప్రభుత్వ రికార్డులను పరిశీలించి, సాక్షులను విచారించిన తర్వాత కమిషన్ పిటిషనర్ పాత్రపై నివేదికను సమర్పించింది. పిటిషనర్ కేసీఆర్ నిపుణుల కమిటీ నివేదికను తొక్కిపెట్టినట్లు, నీటిని నిల్వ చేయడంపై నిర్ణయాలు తీసుకున్నట్లు, ఆ మేరకు అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు కమిషన్ తేల్చింది. ప్రస్తుత ప్రభుత్వం కేసీఆర్‌పై దుష్ప్రచారం చేస్తోందనే ఆరోపణల్లో వాస్తవం లేదు. సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి ఇచ్చిన నివేదికలో ప్రభుత్వ జోక్యం ఎట్టిపరిస్థితుల్లోనూ ఉండదు. ప్రస్తుత కేసులో పరిపాలనాపరమైన లోపాలను, బిజినెస్ రూల్స్‌కు విరుద్ధంగా జరిగిన వ్యవహారాలను కమిషన్ గుర్తించింది. ఏయే తప్పులకు ఎవరు బాధ్యులు అని చెప్పడం కచ్చితంగా కమిషన్ విధుల్లోకే వస్తుంది. ఇది చట్టప్రకారమే జరిగింది. ప్రభుత్వం చర్యలు తీసుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది. కాళేశ్వరం అక్రమాలపై దర్యాప్తు అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం సీబీఐకి అప్పగించింది. ఈ నేపథ్యంలో కమిషన్ నివేదికను కొట్టేయాలని కేసీఆర్ తదితరులు దాఖలు చేసిన పిటిషన్లకు కాలం చెల్లింది.

కేసీఆర్ నిర్ణయాలతో రాష్ట్రానికి నేరపూరిత నష్టం

కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణం విషయంలో ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ తీసుకున్న సొంత నిర్ణయాలతో రాష్ట్రానికి నేరపూరిత నష్టం జరిగిందని తెలంగాణ ప్రభుత్వం హైకోర్టులో దాఖలు చేసిన కౌంటర్‌లో పేర్కొంది. బ్యారేజీల నిర్మాణ ప్రదేశం ఎంపిక, ప్లానింగ్‌లో లోపాలను ఇందులో ఎత్తిచూపింది. పైగా, గంపగుత్త విధానంలో పనులు కట్టబెట్టారని, నిర్ణీత కాలంలో నిర్మాణం చేపట్టనందుకు ఎలాంటి జరిమానాలు విధించకుండా గడువులు పెంచిందని తెలిపింది. బ్యారేజీల నిర్మాణం పూర్తికాకుండానే పూర్తయినట్లు తప్పుడు సర్టిఫికెట్లు జారీ చేశారని, నిర్ణీత వ్యవధికి ముందే బ్యాంకు గ్యారంటీలు విడుదల చేశారని ఆక్షేపించింది. నిర్మాణ ప్రదేశాల్లో తగిన పరీక్షలు చేయకుండానే డిజైన్లు సిద్ధం చేశారని, డిజైన్లకు విరుద్ధంగా బ్యారేజీల్లో నీటిని నిల్వ చేశారని పేర్కొంది. బ్యారేజీలు ప్రధానంగా మేడిగడ్డ తీవ్రంగా దెబ్బతిన్నదని గుర్తు చేసింది. ఈ వైఫల్యానికి ప్రధాన కారకుడు కేసీఆర్ మాత్రమేనని, అఖిల భారత సర్వీసు అధికారులతో పాటు ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు బాధ్యులుగా కమిషన్ తేల్చిందని వివరించింది. కాళేశ్వరం కమిషన్ ఎదుట కేసీఆర్ స్వచ్ఛందంగా విచారణకు హాజరయ్యారని, ఇప్పుడు నివేదిక పక్షపాతంతో ఉందనడం సరికాదని పేర్కొంది.

సచివాలయంలో భారీ ప్రక్షాళన

» ఒకేసారి 134 మంది ఏఎస్‌వోల బదిలీ

» ఉన్నతాధికారుల బదిలీలు జరిగిన ఏడాదికి నిర్ణయం



హైదరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సచివాలయంలో ప్రభుత్వం భారీ ప్రక్షాళన చేపట్టింది. కింది స్థాయిలోని అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఏఎస్‌వో)లను పెద్ద సంఖ్యలో బదిలీ చేసింది. ఉన్నతాధికారుల బదిలీలు జరిగి ఏడాది గడిచిన తర్వాత ఈ నిర్ణయం తీసుకుంది. నిబంధనలకు వ్యతిరేకంగా ఒకే శాఖలో ఏఎస్‌వోలు తిష్ఠ వేశారంటూ గతంలో పలు వార్తలు వచ్చినా పట్టించుకోని ప్రభుత్వం.. తాజాగా 134 మంది ఏఎస్‌వోలను ఒకేసారి బదిలీ చేసింది. దీంతో 12 ఏళ్లకు పైగా ఒకే శాఖలో పని చేస్తున్న ఏఎస్‌వోలకు సైతం స్థానచలనం కలిగింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 134 మందిని సచివాలయంలోని ఒక శాఖ నుంచి మరో శాఖకు మారుస్తూ ఒకే జీవోను జారీ చేశారు. సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ), వ్యవసాయం, పశు సంవర్ధక, బీసీ సంక్షేమం, పౌర సరఫరాలు, అడవులు, విద్యుత్తు, ఉన్నత విద్య, వైద్య ఆరోగ్యం, హోం, సాగునీటి పారుదల, పరిశ్రమలు, కార్మిక, పురపాలక, మైనారిటీల సంక్షేమం, ప్రణాళిక, పంచాయతీరాజ్, రెవెన్యూ, ఎస్సీ అభివృద్ధి, రవాణా, గిరిజన, మహిళా సంక్షేమం, యువజన సర్వీసుల శాఖల నుంచి ఏఎస్‌వోలు బదిలీ అయ్యారు. బదిలీ అయితే ఏఎస్‌వోలలో ప్రధానంగా జీఏడీ నుంచే ఎక్కువ మంది ఉన్నారు. ఈ ఒక్క శాఖ నుంచే ఏకంగా 28 మందిని ప్రభుత్వం బదిలీ చేసింది. సచివాలయంలో ఉన్నత స్థాయి పోస్టుల బదిలీలను ప్రభుత్వం గతేడాదే చేపట్టింది. అదనపు కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, ఉప కార్యదర్శి, సహాయ కార్యదర్శి, సెక్షన్ ఆఫీసర్ వరకు బదిలీలు జరిగాయి. కానీ, కింది స్థాయిలోని ఏఎస్‌వోలను బదిలీ చేయలేదు. వాస్తవానికి ఒకే శాఖలో నాలుగేళ్ల సర్వీసు దాటిన వారిని బదిలీ చేయాలన్న నిబంధనలున్నాయి. అయినా కొంత మంది ఒకే చోట 7, 8 ఏళ్లుగా పని చేస్తున్నారు. విద్యా శాఖలో 12 ఏళ్ల నుంచి ఒకేచోట పని చేస్తున్నవారు కూడా ఉండడం గమనార్హం. అయినా.. ప్రభుత్వం గతేడాది వీరి జోలికి వెళ్లలేదు. తాజాగా ఇలాంటి వారందరికీ స్థానచలనం కల్పించింది.

తగ్గిన జలవిద్యుత్ ఉత్పత్తి

» రూ.10కి చేరిన యూనిట్ ధర

హైదరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వర్షాలు తగ్గుముఖం పట్టడం, ప్రాజెక్టులకు వరద (ఇన్‌ఫ్లో) గణనీయంగా తగ్గిపోవడంతో జలవిద్యుత్ ఉత్పత్తి తీవ్రంగా ప్రభావితమైంది. దీని ఫలితంగా బహిరంగ విపణి (ఓపెన్ మార్కెట్)లో విద్యుత్ ధరలు పెరిగాయి. వారం క్రితం రియల్ టైమ్ మార్కెట్‌లో కేవలం ఒక్క పైసాకే అమ్ముడైన కరెంట్ యూనిట్, బుధవారం అత్యల్పంగా రూ.1.47, అత్యధికంగా రూ.10లకు చేరింది. తెలంగాణ జెన్‌కో జలవిద్యుత్ కేంద్రాలు సాధారణంగా రోజుకు 45 మిలియన్ యూనిట్లకు పైగా ఉత్పత్తి చేస్తాయి. అయితే, ఈనెల 9న 43 మిలియన్ యూనిట్లు, 10న 41 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి కాగా, 11న అది కేవలం 36 మిలియన్ యూనిట్లకు పడిపోయింది. ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టుకు 28 వేల క్యూసెక్కుల వరద మాత్రమే చేరుతోంది. పూర్తిస్థాయిలో జలవిద్యుత్ ఉత్పత్తి జరగాలంటే 55 వేల క్యూసెక్కుల వరద అవసరం. ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లోలు తగ్గడంతో ఉత్పత్తిని అనివార్యంగా తగ్గించుకోవాల్సి వచ్చింది.

72 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

» సంగారెడ్డి, మెదక్‌లలో అక్రమ రవాణా గుట్టురట్టు

అమీన్‌పూర్/తూప్రాన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో రేషన్ బియ్యం అక్రమ రవాణాపై అధికారులు ఉక్కుపాదం మోపారు. బుధవారం జరిగిన రెండు వేర్వేరు ఘటనల్లో మొత్తం 72 టన్నులకు పైగా బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ సమీపంలో జరిగిన తనిఖీల్లో 34.96 టన్నుల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న లారీని స్థానిక పోలీసుల సాయంతో మండల పౌరసరఫరాల అధికారి శ్రీనివాస తేజస్వి పట్టుకున్నారు. హైదరాబాద్‌లోని కాటేదాన్ ప్రాంతంలో సేకరించిన ఈ బియ్యాన్ని గుజరాత్‌కు తరలిస్తున్నట్లు గుర్తించారు. బియ్యం విలువ సుమారు రూ.10.94 లక్షలు ఉంటుందని అమీన్‌పూర్ ఎస్‌ఐ నరేశ్ తెలిపారు. లారీ డ్రైవర్లు కన్నా రాజాభాయ్, రాజాభాయ్‌లను అదుపులోకి తీసుకుని, బియ్యాన్ని పటాన్‌చెరు సివిల్ సప్లై గోదాంకు తరలించారు. ఇక, మెదక్ జిల్లా తుప్రాన్ పట్టణ పరిధి కరీంగూడ వద్ద స్థానిక సీఐ అజయ్‌బాబు, సివిల్ సప్లయ్ ఇన్‌స్పెక్టర్ నర్సింలు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో సంగారెడ్డి జిల్లా పాశమైలారం నుంచి మహారాష్ట్రలోని కొండల్‌వాడి (నాందేడ్)కు వెళ్తున్న లారీని తనిఖీ చేయగా, అందులో 378 క్వింటాళ్ల (సుమారు 37.8 టన్నులు) రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. లారీ డ్రైవర్ వాసిమ్‌ఖాన్‌ను అదుపులోకి తీసుకుని, స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని తూప్రాన్ పౌరసరఫరాల గోదాంకు తరలించినట్లు విజిలెన్స్ రాష్ట్ర డీఎస్పీ రమేశ్ వెల్లడించారు.

అటవీ శాఖ సిబ్బందిపై గిరిజనుల దాడి

» ఏడుగురికి గాయాలు.. నల్లగొండ జిల్లాలో ఘటన



దాడిలో గాయపడ్డ అటవీశాఖ ఉద్యోగి

చందంపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చందంపేట మండలం గువ్వల గుట్టలో అటవీశాఖ సిబ్బందిపై గిరిజనులు బుధవారం దాడి చేశారు. కంబాలపల్లి ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ భాస్కర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గువ్వల గుట్టలోని అటవీ భూమిలో స్థానిక గిరిజనులు పంటలు సాగు చేసుకుంటున్నారనే సమాచారంతో అటవీ శాఖ సిబ్బంది అక్కడికి వెళ్లారు. సాగు చేసేందుకు ఆక్రమిస్తున్న భూమిని వెంటనే ఖాళీ చేయాలని సూచించారు. అయితే తమకు ఆ భూములపై పోడు హక్కులు ఉన్నాయని, కొన్నేళ్లుగా తాము సాగు చేసుకుంటున్నామని అయిదుగురు గిరిజనులు వాదనకు దిగారు. దీంతో భూ యాజమాన్య హక్కు పత్రాలను చూపించాలని అటవీశాఖ సిబ్బంది కోరారు. ఈ క్రమంలో ఆ ఐదుగురు గిరిజనులను జీపులో తీసుకొని వెళ్తుండగా.. గిరిజనులు కొంతమంది గ్రామస్థులతో కలిసి అటవీ శాఖ సిబ్బందిపై రాళ్లు, కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురు అటవీ శాఖ సిబ్బందికి గాయాలు కాగా దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. గాయపడిన వారిలో బీట్ ఆఫీసర్లు మహమ్మద్ ఖాజామెహిద్, కృష్ణ, విష్ణు, సుమన్, కిరణ్‌కుమార్, వాచర్లు శ్రీనివాస్‌కుమార్, చంద్రయ్య ఉన్నారు. ఈ మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళా రైతులకు జాతీయ స్థాయి గుర్తింపు

» చిరు ధాన్యాల సంరక్షణలో జీనోమ్ సేవియర్ అవార్డు

జహీరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాలుగు దశాబ్దాలుగా చిరుధాన్యాలను సాగు చేస్తూ, వాటి సంరక్షణ కోసం కృషి చేస్తున్న దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ(డీడీఎస్) మహిళా రైతులకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని డీడీఎస్ సంస్థలో మహిళా రైతులు సుమారు 80కి పైగా రకాల చిరుధాన్యాల విత్తనాలను సేకరించి భద్రపరుస్తున్నారు. ఈ నేపథ్యంలో మహిళా రైతులకు జీనోమ్ సేవియర్ అవార్డు దక్కింది. బుధవారం ఢిల్లీలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చేతుల మీదుగా పస్తాపూర్ గ్రామానికి చెందిన నాగమ్మ, మెటల్‌కుంట గ్రామానికి చెందిన చంద్రమ్మలు, డీడీఎస్ సంస్థ ఈడీ దివ్య, శాస్త్రవేత్త వరప్రసాద్‌లు సామూహికంగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

గోదావరి కాలుష్యంపై ఎన్జీటీకి వెళ్లండి

» అది ఒక్క రాష్ట్ర సమస్య కాదు: హైకోర్టు

హైదరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నదుల కాలుష్యం.. పర్యావరణ అంశాలపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ)లో పిటిషన్ దాఖలు చేయటం సముచితమని హైకోర్టు అభిప్రాయపడింది. పరిశ్రమల వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా నేరుగా గోదావరిలోకి వదులుతుండటంతో నది, కాల్వలు కలుషితమై ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడుతోందని, దీనిపై కాలుష్య నియంత్రణ మండలి తగిన చర్యలు తీసుకోవడం లేదంటూ న్యాయవాది సంపత్‌కుమార్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. దీనిని చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం బుధవారం విచారించింది. ఇలాంటి అంశాలపై ఎన్జీటీకి లోతైన అవగాహన, నైపుణ్యం ఉంటుందని.. అందువల్ల అక్కడికి వెళ్లాలని పిటిషనర్‌కు సూచించింది. గోదావరి నది కాలుష్య సమస్య చాలా రాష్ట్రాలతో ముడిపడి ఉన్నందున, ఎన్జీటీ అయితే అన్ని రాష్ట్రాలకు నోటీసులు ఇచ్చి విచారణ చేపడుతుందని పేర్కొంటూ విచారణను ముగించింది.

చేప పిల్లల బిల్లులపై హైకోర్టు సీరియస్

» బిల్లులు చెల్లించకుంటే కోర్టులో హాజరుకావాల్సి ఉంటుంది

» ఆర్థికశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సందీప్‌కుమార్‌కు హెచ్చరిక

హైదరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చేప పిల్లల బిల్లులకు సంబంధించి దాఖలైన కోర్టు ధిక్కరణ కేసులో వచ్చే విచారణ తేదీలోపు తమ ఉత్తర్వులు అమలు చేయకపోతే ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా ప్రత్యక్షంగా కోర్టుకు హాజరుకావాల్సి ఉంటుందని హైకోర్టు హెచ్చరించింది. చేపల సీడ్ సరఫరా చేసిన తమకు బిల్లులు చెల్లించడం లేదని శ్రీలక్ష్మి దుర్గా ఫిష్ సీడ్ ఫాం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, బిల్లులు చెల్లించాలని హైకోర్టు గతంలో ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది. ఈ ఆదేశాలు అమలు కాకపోవడంతో పిటిషనర్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు విన్న జస్టిస్ కే శరత్ ధర్మాసనం తమ ఉత్తర్వులను అమలు చేయడానికి నాలుగువారాల సమయం ఇస్తున్నామని.. బిల్లులు చెల్లించకపోతే పిటిషన్‌లో ప్రతివాదిగా ఉన్న ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ప్రత్యక్షంగా హాజరుకావాల్సి ఉంటుందని పేర్కొంటూ విచారణను డిసెంబర్ 5వ తేదీకి వాయిదా వేసింది.

ఉగ్రవాది ఇంట్లో 3 గంటలు సోదాలు

» మొహియుద్దిన్ ఇంటిని జల్లెడ పట్టిన గుజరాత్ ఏటీఎస్

» కంప్యూటర్ హార్డ్ డిస్క్, పత్రాలు, రసాయనాలు స్వాధీనం

» హైదరాబాద్‌లో విస్తృత తనిఖీలు

హైదరాబాద్ సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాద ఆరోపణలతో అరెస్టయిన డాక్టర్ సయ్యద్ అహ్మద్ మొహియుద్దిన్ నివాసంలో గుజరాత్ యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్ (ఏటీ ఎస్)పోలీసులు బుధవారం సోదాలు నిర్వహించారు. రాజేంద్రనగర్‌లోని అతడి నివాసంలో 3 గంటలపాటు సోదాలు నిర్వహించి పలు పత్రాలు, రసాయనాలు, కంప్యూటర్ హార్డ్ డిస్క్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఢిల్లీలో జరిగిన కారు బాంబు పేలుడుకు రెండు రోజుల ముందు ఏటీఎస్ పోలీసులు ముగ్గురు ఉగ్రవాదులను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వీరిలో మొహియుద్దీన్ కూడా ఉన్నాడు. మంగళవారం అర్ధరాత్రి హైదరాబాద్‌కు చేరుకున్న ఏటీఎస్ బృందం.. మొహియుద్దీన్ ఇంటికి రాత్రి 2 గంటలకు చేరుకుంది. ఇంట్లో 3 గంటలపాటు సోదాలు నిర్వహించింది.

నగరంలో కొనసాగుతున్న హై అలర్ట్

ఢిల్లీ కారు బాంబు పేలుడు నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో హై అలర్ట్ కొనసాగుతోంది. గత మూడు రోజులుగా నగరంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రముఖ దేవాలయాలు, ఎంజీబీఎస్, జేబీఎస్ ఇతర బస్టాండ్లు, సికింద్రాబాద్, కాచిగూడ రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లలో సోదాలు నిర్వహిస్తున్నారు. ఆర్పీఎఫ్ పోలీసులు డాగ్‌స్క్వాడ్, బాంబు స్క్వాడ్‌లతో వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. ఇతర రాష్ట్రాలు, దేశాలకు చెందిన వారిని గుర్తించి అన్ని రకాల ధ్రువపత్రాలు పరిశీలిస్తున్నారు.



బాలానగర్ పరిధిలో డాగ్ స్క్వాడ్‌తో పోలీసుల తనిఖీలు

చలి ముట్టడిలో తెలంగాణ

(మొదటిపేజీ తరువాయి)

హెచ్చరించింది. తెలంగాణ రాష్ట్రం తీవ్ర చలి ప్రభావిత (కోర్ కోల్డ్ వేవ్) జోన్‌లో ఉందని కేంద్ర వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ క్లైమెట్ ఛేంజ్ అండ్ హ్యూమన్ హెల్త్ (ఎన్‌పీసీసీహెచ్‌హెచ్) గత ఏడాది ప్రకటించింది. ఈసారి కూడా అదే పరిస్థితి ఉంటుందని వాతావరణ నిపుణులు తెలిపారు. కనిష్ఠ ఉష్ణోగ్రతలు 8.5 డిగ్రీల వరకు పడిపోయే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇక చలి వాతావరణంలో జాగ్రత్తగా ఉండాలని, లేకుంటే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మూడు, నాలుగు రోజులుగా శ్వాసకోశ సమస్యలు, జలుబు, దగ్గు, జ్వరాలతో ఆస్పత్రులకు వస్తున్న రోగుల సంఖ్య పెరుగుతోందని చెబుతున్నారు.

చలి తీవ్రతతో వచ్చే ఆరోగ్య సమస్యలెన్నో

తీవ్రమైన చలి కారణంగా ఎన్నో రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా హైపోథెర్మియా (శరీర ఉష్ణోగ్రత పడిపోవడం), చర్మం లోపలి కణజాలం గడ్డకట్టి గాయాలవడం (ఫ్రాస్ట్‌బైట్) వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది. చల్లని వాతావరణం కారణంగా రోగ నిరోధక శక్తి మందగిస్తుంది. వైరస్‌లు సులభంగా వ్యాప్తి చెందుతాయి. న్యూమోనియా, ఇతర శ్వాసకోశ సమస్యలు తలెత్తుతాయి. ఆస్తమా, సీవోపీడీ (క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్) దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధుల లక్షణాలు తీవ్రతరం అవుతాయి. జ్వరం, దగ్గు, జలుబు, గొంతు నొప్పి, తుమ్ములు, తలనొప్పి, ముక్కు కారడం వంటి సమస్యలు వస్తాయి. ఇక చర్మ సమస్యల (డ్రైస్కిన్, చర్మం పగిలిపోవడం, దురద) తీవ్రత పెరుగుతుంది. తీవ్రమైన చలికి లోనైతే రక్తనాళాలు కుంచించుకుపోవడం వల్ల రక్తపోటు, గుండె సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

వీరికి మరింత అప్రమత్తత అవసరం

చలి తీవ్రత నేపథ్యంలో ముఖ్యంగా చిన్నారులు, పెద్ద వయసువారికి సమస్యలు ఎక్కువగా ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. దివ్యాంగులు, గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువుల నుంచి ఐదేళ్లలోపు వయసున్న చిన్నారులు, చలిలో ఆరుబయట పనిచేసే కార్మికులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. శరీరాన్ని వెచ్చగా ఉంచే దుస్తులు ధరించాలని, గోరు వెచ్చని నీళ్లు తాగాలని చెబుతున్నారు. చేతులకు గౌజులు, పాదాలకు సాక్స్ వేసుకోవాలని, వైరస్ వ్యాప్తి చెందకుండా చేతులు శుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తున్నారు. ఆస్తమా, ఇతర శ్వాసకోశ సమస్యలున్న వారు ఇన్ హేలర్లను దగ్గర ఉంచుకోవాలని, బయటికి వెళితే మాస్క్ ధరించాలని స్పష్టం చేస్తున్నారు. చిన్నారులు, పెద్ద వయసువారు చలి సమయాల్లో బయటికి వెళ్లకపోవడం మంచిదని పేర్కొంటున్నారు.



కుమరం భీం జిల్లా ఆసిఫాబాద్‌లో కమ్ముకున్న పొగమంచు

మరింత పెరగనున్న చలి

రాష్ట్రంలో మరో మూడు నాలుగు రోజుల పాటు చలి తీవ్రత మరింతగా పెరుగుతుందని వాతావరణ కేంద్రం ప్రకటించింది. రాత్రిపూట కనిష్ఠ ఉష్ణోగ్రతలు 8.5 డిగ్రీల నుంచి 12.5 డిగ్రీల మధ్య నమోదవుతాయని పేర్కొంది. చలి తీవ్రతకు సంబంధించి మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల లోపునకు పడిపోవచ్చని హెచ్చరించింది. మిగతా అన్ని జిల్లాల్లో 10-12.5 డిగ్రీల మధ్య కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయంటూ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. కాగా, చలి తీవ్రతతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏజెన్సీ గ్రామాలు వణికిపోతున్నాయి. ఉదయం 9 గంటల వరకు కూడా పొగ మంచు కమ్ముకుంటోంది. మంగళవారం రాత్రి అత్యల్పంగా కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (యూ)లో 10.2 డిగ్రీలు, లింగాపూర్‌లో 10.5, ఆదిలాబాద్ జిల్లా సాత్నాలలో 11.1, బోథ్ మండలం పొచ్చెరలో 11.2 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

చిన్నారులకు చలితో ప్రమాదం



ఉష్ణోగ్రతలు బాగా తగ్గితే నవజాత శిశువుల నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు ఎక్కువ ప్రమాదం. ముఖ్యంగా నవజాత శిశువులకు హైపోథెర్మియా కారణంగా ప్రాణహాని తలెత్తవచ్చు. వారిని వెచ్చగా ఉంచాలి. చల్లటి వాతావరణంతో పిల్లల్లో ఫ్లూ, వైరల్ ఇన్ఫెక్షన్లు పెరుగుతాయి. ఆస్తమా ఉంటే మరింత జాగ్రత్తగా ఉండాలి. వైద్యుల సలహా మేరకు తగిన ఇన్‌హేలర్లు వాడాలి. డిసెంబరు నెలలో చికెన్ పాక్స్, మిజిల్స్ ఇన్ఫెక్షన్ల వ్యాప్తి పెరుగుతుంది. ముందు జాగ్రత్తగా పిల్లలకు టీకాలు ఇప్పించాలి.

- డాక్టర్ ఉషారాణి,
ప్రభుత్వ బోధనాస్పత్రి సూపరింటెండెంట్, నాగర్‌కర్నూల్

'చలి' కేసులు పెరుగుతున్నాయి



చలి తీవ్రతతో జలుబు, దగ్గు, వైరల్ జ్వరాలతో వస్తున్నవారి సంఖ్య మూడు నాలుగు రోజులుగా పెరుగుతోంది. శ్వాసకోశ సమస్యలు పెరుగుతున్నాయి. దీర్ఘకాలిక వ్యాధులు, శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి.

- డాక్టర్ రాజీవ్,
పల్మనాలజిస్టు, కామినేని ఆస్పత్రి, హైదరాబాద్



డాక్టర్లు ఎం.శ్రీనివాసరావు, రామకృష్ణ ఎస్వీకే

గుండె లయ రుగ్మతలకు క్యూ డాట్ చికిత్స!

57 ఏళ్ల మహిళకు విజయవంతంగా నిర్వహించిన బంజారాహిల్స్ కేర్ ఆస్పత్రి వైద్యులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): క్రమరహిత హృదయ స్పందనలతో బాధపడుతున్న ఓ మహిళకు అత్యాధునిక 'క్యూ డాట్' చికిత్స ద్వారా బంజారాహిల్స్ కేర్ ఆస్పత్రి వైద్యులు ఉపశమనం కల్పించారు. గుండె వేగంగా లేదా అసమానంగా కొట్టుకోవడం (ఆట్రియల్ ఫైబ్రిలేషన్ అబ్లేషన్)తో బాధపడుతున్న 57 ఏళ్ల మహిళకు క్యూ డాట్ సాంకేతికత ద్వారా శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తి చేశామని కేర్ ఆస్పత్రి కార్డియాక్ ఎలక్ట్రోఫిజియాలజీ క్లినికల్ డైరెక్టర్ రామకృష్ణ ఎస్వీకే తెలిపారు. బుధవారం ఆస్పత్రిలో ఆయన మాట్లాడుతూ.. క్యూ డాట్ రాక దేశంలో గుండె దడ చికిత్సలో ఒక పెద్ద ముందడుగు అని చెప్పారు. ఈ అత్యాధునిక ఎలక్ట్రోఫిజియాలజీ పద్ధతిని ఉపయోగించిన ఆస్పత్రుల్లో ఒకటిగా కేర్ నిలిచిందన్నారు. దీర్ఘకాలిక అరిథ్మియాతో బాధపడుతున్న రోగులకు ఈ చికిత్స ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు పర్యవేక్షణలో ప్రస్తుతం బాధితురాలు చికిత్స పొందుతోందని.. శస్త్రచికిత్స తర్వాత ఆమె గుండె లయ సాధారణ స్థాయికి వచ్చిందని వివరించారు.



కస్టమ్స్ అధికారుల అదుపులో ఇద్దరు నిందితులు, స్వాధీనం చేసుకున్న ఎలక్ట్రానిక్ వస్తువులు

శంషాబాద్ విమానాశ్రయంలో 4.3 కోట్ల గంజాయి పట్టివేత

» ఓ ప్రయాణికుడి అరెస్టు..

» మరో ఘటనలో 1.4 కోట్ల విలువైన ఎలక్ట్రానిక్ పరికరాల స్వాధీనం

శంషాబాద్ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఓ ప్రయాణికుడి నుంచి 4.3 కిలోల గంజాయిని (డీఆర్ఐ) డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకాక్ నుంచి సలీం అనే ప్రయాణికుడు ఇండిగో విమానంలో బుధవారం తెల్లవారుజామున శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాడు. డీఆర్ఐ అధికారులు అతడి బ్యాగులు తనిఖీ చేయగా 4.3 కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. దీంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. దీని విలువ దాదాపు రూ.4.3 కోట్లు ఉంటుందని.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇటు ఎలక్ట్రానిక్ వస్తువులను అక్రమంగా రవాణా చేస్తున్న మరో ఇద్దరు నిందితులను కూడా కస్టమ్స్ అధికారులు అరెస్టు చేశారు. సూర్యప్రకాశ్‌రాజు, మహ్మద్ జహంగీర్ అనే ఇద్దరు ప్రయాణికులు మంగళవారం అర్ధరాత్రి అబుదాబి ఈవై 358 విమానంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. వారి బ్యాగులు తనిఖీ చేయగా.. నిషేధిత 8 డీజేఐ డ్రోన్లు, 65 ఐఫోన్లు, 2 ల్యాప్‌టాప్‌లు, 20 యాపిల్ వాచ్‌లు, తదితర ఎలక్ట్రానిక్ వస్తువులున్నట్లు గుర్తించారు. వాటికి సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశారు. వాటి విలువ రూ.1.4కోట్లు ఉంటుందని కస్టమ్స్ అధికారులు వెల్లడించారు.

శంషాబాద్ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు

శంషాబాద్ విమానాశ్రయంలో బాంబు పెట్టామంటూ బెదిరింపు మెయిల్ రాగా.. భద్రతా బలగాలు తనిఖీలు నిర్వహించి అంతా ఉత్తిదేనని తేల్చాయి. ఢిల్లీలో పేలుళ్ల నేపథ్యంలో ఇప్పటికే ఎయిర్‌పోర్టులో హైఅలెర్ట్ కొనసాగుతోంది. బుధవారం మధ్యాహ్నం 3.35 గంటలకు గుర్తు తెలియని దుండగులు గురుగ్రామ్‌లోని ఇండిగో కాల్ సెంటర్‌కు బెదిరింపు మెయిల్ పంపించారు. అందులో శంషాబాద్‌ను కూడా ప్రస్తావించారు. ఈ నేపథ్యంలోనే అప్రమత్తమైన బలగాలె భద్రతను కట్టుదిట్టం చేశాయి. బాంబు బెదిరింపుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కనకయ్య తెలిపారు.

వైద్యం ఖర్చు తడిసి మోపెడు!

ఈ ఏడాది 13-14% పెరిగే చాన్స్.. బంగారం, వెండి ధరల కన్నా వేగంగా పెరుగుదల

» వైద్య ద్రవ్యోల్బణంలో ఆసియాలోనే భారత్ టాప్

» వైద్య ఖర్చులతో ఏటా 3 కోట్ల మంది పేదరికంలోకి..

» వెల్లడించిన పలు సర్వే నివేదికలు

హైదరాబాద్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : పదేళ్ల కిందట కార్డియాక్ బైపాస్ సర్జరీ చేయించుకోవాలంటే రూ.2.50 లక్షల ఖర్చయ్యేది.. కానీ, ప్రస్తుతం మెట్రో నగరాల్లో అదే ఆపరేషన్ చేయించుకోవడానికి రూ.4.5-6 లక్షలు అవుతోంది. ఐదేళ్ల కిందట క్యాన్సర్ చికిత్స వ్యయం రూ.8-10 లక్షల మేర ఉండగా, ప్రస్తుతం అది రూ.15-25 లక్షలకు పెరిగింది. దేశంలో మునుపెన్నడూ లేనంత శరవేగంగా వైద్య ఖర్చులు పెరుగుతున్నాయి. భారత్‌లో ఆరోగ్య సంరక్షణ ఖర్చు ఈ ఏడాది 13-14% మేర పెరిగే అవకాశం ఉన్నట్లు ఇటీవల విడుదలైన పలు సర్వే నివేదికలు వెల్లడించాయి. వైద్యసేవలు, చికిత్స ఖర్చులు కాలక్రమేణా పెరగడాన్ని వైద్య ద్రవ్యోల్బణంగా వ్యవహరిస్తారు. భారత్‌లో సాధారణ ద్రవ్యోల్బణం రేటు 4-6శాతం మధ్య ఉండగా, వైద్య ద్రవ్యోల్బణం రేటు ఏటా 12-15 శాతంగా కొసాగుతోంది.




దేశంలోని మధ్య తరగతి కుటుంబాలకు ఇది పెనుభారంగా మారుతోంది. ఆధునిక చికిత్సలు, దిగుమతి చేసుకున్న వైద్య పరికరాల కారణంగా వినియోగదారులపై పడే వైద్య ద్రవ్యోల్బణం 13శాతం మేర ఉంటోందని నిపుణులు పేర్కొంటున్నారు. వైద్య ఖర్చుల కారణంగా దేశంలో ఏటా 3 కోట్ల మంది పేదవారు అయిపోతున్నారని మరో సర్వే వెల్లడించింది. ఆసియాలోని ఇతర దేశాలతో పోల్చినా భారత్‌లోనే వైద్య ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉందని పేర్కొంది. చైనాలో 12%, ఇండోనేషియా, వియత్నాం, ఫిలిప్పీన్స్‌లో 10%లోపే ఉందని తెలిపింది.

పెరుగుదలకు కారణాలేంటి?

భారత్‌లో వైద్య ఖర్చులు విపరీతంగా పెరగడానికి కొన్ని కారణాలు ఉన్నాయి. సర్వే నివేదికలు వెల్లడించిన వివరాల ప్రకారం భారత్‌లోని నగర, పట్టణ ప్రాంత ప్రజలు అత్యాధునిక, మెరుగైన చికిత్స కోరుకుంటున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వైద్యం కారణంగా ఖర్చు పెరుగుతోంది. ముఖ్యంగా ఎంఆర్ఐ, రోబోటిక్ సర్జరీ వంటి దిగుమతి చేసుకున్న యంత్రాల వల్ల చికిత్స ఖర్చు ఎక్కువవుతోంది. డాక్టర్లు, నర్సుల కొరత కారణంగా వారి వేతనాలు పెరిగి, చివరికి ఆ భారం రోగులపై పడుతోంది. దిగుమతి చేసుకునే వస్తువులపై రూపాయి మారకపు విలువ, ఆస్పత్రుల నిర్వహణ భారం.. అంతిమంగా వైద్య ఖర్చుపై ప్రభావం చూపుతున్నాయి. ఆస్పత్రుల్లో చికిత్సల ఖర్చు పెరిగినప్పుడు.. బీమా సంస్థలు చెల్లించే క్లెయిమ్ మొత్తాలూ పెరుగుతాయి. ఇది నేరుగా ప్రీమియంలపై ప్రభావం చూపుతోంది. వైద్య ద్రవ్యోల్బణాన్ని ఆపలేకపోయినా.. దాని ప్రభావాన్ని తగ్గించుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. బీమా సంస్థను ఎంచుకునే ముందు పాలసీల ఫీచర్లు, మినహాయింపులు, ప్రీమియంలను పోల్చి చూసుకోవాలని కోరుతున్నారు. వ్యక్తిగత పాలసీల కంటే ఫ్యామిలీ ఫ్లోటర్ ప్లాన్లు చౌకగా లభిస్తాయని పేర్కొంటున్నారు. బీమాతోపాటు ఊహించని వైద్య ఖర్చుల కోసం అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు.

ఆర్టీసీకి ఈవీ బస్సులతో తిప్పలు!

బ్రేక్ డౌన్లు, నిర్వహణ సమస్యలు, ప్రమాదాలు.. ప్రయాణికులు బస్సు కోసం కాదు.. చార్జింగ్ కోసం నిరీక్షణ!



పారామీటర్	డీజిల్ బస్సు	ఈ-బస్సు	వ్యత్యాసం
ప్రతి 10 వేల కిలోమీటర్లకు బ్రేక్‌డౌన్ రేటు	0.01	0.25	0.24
ప్రతి లక్ష కిలోమీటర్లకు యాక్సిడెంట్ రేటు	0.05	0.39	0.34
రద్దు శాతం	1.59	14.51	12.92

హైదరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాలుష్య రహిత, పర్యావరణహితమైన ప్రయాణ సదుపాయం కోసం, ఇంధన ఖర్చులు తగ్గించుకోవాలనే సదుద్దేశంతో ఆర్టీసీ విద్యుత్ బస్సుల(ఈవీ) వాడకాన్ని ప్రోత్సహిస్తోంది. అయితే, ఆచరణలో మాత్రం ఆశించిన ఫలితాలను పొందలేకపోతోంది. ఈ బస్సులు తరచూ రోడ్లపైనే మొరాయించడం, సాంకేతిక లోపాలు తలెత్తడం, తగినన్ని చార్జింగ్ స్టేషన్లు లేకపోవడం వంటి సమస్యలు ప్రయాణికులకు, ఆర్టీసీ సిబ్బందికి పెద్ద తలనొప్పిగా మారాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లోని వివిధ మార్గాల్లో 260 ఈవీ బస్సులు నడుస్తుండగా, మూడు నెలల్లో మరో 250 కొత్త బస్సులు అందుబాటులోకి రానున్నాయి. హైదరాబాద్‌కు కేంద్ర ప్రభుత్వం 2 వేల ఈవీ బస్సులు కొత్తగా కేటాయించింది. 2025 చివరి నాటికి 1,850 ఈవీ బస్సులు రోడ్డుపైకి తెచ్చే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది.ప్రయాణికుల్ని ఆకర్షించేందుకు టిక్కెట్టు ధరల్లో రాయితీలు ప్రకటిస్తున్నా.. ఈవీ బస్సులకు ప్రయాణికుల నుంచి పెద్దగా ఆదరణ లభించడం లేదు. ముఖ్యంగా విజయవాడ మార్గంలో నడుపుతున్న ఈవీ బస్సులను, చార్జింగ్ కోసం మార్గమధ్యంలో నిలుపుతుండటంతో ప్రయాణికులు గంటల తరబడి వేచిచూడాల్సి వస్తోంది. ఇప్పటికే వాడుకలో ఉన్న డీజిల్ బస్సులతో, ఈవీ బస్సుల పనితీరును ఆర్టీసీ అధికారులు అంతర్గతంగా బేరీజు వేసుకున్నప్పుడు కూడా.. సర్వీస్ విషయంలో డీజిల్ బస్సుల పనితీరే మెరుగ్గా ఉన్నట్లు తేలింది.

ప్రమాదాలు ఇలా...

- సికింద్రాబాద్ కంటోన్మెంట్ డిపోలో చార్జింగ్ సమయంలో విద్యుత్ షాక్ కారణంగా ఈవీ బస్సుకు మంటలు అంటుకున్నాయి.
- హైదరాబాద్-బెంగళూరు మార్గంలో ఈవీ బస్సు బ్రేక్ డౌన్ కారణంగా గంటల సమయం ప్రయాణికులు వేచి చూడాల్సి వచ్చింది.
- వర్షంలో వైపర్, బ్రేకులు సరిగా పనిచేయకపోవడంతో ఈసీఐఎల్ మార్గంలో బస్సు డ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.
- బస్సులో ఓవర్‌లోడ్ కారణంగా నిర్మల్ డిపో ఈవీ బస్సు వెనుక టైర్లు పేలిపోయాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.